# మేలినోము

కుంటిమద్ది శేషశర్మ



తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

# మేలినోము

వ్యాఖ్యానం

శ్రీ కుంటిమద్ది శేషశర్మ

ప్రచురణ
కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.
2009

# MELINOMU

(Translation and Commentary by
**Sri Kuntimaddi Seshasarma)**

*Edited By*
**M. Ramakrishna Sastry**

© All Rights Reserved

T.T.D.Religious Publications Series No. 382

First Edition : 1991

Reprint : 2009

Copies : 2000

*Published by*
**K.V.Ramanachary,** I.A.S.,
Executive Officer
Tirumala Tirupati Devasthanams
Tirupati

*Printed at*
Tirumala Tirupati Devasthanams Press
Tirupati.

# ఆముఖం

శ్రీవిల్లిపుత్తూరులో విష్ణుచిత్తుడనే పెరియాళ్వారుకు తులసీవనంలో లభించిన కుమార్తె ఆండాళ్. ఈమె ఆళ్వారులలో ఒకతె. తల్లిదండ్రులు ఆమెకు పెట్టిన పేరు 'కోదై'. ఈ పదానికి 'పూలమాల' అని అర్థం. విష్ణుచిత్తుడు వటపత్రశాయి అయిన శ్రీమహావిష్ణువుకు ప్రతినిత్యం సమర్పించే తోమాలల్ని ముందుగా ఈమె ధరించి తరువాత వాటిని మన్నారుస్వామికి ఇస్తూవుండడంతో ఆండాళ్‌కు ఆముక్తమాల్యద, శూడికొడుత్తనాచ్చియార్ అనే పేర్లు సిద్ధించాయి. 'కోదై' అనే పదం తెలుగులో గోదాదేవిగా మారింది. భూదేవి అంశంలో జన్మించిన ఈ తల్లి గోపికలు శ్రీకృష్ణుడిని భజించిన విధంగా విష్ణువునే నిరంతరం స్మరిస్తూ స్వామినే భర్తగా వరించి పొందిన మహాసాధ్వి. పరిమళించిన కన్నెవలపునే శ్రీరంగనాథుడికి కర్పూరహారతిగా నివేదించిన మహాప్రేమ తపస్విని గోదాదేవి.

నాలాయిర దివ్యప్రబంధంలో ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న తిరుప్పావై, తిరుమొళి ఆండాళ్ రచనలు. మాసాల్లో శ్రేష్ఠమైనదిగా చెప్పబడే ధనుర్మాసంలో (మార్గశీర్షం) ప్రతి శ్రీ వైష్ణవాలయంలోనూ ఉదయాత్పూర్వమే భక్తులు గానం చేసే తిరుప్పావైలోని పాశురాలు శ్రవణసుభగాలై హృదయాన్ని ద్రవింపజేసి తన్మయుల్ని కావిస్తాయనడంలో సందేహం లేదు. ఇందులోని ముప్పై పాశురాల్లో ప్రతి ఒక్కటీ ఒక జాతి రత్నం.

సుప్రసిద్ధ పండితులు శ్రీమాన్ కుంటిమద్దిశేషశర్మగారు ద్రావిడ భాషలోని తిరుప్పావైని 'మేలినోము' అనే పేరుతో మనోజ్ఞంగా ఆంధ్రీకరించి వ్యాఖ్యానించారు. మేలినోము అనగా ఉత్తమమైన వ్రతమని అర్థం. గోపికలు శ్రీకృష్ణపరమాత్మతో నిత్యసాన్నిహిత్యాన్ని కోరి ఆచరించిన వ్రతానికి శ్రీవ్రత మని పేరు. గోదాదేవి సైతం స్వామిని ప్రేమించి ఈ వ్రతాన్ని ఆచరిస్తూ రోజుకొక పాశురం చొప్పున రచించి ముప్పై దినాలు ధనుర్మాసంలో స్వామిని కీర్తించి తరించింది.

సకల సంపత్కరమూ, అభీష్టఫలప్రదాయి అయిన తిరుప్పావైలోని వైశిష్ట్యాన్ని ఆంధ్రపాఠక మహాశయులకు అందజేయాలనే ఆశయంతో తి.తి.దేవస్థానాలు "మేలినోము"ను ప్రచురించడం జరిగింది. పుస్తక ప్రతులు అచిరకాలంలోనే అయిపోవడంతో మరల ముద్రిస్తున్నాం. పాఠకులు మా యీ కృషికి సార్థకతను చేకూరుస్తారని మా విశ్వాసం.

**కార్యనిర్వహణాధికారి,**
తి.తి.దేవస్థానములు, తిరుపతి.



# పాశురసూచి


| | పుట | | పుట |
|---|---|---|---|
| 1 పాశురము | 4 | 2 పాశురము | 16 |
| 3 పాశురము | 30 | 4 పాశురము | 35 |
| 5 పాశురము | 41 | 6 పాశురము | 52 |
| 7 పాశురము | 63 | 8 పాశురము | 68 |
| 9 పాశురము | 72 | 10 పాశురము | 75 |
| 11 పాశురము | 80 | 12 పాశురము | 84 |
| 13 పాశురము | 92 | 14 పాశురము | 94 |
| 15 పాశురము | 99 | 16 పాశురము | 102 |
| 17 పాశురము | 107 | 18 పాశురము | 114 |
| 19 పాశురము | 118 | 20 పాశురము | 121 |
| 21 పాశురము | 128 | 22 పాశురము | 134 |
| 23 పాశురము | 138 | 24 పాశురము | 141 |
| 25 పాశురము | 144 | 26 పాశురము | 148 |
| 27 పాశురము | 151 | 28 పాశురము | 154 |
| 29 పాశురము | 159 | 30 పాశురము | 162 |

# మేలినోము

కలియుగము ఆరంభమైనది మొదలు ధర్మోద్ధరణకు ద్రావిడ దేశమున పలువురు మహాత్ములు అవతరించిరి. వారిలో పేరెన్నికగన్న వారు పన్నిద్దరు ఆళ్వారులు. వీరినే దివ్యసూరులనియు కీర్తింతురు.

భూతం సరశ్చ మహదాహ్వయ భట్టనాథ
శ్రీభక్తిసార కులశేఖరయోగివాహాన్,
భక్తాంఘ్రిరేణు పరకాల యతీంద్రమిశ్రాన్
శ్రీమత్పరాంకుశమునిం ప్రణతోఽస్మి నిత్యమ్.

అను పద్యమున పన్నిద్దరు భక్తశిఖామణులు పేర్కొనబడిరి. పరమయోగివిలాసమున వీరి విలాసములు రమణీయముగ కూర్చబడినవి. వీరందరిలో ఒక్కతయే కాంతామతల్లి. ఆమెయే గోదాదేవి. ఈమె కథనే శ్రీకృష్ణదేవరాయలు "ఆముక్తమాల్యద" అను ప్రౌఢప్రబంధముగ సంతరించినాడు. దానికే విష్ణుచిత్తీయమని నామాంతరము.

విష్ణుచిత్తులు పెరియాళ్వార్ అని, భట్టనాథులని వాసికెక్కినవారు. వీరు కలియుగాదిని 47 క్రోధననామ సంవత్సర మిథునమాస శుక్ల పక్షమున స్వాతీనక్షత్రమున ఏకాదశినాడు భానువాసరమున గరుడాంశమున పురశ్చూడులను వైష్ణవ బ్రాహ్మణవంశమున శ్రీ పద్మైయార్ ముకుందాచార్య దంపతుల కవతరించిరి. చిన్ననాటి నుండియు భగవత్సేవాపరులై శ్రీవిల్లిపుత్తూరునందు వటపెరుంగోయిల్ దివ్య సన్నిధిలో వటపత్రశాయి పెరుమాళ్ళకు మాలాకైంకర్య మొనర్చు చుండిరి.

వారికి ఒక్కనాడు తులసివనమున, కలియుగమున 98వ నళ సంవత్సర కర్కాటకమాస శుక్లపక్ష చతుర్దశినాడు మంగళవారమున పుబ్బానక్షత్రమున భూదేవియంశమైన ఒక్క శిశువు పొడచూపినది. ఆమె నల్లారుముద్దుగ పెరియాళువారు పెంచుకొనిరి. ఆమెయే గోదాదేవి.

ఆమె దిన దిన ప్రవర్ధమాన యగుచు, భగవదనురక్తయైనది. తండ్రి భగవంతునికై కట్టి పూలసజ్జయందుంచిన మాలికను తొలుత తాను కొప్పున ముడుచుకొని, అందము చూచుకొని, మురిసి, మరల ఆ మాలసు బుట్టయం దుంచెడిది. ఒక్కనా డీమె యీ కార్యమును పరికించి, తాల్చిన దండను భగవంతునికి అర్పింపరాదని, నాటికి పెరు మాళ్ళకు మాలను సమర్పించలేదు భట్టనాథులు. భగవంతుడు స్వప్న మం దా విష్ణుచిత్తులకు దర్శన మిచ్చి "ఆమె భూదేవి అంశస్వరూపిణి. ఆమె ముడుచుకొన్నందుననే ఆ మాలిక కా దివ్యగంధము లభించినది. ఆమె తాల్చిన మాలయే నాకు భోగ్యము. నిత్యము ఆమె తాల్చిన మీదటనే నాకు సమర్పించవలయు"నని ఆదేశించెను. అందువలననే ఆమెకు "ఆముక్తమాల్యద"అని నామము స్థిరపడినది. "ముడిచిన మాల నర్పించింది" అని దాని కర్థము.

ఆమె రచించినది భాగవతశేఖరులచే నిత్యానుసంధేయమైనది "తిరుప్పావై" అని వాసిగాంచిన ప్రబంధము. దానికి తెనుగుసేత, వివరణములే ఈ "మేలినోము."

నీలచన్గొండ శిఖరాల నిద్రమున్గు
కృష్ణు మేల్కొల్పి, వేదనిర్ణీత తత్వ
రత్నమెటిఁగించి భుక్తహారమునగట్టి
బలిమి భోగించు గోదకు వందనములు.

పూర్వము వ్రేపల్లెయందు గొల్లకన్నెలు కృష్ణునితో కలసి మెలసి యాటలాడుచుండ, పెద్దలు వారించిరి. కృష్ణ విరహమునకు వారు అట మటించుచుండిరి. అంతట అనావృష్టి యేర్పడినది. ఆ కాటకమును నివారించుటకు కృష్ణనాయకత్వమున మార్గశీర్షవ్రత మాచరింపుడని గొల్లపిల్లలను పెద్దలే నియమించిరి. ఆ గొల్లకన్నియ లీ వ్యాజముతో కృష్ణసన్నిధాన భాగ్యముమ అతని యను గహమును సంపాదింప మత్స హించి యా వ్రత మనుష్ఠించిరి.

అట్టులనే గోదాదేవి, తాను గొల్లపడుచులకు నాయకురాలిననని తల పోయుచు, భగవదనుగ్రహ ప్రాప్తికై యనుష్ఠించు వ్రతానుష్ఠానమున

తోడికన్యలను ఆ వ్రతము సలుప పురికొల్పుట, స్వామికి సుప్రభాత ప్రబోధము, వాంఛితార్థ ప్రాప్తియు నితివృత్తము గాగల ముప్పది పాశురముల తమిళగ్రంథము తిరుప్పావై.

ఇందు మానవజన్మ మెత్తినవారి కవశ్య మాచరణీయము పేర్కొన బడినది. ధర్మార్థ కామ మోక్షములు పురుషార్థములు మానవజన్మ మెత్తిన స్త్రీ పురుషులు సాధించవలసిన ప్రయోజనములు.

వేనిని సాధించిన మనుష్యజన్మ సార్థకమగునో; వేనిని సాధింప కున్న అది నిరర్థక మగునో అవి పురుషార్థములు.

బైటి శరీరము ప్రాకృతము. పంచ భూతాత్మకమైన ప్రకృతి వల్ల నేర్పడినది. కనిపించు పైతొడుగైన ఆ శరీరము నానావిధము. క్రిమి కీట పక్షి గో వ్యాఘ్ర మానవ దైవాది నానా రూపములలోని జీవులు అణు స్వరూపులు. కంటికి కనిపించరు. తమ తమ కర్మానుసారము భిన్న భిన్న రూపముల నెత్తుచుందురు. జననమరణరూప సంసార చక్రమున పరిభ్రమించు చుందురు. అట్టి జీవులెన్ని జన్మలెత్తియో మానవతను బడయుచున్నారు. అందు ఇతర జన్మలయందు లేని జ్ఞానమును, దిట్టములైన జ్ఞానేంద్రియ కర్మేంద్రియములను బడయుచున్నారు. వానితోపాటు ధర్మాధర్మ విచారజ్ఞానమును సంపాదించుకొనుచున్నారు. దాని నుపయోగించుకొని, లభించిన మానవ దేహము, అధర్మములు చేసి భ్రష్టముగాక, నరకముల పాలుగాక, ధర్మకార్యము లొనర్చి, ఇంతకంటె ఉత్తమములైన దేవాది శరీరములు బొందుటో, లేక ఉత్తమోత్తమమైన తిరుగులేని పరమపదమును, సంసారవిముక్తి రూపమగు మోక్షమును సాధించుటో విధి. మోక్షము మానవశరీరైక సాధ్యము. కాన మానవుల కదియే అవశ్యసాధనీయము.

దానికి జ్ఞాన కర్మ భక్తియోగములు ఉపాయములు. ఐనను అవి శ్రమ సాధ్యములు. అధికారి నియమము గలవి. ఆ సాధనములచే తరించువారు నూటికొక్కరు కోటికొక్కరు. "ప్రపత్తి" సర్వ సులభము; సుఖదము. నిశ్చిత ఫలప్రదము. అదియే ఈ పాశురములందు బోధింప బడినది.

## 1 పాశురము

మార్గళి త్తింగళ్ మది నిఱైన్ద నన్నాళాల్
నీరాడ ప్పోదువీర్, పోదుమినో నేరిళై యీర్
శీర్ మల్గుమ్ ఆయ్‌ప్పాడి శెల్వచ్చిరు మీర్‌కాళ్
కూర్వేల్ కొడున్దొళిలన్ నన్దగోపన్ కుమరన్
ఏరార్న్ద కణ్ణి యశోదై యిళఞ్జిఙ్గమ్
కార్మేని చ్చెఙ్గణ్ కదిర్మదియంపోల్ముగత్తాన్
నారాయణనే నమక్కే పఱై తరువాన్
పారోర్ పుగళప్పడిన్దేలో రెమ్బావాయ్.

అవతారిక:- గోదాదేవి వ్రతానుష్ఠానమునకు తోడివారిని పిలుచుచున్నది.

అర్థము:-శీర్, మల్గుమ్-అందము నిండిన, ఆయ్‌పాడి-గొల్లపల్లెయందలి, శీరుమీర్‌కాళ్-చిన్నికన్నెలారా! నేర్. ఇళైయార్-విలక్షణమైన, ఆభరణములుగల వారలారా! మార్గళితిఙ్గళ్=మార్గశిర మాసమున: మది. నిఱైన్ద-చంద్రుడు. నిండిన. నల్, నాళాల్-మంచిదినములు, కూర్ వేల్-వాడి బల్లెముగల; కొడున్దొళిలన్-క్రూరకార్యములుగల; నన్దగోపన్-నన్దగోపునియొక్క; కుమరన్-కుమారుడు; ఏర్ ఆరన్ద-అందము నిండిన: కణ్ణి-కన్నులుగల, యశోదై-యశోదయొక్క; ఇళమ్ శిఙ్గమ్=లేత సింగముమ; కార్, మేని-నల్లనిమేనుగల. శెమ్ గణ్=ఎఱ్ఱని కన్నులుగల కదిర్, మదియమ్, పోల్-సూర్య చంద్రుల పోలిన; ముగత్తాన్-ముఖముగలవాడును అగు; నారాయణనే-నారాయణుడే, నమక్కే-మనకు. పఱై-దక్కని (కోరికలను), తరువాన్-ఇచ్చువాడు, పారోర్-పొరులు; పుగళ-పొగడగా. పడిన్దు=పూని, నీరాడ, పోదువీర్-నీరాడబోవువారలారా! పోదుమినో-పోవుదమా? ఎలో రెమ్బావాయ్-ఇది మా వ్రతము.

వివరణము:- "యం ప్రాప్య న నివర్తంతే తద్ధామ పరమం మమ" అని, భగవంతుని స్థానముచేరిన మీదట తిరిగి రాక లేదు. త్రిపాద్విభూతిలో పరమపదము వైకుంఠము నా స్థాన మన్నాడు శ్రీమన్నారాయణుడు. దాని నను గ్రహించువాడు నారాయణుడే. కావునే

"నారాయణనే నమక్కే పఱై తరువాణ్" అనుచున్నది. మన కోరికల నీడేర్చువాడు నారాయణుడేగాన, ఆయననే సేవింపవలయును. ఏలన? అతడు నారాయణుడు గనుక, మన కోరికల నీడేర్చును.

నర సముదాయము నారము; దానికి అయనము-దిక్కు, గతి. రక్షకుడు, స్వామి ఆయన. కాన ఆయన మన కోరికల తీర్చును, కాన ఆయననే ఆశ్రయింపవలయును.

ఈ సంసారము, ఈ ప్రకృతి, ఈ మాయ అతని ప్రకృతిశక్తి. దానిని దాట మానవులకు సాధ్యము గాదు. అతని దయచేతనే అది తొలగవలయును.

"దైవీహ్యేషా గుణమయీ మమ మాయాదురత్యయా,
మామేవ యే ప్రపద్యంతే మాయామేతాం తరంతి తే.

అని గదా గీతావాక్యము! ఇతర దైవములను బ్రహ్మరుద్రేంద్రాదులను ఆశ్రయించువారికి లభించు ఫల మల్పము, క్షణికము. ఆ దేవతల యధికారము అల్పము. కావున వారివలన సంసారవిముక్తి లభింపదు.

"కామైస్తైస్తైర్హృతజ్ఞానాః ప్రపద్యంతేఽన్యదేవతాః,
తం తం నియమ మాస్థాయ ప్రకృత్యా నియతాస్స్వయా.
యోయో యాంయాం తనుం భక్తశ్శ్రద్ధయార్చితుమిచ్ఛతి,
తస్య తస్యాచలాం శ్రద్ధాం తామేవ విదధామ్యహమ్.
స తయా శ్రద్ధయా యుక్తో తస్యారాధన మీహతే,
లభతే చ తతః కామాన్ మయైవ విహితాన్ హితాన్.
అంతవత్తు ఫలం తేషాం తద్భవ త్యల్పమేధసామ్."

అని గీతాచార్య వాక్యము.

కావుననే పరమార్థము నొసంగువాడు నారాయణుడే అనుచున్నది గోదాదేవి. కాన అతనినే కీర్తింపవలెను. సేవింపవలయును. ఆ నారాయణుడు కోరికలు ఎవరి కిచ్చును? మనకు. మనమెవ్వరము? క్రిమికీట

పశుపక్ష్యాది శరీరముల నొకటి వెంట నొకటి ధరించుచూ పలుజన్మలెత్తి ఇప్పుడు మానుష శరీరమును ధరించిన జీవులము. "యస్యాత్మా శరీరం" అని, భగవానునకు శరీరభూతులము. "మమైవాంశో జీవలోకే జీవ భూతస్సనాతనః" అని, పురుషోత్తమునికి అంశభూతులము. అతడు శేషి, మనము శేషులము.

నరులమైన మనకు నారయణుడైన యాతనికి ఇట్టి విడరాని సంబంధ బంధమున్నది. కనుకనే అతడు, ఆశ్రయించిన మనకు పలయు కోరికల నిచ్చును.

కలలోనం దను మున్నెఱుంగని
  మహాకష్టాత్ముడైనట్టి దు
ర్బలు డావత్సమయంబునన్ నిజ
  పదాబ్జాతంబు లుల్లంబులోఁ
దలవన్నంతన మెచ్చి యార్తి
  హరుఁడై తన్నైన నిచ్చుఁగా సుని
శ్చల భక్తిగా భజియించు వారి
  కిడఁడే సంపద్విశేషోన్నతుల్.

భాగవతము.

అని, అతని భజించిన కోరికల తప్పక యొసంగును.

కాన, ఓ చెలికత్తియలారా! అతని భజింతము రండు రండని ఆహ్వానించు చున్నది గోదాదేవి.

ఒక్కతెగా చేయు సేవకన్నా సమానధర్మిణులతో చేయు సేవ ఉత్సాహవంతముగ కొనసాగును. "ఏకస్తపో ద్విరధ్యాయీ" అన్నట్లు తపస్సు ఒక్కడుగా చేయవలె. పరసంపర్కము తపోభంగకరము. చదువున కిద్దరుంట మేలు. రెండవ వానిబుద్ధి దాని కుద్దీపకము. ఎక్కువ మంది కలసిన అల్లరిపుట్టును. హరిసేవ, భజనము సమష్టిగా నొనర్చిన ఉత్సాహము, ఆనందము కలిగించును.

మధురపదార్థ మొక్కడే అనుభవింపరాదు. "ఏకస్స్వాదు న భుంజీత" అందురు. హరి భజనము మించిన మధురానుభూతి యేది గలదు?

"హే జిహ్వే రససారజ్ఞే సర్వదా మధురప్రియే,
నారాయణాఖ్య పీయూషం పిబ జిహ్వే నిరంతరమ్."

అని విష్ణుపురాణము. నాల్క కెప్పుడును తీపి ఇష్టము. ఓ నాలుకా! చాల మధుర పదార్థ మొక్కటున్నది దానిని గ్రోలుము. నీ వానందింతువు. అదేదన్న నారాయణుడనే అమృతము.

"రుచి యని యెక్కువ తినరాదు" అని యొక సూక్తి. అధికముగ మెసవిన అమృతమునూ విషమించును. 'అజీర్ణే భోజనం విషమ్'. పుష్టి కరమైనను భోజనము, అజీర్ణమైన విషమగును. కాని, నారాయణామృతమెంత గ్రోలినను, విషమించనిది. పైగా ఉజ్జీవింప జేయునది. అట్టి మధురపదార్థము నిష్టులతో శిష్టులతో కలిసి భుజించిన నింకను భోగ్యతమ మగును.

భగవంతుని భజనము సేవ, అర్చనయే యాగము. ఇదియే యజ్ఞము. యజ్ఞ దేవపూజాసంగతి కరణ దానేషు అని యజధాతువున కర్థములు. అందు దేవపూజ ప్రథమమున పేర్కొనబడినది. ఆ యజ ధాతు భవములే యజ్ఞయాగ శబ్దములు.

దేవపూజసేయక ఇష్టభోగముల ననుభవించువాడు దొంగ. దేవతలు దుర్భిక్షముల దొలంగించి, వానల కురిపించి, పంటల పండించుచున్నారు. ఈ సమస్తమును వారిచ్చినదే. అట్టి సంపదల వారికి నివేదింపక భుజించువాడు పాపముల గుడుచుచున్నాడు. కాన యజ్ఞాదులచే దేవతల నారాధించి తచ్ఛేషమును భుజింపవలయును. అట్లనుభవించువారికి పాపము లంటవు. అదియే గీతయందు-

"సహయజ్ఞాః ప్రజాస్సృష్ట్వా పురోవాచ ప్రజాపతిః,
అనేన ప్రసవిష్యధ్వ మేష వోఽస్త్విష్టకామధుక్."
ప్రజాపతిః అనిన శ్రీ మహావిష్ణువు.
పతిం విశ్వస్యాత్మేశ్వరగ్ం శాశ్వతగ్ం శివ మచ్యుతమ్
నారాయణం మహాజ్ఞేయం విశ్వాత్మానం పరాయణమ్"

అను శ్రుతి నారాయణునే విశ్వమునకు పతియనుచున్నది. విశ్వమన జడాజడ స్థావర జంగమాత్మకమైన సర్వప్రపంచము. దానికి పతి కాన ప్రజాపతి నారాయణుడు.

"పితాహమస్య జగతో మాతా ధాతా పితామహః"

"గతిర్భర్తా ప్రభుస్సాక్షీ నివాస శ్శరణం సుహృత్" -గీత.

అని జగత్తునకు తానే ప్రభువని కృష్ణభగవానుడు నరునకు చెప్పినాడు. అతడు అపార కరుణామయుడైన నిరుపాధిక బంధువుగాన, అచేతన ప్రాయులై పడియున్న జీవులకు దేహేంద్రియ సంయోగము గలిగించి వాని ఉజ్జీవనముకొరకు యజ్ఞవిధాన మేర్పరచి, "మీరీ యజ్ఞముల నాచరించి వృద్ధిపొందుడు. ఇవి మీ కిష్టార్థములు సమకూర్చును" అని శాసించెను.

"దేవాన్భావయతానేన తే దేవా భావయంతు వః,
పరస్పరం భావయంతః శ్రేయః పరమవాప్స్యథ.
ఇష్టాన్ భోగాన్ హి వో దేవా దాస్యంతే యజ్ఞభావితాః,
తైర్దత్తా నప్రదాయైభ్యో యో భుఙ్క్తే స్తేన ఏవ సః.
యజ్ఞ శిష్టాశిన స్సన్తో ముచ్యన్తే సర్వకిల్బిషైః,
భుఞ్జతే తే త్వఘం పాపా యే పచన్త్యాత్మకారణాత్."

ఈ పదార్థములతో దేవతల నారాధింపుడు. ఆ దేవతలు మిమ్ము పోషింతురు. ఈ విధముగ పరస్పరాదాన ప్రదానములతో మేలు పొందగలరు.

దేవత లిచ్చిన మేలివస్తువులను వారికి నివేదింపక, తానే అనుభవించువాడు దొంగ. యజ్ఞశేషము భుజించువారికి పాపము అంటదు. తనకై వండుకొనువాడు పాపముం పొలగుచున్నాడు.

అని గీతాచార్యోపదేశము.

దేవతలన్న పరమాత్మ ఆత్మగా గలవారు. "విశ్వాత్మానం పరాయణం" అనియు, "వాసుదేవాత్మకాన్యాహుః క్షేత్రం క్షేత్రజ్ఞ ఏవ చ" అనియు శ్రుతిస్మృతులు, జీవులకు పరమాత్మను ఆత్మగా పేర్కొనుచున్నవి.

దేహమునకు చేసిన పూజ ఆత్మకుచేసినదే గదా! దేవతలను పూజిం చుట యన్న వారు శరీరముగాగల, వారి కాత్మయైన పరమాత్మను పూజించుటయే.

కావున ఇంద్రాదులు వర్షించినారన, ఇంద్రాది దేహుడైన పర మాత్మయే వర్షించినాడు అని. అట్లనే ఇంద్రునికి చేసిన యాగము తదంతర్యామికి చేసినదిగా భావించవలయును.

"అహం హి సర్వయజ్ఞానాం భోక్తా చ ప్రభురేవ చ" అని భగవద్వా క్యము. కాన భగవదారాధనమే యజ్ఞము.

"ద్రవ్యయజ్ఞాస్తపోయజ్ఞా యోగయజ్ఞాస్తథావరే,
స్వాధ్యాయ జ్ఞానయజ్ఞాశ్చ యతయ స్సంశితవ్రతాః.

అని యజ్ఞములు పలువిధములు. ఏ విధముగనైనను భగవదారాధనమే యజ్ఞము. తన కున్న వానితో శక్తివంచనలేక, శక్తికి మించక భగవంతు నారాధింపవలయును.

"అనేన తృప్యతాం భగవాన్నారాయణః" అని తత్ప్రీతికొరకు చేయవలయును.

ఎంత దరిద్రుడైననూ, ఏ వస్తువు లేకున్నను శరీర ముండి తీరును. ఇంద్రియము లుండును. అంతియే చాలును. లక్షాధికారి అఖిలైశ్వర్య ముతో నారాధించి సాధించు ఫలము అకించనుడు నామకీర్తనముతో బడయగలడు.

"నారాయణేతి మంత్రోఽస్తి వాగస్తి వశవర్తినీ,
తథాపి నరకే ఘోరే పతంతీత్యేత దద్భుతమ్."

-విష్ణుపురాణము.

నారాయణ మంత్ర మున్నది. దానిని జపించుటకు నాల్కయున్నది. అది పరాపేక్షలేక స్వాధీనమై యున్నది. ఐన నేమి? సర్వపాపహరమై అవ్యయానంద సంధాయకమగు నారాయణ మంత్ర మున్న నేమి? వాటిని సద్వినియోగ మొనర్చుకొనక, లేనిపోని, పనికిరాని దుర్విష

యములను, బూతులను, రంకు కూతలను వాగుచు నాలుకను, కాలమును దుర్వినియోగ మొనర్చుకొనేవారే మెండు. కాని, "భగవన్నామ ముచ్చరించవలయును. హరినికీర్తించవలయును" అను ఆసక్తిగలవారు అరుదు. కావుననే నరకాన గూలుచున్నారు. ఇది ఆశ్చర్యము గదా!

చేతులారంగ శివుని బూజింపఁ డేని
నోరు నొవ్వంగ హరికీర్తి నుడువఁడేని
దయయు సత్యంబులోనుగాఁ దలపఁడేని
కలుగనేటికి తల్లుల కడుపుచేటు.

అన్నట్లు శివుడు-పవిత్రుడగు, హరిని-సమస్తపాపములు హరించు శ్రీమన్నారాయణుని, "అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి" అని శపథముచేసిన శ్రీ భగవానుని పూజింపనివాని జన్మ దండుగ. అతని దివ్యకీర్తన నొనర్పని వాని పుట్టువు వ్యర్థము.

వ్యాసు డెన్ని పురాణములు రచించినను, కాతరుడై వగచుచుండ నారదమహర్షి-

"అంచితమైన ధర్మచయమంతయుఁ జెప్పితి; వందులోననిం
చించుకగాని, విష్ణుకథలేర్పడఁజెప్పవు; ధర్మముల్ ప్రపం
చించిన మెచ్చునే? గుణవిశేషము లెన్నినగాక, నీకు నీ
కొంచెము వచ్చుటెల్ల హరి గోరి నుతింపమి నార్యపూజితా!

హరినామస్తుతి సేయు కావ్యము సువర్ణాంభోజ హంసావళీ
సురుచి భ్రాజితమైన మానససరస్స్ఫూర్తిన్ వెలుంగొందు; శ్రీ
హరినామస్తుతిలేని కావ్యము విచిత్రార్థాన్వితంబయ్యు శ్రీ
కరమైయుండదయోగ్యదుర్మలినవత్కాకోలగర్తాకృతిన్."

అని బోధించి హరికీర్తనాప్రధానమగు భాగవతమును రచింపజేసెను. కావున గోదాదేవి, హరిని పొగడి భజించుటకు తోడివారల నాహ్వానించు చున్నది- "పోదుమినో" యని.

దినము లన్నియు సమానములే యయ్యును కొన్ని నక్షత్రముల తిథులయోగము వానికి ఆధిక్యమును గూర్చును.

"మాసానాం మార్గ శీర్షోఽహం" అని విభూతియోగమున చెప్పినట్లు, మార్గశీర్షము హరిస్వరూపము. పరమపవిత్రము. అందునను పండు వెన్నెల నిండుకొనిన రేలు ఆనందకరములు. అట్టి "మార్గళి తింగళ్ మదినిఱైంద నన్నాళాల్" రాత్రుల వేకువజామున, నేర్ఇళైయీర్= విలక్షణాభరణములు గలవారలారా! అనిపిలుచుచున్నది. వారు విలక్షణాభరణ లట.

సంపన్నులు వెండి బంగారు సొమ్ములు దాల్తురు. అది సామాన్యము. అందు వైలక్షణ్య మేమున్నది? నిజమున కవి యా ఆభరణములు?

కేయూరాణి న భూషయన్తి పురుషం హారావతారోజ్జ్వలాః
న స్నానం న విలేపనం న కుసుమం నాలంకృతా మూర్ధజాః.

అన్నాడు భర్తృహరి.

"భూషలుగావు మర్త్యులకు భూరి
మయాంగదతారహారముల్"

ఈ బంగారు నగలు బరువుచేటేగాని అలంకారములు గావు. మరెవ్వి ఆభరణములు? అన-

చేతులకుఁ దొడవు దానము;
భూతలనాథునకుఁ దొడవు బొంకమి; ధరలో
నీతియె తొడవెవ్వారికి:
నాతికి మానంబు తొడవు నయముగ సుమతీ!

అన్నట్లు, సత్యవాక్యము దానము నీతి మానము – ఇత్యాదులతో రాణించినట్లు వ్యక్తి నగలతో రాణింపడు. పరోపకారము సత్యము శీలముగల మానవతులకున్న మన్నన బంగారు చూసినవారికి లేదు. అంతియగాక-

కంజాక్షు నర్చించు కరములు కరములు
శ్రీనాథు వర్ణించు జిహ్వ జిహ్వ
సురరక్షకుని జూచు చూడ్కులు చూడ్కులు
శేషశాయికి మ్రొక్కు శిరము శిరము
విష్ణునాకర్ణించు వీనులు వీనులు
మధువైరి దవిలిన మనము మనము
భగవంతు వలగొను పదములు పదములు
పురుషోత్తముని మీది బుద్ధి బుద్ధి
దేవదేవుని జింతించు దినము దినము
చక్రహస్తునిఁ బ్రకటించు చదువు చదువు
కుంభినీధవుఁ జెప్పెడి గురుఁడు గురుఁడు
తండ్రి! హరిఁ జేరు మనియెడి తండ్రి తండ్రి.

అని అన్వయ రూపమున చెప్పి, వ్యతిరేకవిధమున—

కంజాక్షునకుఁగాని కాయంబు కాయమే
పవన గుంఫిత చర్మభస్త్రి గాక,
వైకుంఠు బొగడని వక్త్రంబు వక్త్రమే
ఢమఢమ ధ్వనితోడి ఢక్క గాక,
హరిపూజనము లేని హస్తంబు హస్తమే
తరుశాఖ నిర్మిత దర్వి గాక
కమలేశుఁ జూడని కన్నులు కన్నులే
తనుకుడ్యజాలరంధ్రములు గాక
చక్రిచింతలేని జన్మంబు జన్మమే
తరళ సలిల బుద్బుదంబుగాక
విష్ణుభక్తి లేని విబుధుండు విబుధుఁడే
పాదయుగముతోడి పశువుగాక.

అని యింద్రియముల ప్రయోజనమును నిరూపించినాడు పోతన.

భగవంతుడు మన కీ యా అంగముల ననుగ్రహించినది వానిని భగవత్కార్యములందు వినియోగించుటకొరకు. అది వానికి సద్వి నియోగము, కీర్తి దెచ్చునది కాన నదియే భూషణము. అట్టి విలక్షణ మైన ఆభరణములుగల వా రామె సఖులు.

వారితోపాటు నారాయణుని కీర్తించుచు నీరాడబోవుచున్నది గోదాదేవి.

ఏ శుభకార్యము నేనియు స్నానముచేయనిదే చేయరాదు. ఏట మునుగుట, వాన నానుట, గోధూళిలో జొచ్చుట, మంత్రోదకములు ప్రోక్షించుకొనుట ఇవన్నియు స్నానములే. పవిత్ర తీర్థములయం దవ గాహనము సేయుట శారీరక మానసిక తాపముల హరించి పవిత్రులను జేయును. కాన మార్గశీర్ష స్నానమునకు రమ్మనుచున్నది.

"శీర్ మల్గుమాయ్ ప్పాడి శెల్వచ్చిరు మీర్ కాళ్"

ఆ చెలిక త్తెలంద రందక త్తెలు. "యత్రాకృతి స్తత్ర గుణాః" అని స్వరూపమున్నచోట గుణములు నుండును. కాన అందరు సౌశీల్యము గల, కల్ల కపటములేని గొల్లవల్లెలోని ఋజువర్తనముగల కన్నెలు. అట్టి వారితో కలయిక ఆనందకరము.

దుస్సహవాసము మట్టికుండలవంటిది. అది త్వరగా పగులును. మరల అతుక సాధ్యపడదు. సన్మార్గ సహవాసము బంగారు కుండవంటిది. అది పగులదు. పగిలినా అతుకనగును. అట్టివారి సఖ్యమే కాంక్షణీ యము. వారందరితో జేరి నందగోపకుమారుని సేవకు బోవుచున్నది గోద.

అతడు సామాన్య మానవుడుగాడు.

"యదా యదా హి ధర్మస్య గ్లాని ర్భవతి భారత,
అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్.
పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్,
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే.

అని దుష్టశిక్షణ శిష్టరక్షణార్థము, ధర్మ పరిపాలనకు అవతరించువాడు.

అజోఽపి సన్నవ్యయాత్మా భూతానా మీశ్వరోఽపి సన్,
ప్రకృతిం స్వా మధిష్ఠాయ సంభవా మ్యాత్మమాయయా.

ఆద్యంతములు లేనివా డతడు. సర్వభూతముల కధిపతి. స్వేచ్ఛచేతనే జన్మించుచున్నాడు. కాని, ఆతని జన్మ కర్మబద్ధమైనదిగాదు. జగత్సృష్టి స్థితి లయకారకు డతడే. "జన్మాద్యస్య యతః"- ఈ విశ్వముయొక్క సృష్ట్యాదు లాతనివల్లనే అని బ్రహ్మసూత్రము.

అవి యాతని కృత్యములే యైనను బ్రహ్మను నిర్మితియందు, రుద్రుని లయమునందును నియమించి, తత్తత్కృత్యమును స్వయము చేపట్టినవాడు. ఆతడే శ్రీకృష్ణుడుగా నవతరించినాడు.

"కార్ మేనిచ్చెజ్గణ్ కదిర్మదియంబోల్ ముగత్తాజ్"

నల్లనిమేను, ఎర్రని కన్నులు, సూర్యచంద్రులవంటి దేదీవ్యమాన ముఖ మండలమును గలవాడు.

నలుపు తామసము, ఎరుపు రాజసము, తెలుపు సాత్త్వికము. ఇవి మూడును ప్రకృతి గుణములు. ఆ ప్రకృతి అతని అపరాశక్తి. ఆతని అదుపులోనిది. అతడు ప్రకృతి కతీతుడు. త్రిగుణాతీత తేజశ్శాలి.

న తత్ర సూర్యో భాతి, న చంద్రతారకమ్।
నేమా నక్షత్రాదీ భాంతి కుతోఽయమగ్నిః॥

అని శ్రుతి. అట్టి తేజశ్శాలిని చూచుటకు మన కన్నులు చాలవు. కనుకనే తన దివ్య స్వరూపమును దర్శించుటకు అర్జునునకు-

దివ్యం దదామి తే చక్షుః పశ్య మే యోగమైశ్వరమ్,
నతు మాం శక్యసే ద్రష్టు మనేనైవ స్వచక్షుషా.

నీ ప్రకృతి నేత్రములతో నన్ను చూడజాలవు, దివ్యదృష్టి నొసగెదను. నా స్వరూపము చూడు మనుచున్నాడు. అటులనే ఆ దివ్యమంగళ విగ్రహమును దర్శించినా డర్జునుడు దానిమీద ఆసక్తి యగినినది.

"తదేవ మే దర్శయ దేవ రూపం ప్రసీద దేవేశ జగన్నివాస"

కిరీటినం గదినం చక్రహస్తం
ఇచ్ఛామి త్వాం ద్రష్టు మహం తథైవ,
తేనైవ రూపేణ చతుర్భుజేన
సహస్రబాహో! భవ విశ్వమూర్తే.

అని అపూర్వరూపమునే చూపుమన్నాడు. ప్రాకృతమానవులకు ప్రాకృత వస్తువుల పైననే అభిలాష. "సర్వస్స్వగంధేషు విశ్వసితి" అని కాళిదాసు. అందరు స్వసదృశులందే విశ్వాస ముంతురు.

మనుష్యులకు బోధచేయుట కవతరించినవాడు మానవాకారంతోనే ఉండవలయును. కావున ప్రకృతిబద్ధునివలెనే తన దివ్యతేజమును సంకుచించుకొని సామాన్య ప్రాకృతరూపముతో సర్వసులభుడుగా నవతరించినాడు. అందువల్లనే "అవజానంతి మాం మూఢా మానుషీం తనుమాశ్రితం''- అజ్ఞానులు నన్ను సామాన్య మానవుడని తిరస్కరింతురన్నాడు.

ఆ విధముగ నవతరించినవాడు విలక్షణ మేఘసన్నిభ వర్ణము, కెందామరలవంటి కన్నులు, శత్రుభీషణమైన తేజము, మిత్రానందకరమైన వెన్నెల కాంతులతో సూర్యచంద్ర సమముఖమండలము గలవాడై అవతరించినాడు.

నాటినుండి పల్లెలో పూతనాది రాక్షసుల దాడి బలమైనది. అందుచే సహజ దయాళువైన నందుడు శిశుసంరక్షణార్థము వాడిబల్లెము చేతబూని చండశాసనుడైనాడు. "కూర్వేల్ కొడిన్దొశిలన్ నన్దగోపన్" అట్టివాని కుమారుడు.

"ఏరార్న్ద కణ్ణి యశోదై ఇళశ్జీగమ్"

అందమైన కన్నులుగల యశోద కుమారసింహము. సింహము పుట్టుచుండగనే మదపుటేనుగుమీదకు దూకునట. అటులనే బాలకృష్ణుడు పుట్టినది దొట్టి పూతనాది కమైనమూక నుక్కడంచినవాడు.

అట్టి కృష్ణావతారుని కీర్తింతము రండని నెచ్చెలుల బిల్చుచున్నది గోద. మంచిపని నందరును అభినందింతురు. కనుక "పారోర్ పుహళ పడిన్దు" వారు లగ్గించునట్లు పూని, చలికి వెనుకంజవేయక, శరీరము వెనుదీసినా ప్రయత్నించి పట్టుబట్టి స్నానమాడబోవుదము రండు అనుచున్నది.

అనువాదము!—

సిరిసంపదలు నగల్ చెలువమ్ము పరువమ్ము
కొమరారు రేపల్లె కొమిరెలార!
పూర్ణచంద్రునితోడఁ బోలుపొందు మార్గశీ
ర్షమునందు వేకువ జామునందు,
వాడిబల్లెము వేడి పనుల నందుని పుత్ర
కేసరి యా యశోదాసుతుండు
* పుష్పవన్నిభమైన మోము తెందామరల్
మించు కన్నుల కప్పి మేనివాఁడు
అఖిల మొసఁగును మనకు నారాయణుండు;
లోకు లగ్గింపఁబూని యో లోలనేత్ర
లార! యాతని పూజింపఁగోరి నీర
మాడఁ బోదము రండు రం డతివలార!

## 2. పాశురము

అవతారిక:— గోదాదేవి తన వ్రతనియమములను వెల్లడించుచున్నది.

పాశురం:— వైయత్తు వాళ్వీర్గాళ్ నాముమ్ నమ్పావైక్కు
చ్చెయ్యుమ్ కిరిశైగళ్ కేళీరోపార్కడలుళ్
పైయత్తుయిన్ఱ పరమనడిపాడి
నెయ్యుణ్ణోమ్ పాలుణ్ణోమ్ నాట్కాలే నీరాడి

---

సూర్య చంద్ర సమానమైన.

మైయిట్టెళుదోమ్ మలరిట్టు నాముడియోమ్
శెయ్యాదన శెయ్యోమ్ తీక్కుఱళై చ్చెన్ఱోదోమ్
ఐయ్యముమ్ పిచ్చైయుమ్ అన్దనైయుమ్ కైకాట్టి
ఉయ్యు మారెణ్ణి యుగన్దేలో రెమ్బావాయ్.

అర్థము:— పైయత్తు=భూమియందు, వాళ్వీర్గాళ్-అభివృద్ధి వతులారా! నాముమ్-మేమున్ను, నమ్, పావైక్కు-మావ్రతమునకు, శెయ్యుమ్-చేయు, కిరిశైగళ్-కృత్యములను, కేళీరో-వినంది, పార్+కడళుళ్-పాల+కడలియందు పైయ-సావధానముగ, తుయిన్ఱ-తూగిన; వర మన్+అడి-వరముని, అడుగులను, పాడి-స్తుతించి, నాట్కాలే-వేకువనే నీరాడి-జలకమాడి, నెయ్, ఉణ్ణోమ్-నెయ్యి, తినము; పాల్ ఉణ్ణోమ్-పాలుత్రాగము, మై ఇట్టు-కాటుక పెట్టి, ఎళుదోమ్-గీయము; మలర్=అలరులను, ఇట్టు-పెట్టి; ముడియోమ్-ముడువము, శెయ్యాదన-చేయరానివి; శెయ్యోమ్-చేయము; తీ+కుఱళై-విషపుమాటలు (చాడీలు) శెన్ఱోదోమ్-చెప్పము, అయ్యముమ్-దానము; పిచ్చైయ్యుమ్-బిచ్చమును, అన్దనైయ్యుమ్—యథాశక్తి. కైకాట్టి=చేయిచూపి (దానమిచ్చి) ఉయ్యుమ్+ఆఱు-ఉజ్జీవన+మార్గమును; ఎణ్ణి-ఎన్ని; ఉగన్దు-ఆనందింతుము. ఏలో రెమ్బావాయ్-ఇది మా వ్రతము.

వివరణ:—“వైయత్తు వాళ్వీర్గాళ్” భూలోకమున అభివృద్ధిగల వారలారా! మీ భాగ్యమున కంతులేదు. ఐహిక సమస్త సౌఖ్యముల ననుభవించుచున్నారు. మీ పూర్వజన్మ సుకృతము గొప్పది. కావుననే సంపన్న కుటుంబమున జన్మించితిరి. కొదవలేని భోగముల ననుభవించుచున్నారు. శ్రీమన్నారాయణుడు కృష్ణావతారుడై జన్మించిన వ్రేపల్లెయందు ఆతని సమకాలికులుగా పుట్టుటన్న సామాన్యభాగ్యమా!

కాని ఈ లౌకిక భాగ్యములు శాశ్వతములా? వీనివలన పూర్వజన్మ సుకృతము తరుగుచున్నది. కాన నివి విపత్తులేగాని సంపత్తులుగావు.

“పూర్వజన్మసుకృతవ్యయలబ్ధాః సంపదో విపద ఏవ విమృష్టాః” అని శ్రీహర్షుడు. “సుకృతాపాయఫలంబు లీసిరులు వచ్చున్ బోవు

నవ్వానిపై నొక రాగంబు"....(నా యతిరాజీయము) కాన ఐహిక సంప దలను ప్రధానముగా భావింపక శాశ్వతానందమునకై పాటుపడవల యును. కావున సుఖభోగముల మెఃనిగి ఏమరియుండరాదు.

విబుధస్త్రీసన్నిధౌ సంయమః యత్కాంక్షంతి తపోభి
రన్యమునయః తస్మిం స్తపస్యంత్యమీ॥
—శాకుంతలము.

స్వర్గమున కేగియు నా సౌఖ్యము లనుభవింప నొల్లక, అంతకంటె నుత్తమపదము పొందుటకై తపించుచున్నారట. ఇటులనే మీరును ఈ భౌతిక సంపదలకు మురిసి పరము నేమారకుడు.

"కృష్ణ సమకాలీనలము! మా కేమి? ఆముష్మిక సౌఖ్యములకు కొదవ యేమి?"

అనకుడు; గంగాజలము పావనాశకమై స్వర్గఫలము నిచ్చునది యగుగాక, అందలి చేపలు ఎంద్రకాయలు మొసళ్లు స్వర్గమునకు పోవునా? భక్తి శ్రద్ధలేని కార్యములు ఫలించునే?

"భక్తిగల్గు కూడు పట్టెడైనను చాలు
కడవడైన నేమి ఖరముపాలు."

భగవంతుడు నీవిచ్చు పదార్థముల విలువచూడడు. నీభక్తినే గమ నించును.

"పత్రం పుష్పం ఫలం తోయం
యో మే భక్త్యా ప్రయచ్ఛతి"
అని గదా గీతావాక్యము.

దుస్ససేనునుండి ద్రోవది రక్షింప,
గ్రాహగిలితమైన కరిని గావ
మూల్య మొసగి రేమి? మురహర! కేవల
భక్తిభజనలకును వశుడ వీవు."
(నా సుధాబిందువులు)

ఐహిక సౌఖ్యలాలసతకు భగవద్భక్తికి నెంతయో దూరము.
కాన భోగలాలసలారా? వినుండు, శాశ్వతానందపదమునకు యత్నింపుడు.

"మీ రేమి చేయుచున్నారందురా ?"
"నామ్, ఉయ్యుమారెడ్డి,"

మేము, సంపన్నకుటుంబమున జన్మించియు "ఈ సంపదలు శాశ్వతములుగావు. క్షణికములు" అని తలంచిన మేము; జ్ఞాన కర్మభక్తి యోగములచే భగవంతుని బొందు సామర్థ్యములేని మేము; ప్రపత్తి యొక్కటే భగవత్ప్రాప్తికి పరమోపాయమని నెరనమ్మిన మేము, భగవంతుని పాదారవిందసాన్నిధ్యము పడయుటే మానవజన్మకు పరమ పురుషార్థమని భావించిన మేము, "భగవత్సేవకుగాక, ఐహిక సుఖాను భూతికి కాలమును దేహమును వెచ్చపెట్టుట 'బొగ్గులకై కల్పతరువు బొడుచుట'గా తలంచిన మేము; 'ఉయ్యుమారెడ్డి''-జీవు దభివృద్ధిబొందు మార్గము కనుగొని,—

జీవుడెవ్వడు? అతడు భగవంతుని పరాశక్తి. ఆతడివలెనే జ్ఞానానందమయుడు. ఆతని అంశభూతుడు.

"మమైవాంశో జీవలోకే జీవభూత స్సనాతనః"

అని గీతావాక్యము. అతని అంశగావున, అతని కున్న గుణములు గలవాడు.

"అపరేయ, మిత స్త్వన్యాం ప్రకృతిం విద్ధి మే పరామ్"
"జీవభూతాం మహాబాహో ! యయేదం ధార్యతే జగత్"

అని భగవంతుని చిత్ప్రకృతియైన జీవుడు, ఆ భగవానుని ఆ చిత్ప్రకృతి వ్యామోహమునబడి ప్రకృతికి బద్ధుడైనాడు.

జింకమేని వలువన్నియల చూచి మరులు గొన్నది సీత. పురుషోత్తముడైన శ్రీరామచంద్రునే- ఆ జింకకొరకై - దూరముచేసుకొన్నది. భగవంతునికి దూరమైనందున లంకయం దిడుమల బడినది. రాముని గూర్చి పదినెలల తపస్సుతోగాని విముక్తి గల్గలేదు.

బంగరు జింకపైని గల భ్రాంతికి
లోగిన సీత రాముడన్
బంగరు దువ్వటీనిని సనాతను
దవ్వుగఁ జేసికొంట, నా
యంగన లంక బద్ధయయి ఆర్తి
నలంగి నిరంత చింతలఁ
గ్రుంగెను గాదె, రామ విభు
నోముట బంధములఁ దొలంగదే.

భగవంతునికి దవ్వైనను భాగవతాశ్రయముండిన జీవునికి ఆపద యుండదు. అతడే భగవత్సన్నిధి చేర్చగలడు.

సీత రాముని దూరము చేసికొన్నను, లక్ష్మణుని తిరస్కరించి పంపకుండిన, ఇతరుల పాలయ్యెడిది గాదు.

రాముని దూరమంపినను ప్రాకృత
శంబర చర్మ కాంక్ష నా
రాము ననుంగు సోదరుని రక్షణ
యుండిన నంత పుట్టునే
రామకు? గాన భాగవత రమ్య
దయారస మింకకున్న చోఁ
బాములు సేరరావు భగవంతుని
సన్నిధిఁ జేర్చు నాతడే.

అటులనే జీవుడు పరమాత్మను మరచి ప్రకృతివశుడై పలువెతలబడి సంసారపారావార బంభ్రమ్యమాణు డగుచున్నాడు.

ప్రాకృతమాయఁదోగి పలు బాముల
నెత్తుచు, రాయి, గోయి వ
ల్మీకము మాను మక్షికము మీనము
నండజముఁ మృగమ్ము నై

ఆకలి కోర్చి, యోలి నరుడై
జనియించుచు నందు నెన్నియో
పోకలఁబోవు నారకము నొందును
నాకము నాత్మ కర్మలన్.
జ్ఞాతాజ్ఞాత పురాభవాఽఽరచిత
లోక శ్లాఘ్య కర్మావళీ
జాతాఽఽచార్య దయాకరంచిత
కటాక్ష శ్రేణి, లక్ష్మీశుఁ గం
జాతాక్షుణ్ గనువిందుగా గన,
సమర్చల్ చేయఁ జింతింపగాఁ
జేతోవీథిఁ దలంపు పుట్టి హరి
సంసేవించు మోక్షార్థియై.

(నా యతిరాజీయము)

ఈ మానవజన్మతో జ్ఞానము మేలింద్రియములు లభించినవి. వానిని సద్వినియోగము చేసికోవలయును. ఈ శరీరముచేతనే ఈ జనన పరంపర యను సంసారమునుండి విడుమర పొందవలయును. అటు గాక, ఐహిక సుఖానుభూతికి ఈ ధర్మసాధనమైన శరీరమును దుర్వినియోగపరచిన, మరల నిట్టి దేహము లభించునను నమ్మిక లేదు. మరల నే నికృష్ట జన్మలు దాపురించునో చెప్పలేము. కావున పరమపదాప్తికి జన్మలోనే ఇప్పుడే ప్రయత్నింపవలయును.

'మోక్షమిచ్ఛే జ్జనార్దనాత్' అనుటచేత మోక్ష ప్రదాతయగు జనార్దనునే శరణు పొందవలయును. ప్రకృతి ఆ జనార్దనుని అపర ప్రకృతి. ఆతని యనుగ్రహము లేనిదే ఆ బంధములు తొలగవు.

మానవ జన్మ లభించియు భోగలాలసులే మెండు. ధనదార పుత్రేషణలచేత అలమటించువారే పలువురు. పరచింత కలుగుట ఏ కొందరికో కలిగినా, ఇప్పటినుండి యేమి? వయస్సులో విషయసుఖము లనుభవింతము. ముదిమిని పరార్థమునకు పాటుపడుదము అని అనుకొను వారే అధికము. కాని, ఆయువు క్షణభంగురము. ఎప్పు డేమి కీడు మూడునో తెలియదు.

"ఆయుః పరిస్రవతి భిన్నఘటా దివాంభః"

—భర్తృహరి

ఓటికుండలోని నీటివలె ఆయువు క్షణక్షణము తరిగి పోవుచుండును. అదియుగాక ముసలివారే చనిపోవలయునను నియమము లేదు. పసివాడని మృత్యువునకు కనికరము లేదు.

"బాలుని వృద్ధునేని, ధనవంతుని
పేదనుగాని; మిత్తి, వా
చాలుని మౌని నేని, స్వవశం
బొనరించుకొనుం దెగించి, ని
ద్రాలుని జాగరూకుని పదస్థు
వనస్థు గృహస్థు నేనిఁ, బ్రా
ల్మాలిన వాని నీరుజుని, మానక,
భోక్తను, పాయి, రంతనుణా"

(నా యతిరాజీయము)

మరణము దాపురించినపుడు పశ్చాత్తాపపడి లాభ మేమి? చేసిన పాపకృత్యములు తలపోసికొని ప్రయోజన మేమి?

తనుధరు లెల్లవారలను తప్పక
పోయెడి పారలౌకికాఁ
యనమున కర్హమై, ఇట నలభ్య
ములౌ పసనాన్నపాన వా
హన కరదీపికా తతుల నక్కట!
యొక్కటి గూడ నిల్చు సా
ధనము గడించు నూహ మది
దట్టదు సుంతయు తిండిపోతుకుణా.

(నా శాంతివిలాసము)

కాన పరమున కిప్పుడే పాటుపడవలయును. ముందుజాగ్రత్త అవసరము గదా! గనుకనే.

"భజ గోవిందం భజ గోవిందం గోవిందంభజ మూఢమతే
సంప్రాప్తే సన్నిహితే కాలే
నహి నహి రక్షతి డుకృఞ్ కరణే."

అన్నారు శంకరాచార్యులు.

కాన నొనర్పఁగావలయు కార్యము
లెప్పటి కప్పుడే సమీ
చీనము లైనచో, మరలఁజేయుద
మన్నను బుద్ధిబాధ మీ
మేను తిరమ్మె? రేపటికి మిత్తికి
చిక్కక యుండు నంట కే
వానికి నెన్ని గుండెలు? కృపాజలధీ!
ననుగావు మెయ్యెడన్.

(నా యతిరాజీయము)

కావున నిప్పుడే గోవింద భజన కుపక్రమించవలయును. అదియే "ఉయ్యుమాఱు" ఉజ్జీవన మార్గము. దానినే మే మెన్నుకొంటిమి. ఆ వ్రతమునకై దీక్షబూనితిమి. ఈ పద్ధతి మేరకు నడచినవారికి భగవంతుడు దొడ్డిబెట్టిన వేల్పు గిడ్డి. రండు మీరుమ మాతో చేరి ఆనందింపుడు అనుచున్నది, గోదాదేవి.

మీ వ్రతనియమము లేవి? యన, "కేళిరో" వినండి. పాల్ కడలుళ్ పై యెత్తు వరమ నడిప్పాడి".

భగవంతుడు శ్రీమన్నారాయణుడు తన దర్శనమునకు భక్తు లెప్పుడు వత్తురో యని వారి ననుగ్రహించుటకు శేషతల్పమున యోగ నిద్రయందున్నాడు.

"నిద్రించు జగన్నాయకుని లేపుట?" అని సంకోచింప పనిలేదు. ఆతనిది మన నిద్దరవంటి తామస నిద్ర కాదు. చైతన్యము మరచునది కాదు. అది యోగనిద్ర. కన్నుమూసినను బాహ్యప్రపంచము మరుగై

నను దివ్యదృష్టి కన్నియు దేదీప్యమానములగ గోచరించుచుండును. ఆర్తితో "గోవిందా" అని ప్రార్థించిన, "నారాయణా" అని ఆక్రోశించిన, తప్పక అనుగ్రహించును.

"ఎవ్వరైనా మొరపెట్టుకొమనా? వానిని రక్షించి, తన యార్త త్రాణపరాయణ బిరుదమును నిలబెట్టుకొందునా? అని అందరూ ఐహిక భోగలాలసు లగుచున్నారే. ఎవ్వరూ రక్షణ వేడలేదు" అని అర గన్ను మూసి శేషతల్పముపై పాలకడలియందు పవ్వళించి దీనరక్షణ కెదురు చూచుచున్నాడు.

"ఆత డెదురుచూడ పని యేమి? వీరు దీనులు గదా! అడిగిననే రక్షింపవలయునా? పసిబిడ్డ తెలియక అపాయమునకు లోనగుచుండ, తల్లి అడుగకున్ననూ రక్షణకు పరువెత్తదా? 'అడుగలేదే' అని కాచుకొని యుండునా?" అనవచ్చును. కాని అడుగకున్నను అందరిని రక్షించుటకు, పూనుకొన్న తారతమ్య వివక్షలేక అందరికి ముక్తినొసంగవలయును గదా. అప్పుడు తన లీలావిభూతికే లోపము వాటిల్లును. ఇది తన పూర్వ సంకల్పమునకు విరుద్ధము.

"స ఏకాకీ న రమేత. బహు స్యాం ప్రజాయేయ" అని గదా సృష్టి కుపక్రమించినాడు. ఇప్పుడు దానికి విరుద్ధముగా నీ నిఖిల సృష్టి నెట్లు లోపింపజేయును? కాన "రక్షాపేక్షామపేక్షతే" అన్నట్లు, తాను సర్వజ్ఞుడు, దయామయుడయ్యును, రక్షింపుమా నన్ను అని ఆక్రందించిన వానినే రక్షించును.

"హా కృష్ణ ద్వారకావాస పాహి యాదవనందన!
ఇమామవస్థాం సంప్రాప్తా మనాథాం కిముపేక్షసే."

అని ద్రౌపది ఆక్రందించువరకు రక్షణకు పోలే దెంత పాండవపక్షపాతియైననూ నందనందనుడు. కాన మనమునూ ఆతని ప్రార్థింతము. వ్రతమనుష్ఠింతము.

ఏ కార్యమునైనను భగవత్ప్రార్థనతో భగవదర్చనతో ప్రారంభింపవలెను. భగవంతుని పాదారవిందములర్చింపవలెను. భగవానునకు చరణ

ములున్నవన్న తొడలు నడుము ఎద తల పుండవలయును. కాన సాకార దశయందున్న భగవంతునే ఆరాధించు టుత్తమము.

అవ్యక్తారాధనము శ్రమసాధ్యము. మనబోటి చపలేంద్రియులకు అసాధ్యము. ఫలమున విశేషమున్నదా అన్న అదియును లేదు. భక్తి యోగమున-

"ఏవం సతతయుక్తా యే భక్తాస్త్వాం పర్యుపాసతే,
యే చాప్యక్షర మవ్యక్తం తేషాం కే యోగ విత్తమాః?"

"ఈ దివ్యమంగళవిగ్రహుని భజించువారు ఇంద్రియాగోచరుడగు అవ్యక్తుని ఉపాసించువారు, అను ఇరుతెగలవారిలో నెవ్వరుత్తములు? ఎవ్వరు శీఘ్రముగ ఫలమును పొందగలరు?" అన్న నరుని ప్రశ్నమునకు-

మయ్యావేశ్య మనో యే మాం నిత్యయుక్తా ఉపాసతే,
శ్రద్ధయా పరయోపేతాః తే మే యుక్తతమా మతాః.

సాకారుడగు నాపై మనస్సును నిల్పి శ్రద్ధతో నన్నారాధించువారే నాకు కడుంగడు ప్రియులు.

యే త్వక్షర మనిర్దేశ్య మవ్యక్తం పర్యుపాసతే.
సర్వత్రగమచింత్యంచ కూటస్థమచలం ధ్రువమ్.
సంనియమ్యేన్ద్రియ గ్రామం సర్వత్ర సమబుద్ధయః,
తే ప్రాప్నువంతి మామేవ సర్వభూతహితే రతాః.

చంచలేంద్రియములు నరికట్టి, ఇదమిత్థమని నిరూపించరాని, సర్వవ్యాపియై ఇంద్రియాగోచరుడై ఊహాతీతుడగు నన్నుపాసించు నిరాకారోపాసకులును నన్నే పొందగలరు. కాని,

"క్లేశోఽధికతర స్తేషాం అవ్యక్తా సక్తచేతసామ్,
అవ్యక్తా హి గతి ర్దుఃఖం దేహవద్భి రవాప్య తే."

ఫలితము సాకారనిరాకారోపాసకులకు సమానమైననూ; అవ్యక్తో పాసకులకు కష్టములు మెండు. కాన ఫలము నిదానము.

ఫలభేదము లేకున్నప్పుడు సులభోపాయమువదలి, కష్టములకు కారణమై ఆలస్యముగ ఫలించు మార్గమును తెలివిగలవారు ఆశ్రయింపరు. నయనానందకరమైన దివ్యమంగళ విగ్రహముగల భగవానుని ఆశ్రయించుటే ఉత్తమము.

గజేంద్రునికి, శబరికి, జటాయువునకు కనిపించి, ఆపాయము తొలగించి, రక్షించినవాడు సాకారుడగు శ్రీమన్నారాయణుడే గదా!

"సగుణ నిర్గుణాది చర్చలు మన కేల
కులధనమ్ము మన ముకుందు డుండ
కనుల విందుగాగ గాంతు నాతని రూపు
జిహ్వ త్రుప్పుడుల్ల చేతు భజన."

(నా సుధాబిందువులు)

ఆ విధముగ "పరమవడిప్పాడి"–పరమాత్ముని అడుగుదామరల కీర్తించి, తమ వ్రతమును కువక్రమించుచున్నారు.

వేకువనే శ్రీమన్నారాయణుని కీర్తించుచు లేచి, "నాట్కాలే నీరాడి" సూర్యోదయాత్పూర్వమే ఏటి నీటి స్నానమారోగ్యకరము. అట్లు నీరాడి "నెయ్యుణ్ణోమ్ పాలుణ్ణోమ్"–నేయి తినము, పాలు త్రావము. మా వ్రతదినములందు వాటిపై నభిలాష యున్నను, వాని గోరము.

నేయి, పాలు భోగ్యవస్తువులు. అవి యితరములకు కుపలక్షణములు. ఇంద్రియములు విషయములపైకి పరువులు వారుచుండును. అనుభవింప మనస్సు ఉవ్విళ్ళూరును. ఆ యింద్రియములను స్వేచ్ఛగా విషయములపై పారనీక కుదించి, తమ మనస్సును పరమాత్మపై లగ్నముచేసి ఆనందించు వారిని ఇతర విషయములు సన్నిహితములైనను ప్రలోభింప జాలవు.

భోగ్యవస్తువులపై లాలసతగల వానికి భగవంతునిపై దృష్టి కుదురుట దుర్ఘటము.

యదా సంహరతే చాయం కూర్మోఽంగానీవ సర్వశః,
ఇంద్రియా ణీంద్రియార్థేభ్యః తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా.

తాబేలు చిప్పలోనికి తన యంగములు ముడుచుకొన్నట్లు ఇంద్రియములను విషయ సముదాయమునుండి ఉపసంహరించుకొన్నవాడు స్థితప్రజ్ఞుడన్నది గీత.

కర్మేంద్రియముల నరికట్టినా మనస్సుతో విషయముల తలపోయువాడు మోసగాడు.

కర్మేంద్రియాణి సంయమ్య య ఆస్తే మనసా స్మరన్,
ఇంద్రియార్థాన్ విమూఢాత్మా మిథ్యాచార స్స ఉచ్యతే.
ప్రజహాతి యదా కామాన్ సర్వాన్ పార్థ మనోగతాన్.
ఆత్మన్యేవాత్మనా తుష్టః స్థితప్రజ్ఞ స్తదోచ్యతే.

బాహ్యేంద్రియముల నరికట్టుటేగాక అంత రింద్రియమైనమనస్సునుగూడ లౌకిక విషయముల మీదికి పోనివ్వక, వాటిపై కాంక్ష వాసనలతోబాటు త్యజించిన పరమాత్మాధీన మానసుడు స్థితప్రజ్ఞు డన్నాడు భగవానుడు. విషయాలనుదూరముంచినా, విషయవాసనలు నశించుట కష్టము. కాన లౌకికవిషయముల పైకి గాక మనస్సును, జీవిని ఉన్నత స్థితికి గొంపోవు నుత్కృష్టవిషయములపైకి ప్రసరింప జేయువలెను. అప్పుడా తుచ్ఛవిషయముల వాసనలునూ నశించును.

విషయా వినివర్తంతే నిరాహారస్య దేహినః,
రసవర్జం; రసోఽప్యస్య పరం దృష్ట్వా నివర్తతే.

ఇంద్రియమునకు విషయములే ఆహారము. వాటిని తొలగించిననూ రాగము నశింపదు. ఇంద్రియములను పరమాత్మ విషయకము లొనర్చిన శేషించిన విషయరాగమును నశించును.

కావున దివ్యమంగళవిగ్రహ దర్శనముచేత కన్ను, కీర్తనముచేత నాలుక, భగవద్గుణాకర్ణనముచేత శ్రవణములు తదేకాసక్తములైన, లౌకిక విషయవాంఛ సమూలము నశించును.

చిల్లాటపై లగ్నచిత్తునకు ఇల్లాలు స్మృతికి రానట్లు, "మందార మకరంద మాధుర్యమున దేలు మధుపంబు మదనములకు" చనని యట్లు

"అమృతరస మెలుక్క విష్ణుపాదారవిందమందు మదిజేర్చి యెవ్వ డన్యంబు గోరు?" (నా సుధాబిందువులు)
కావుననే—

జిహ్వే కీర్తయ కేశవం, మురరిపుం చేతో భజ శ్రీధరం
పాణిద్వంద్వ సమర్చయాఽచ్యుత కథాశ్శ్రోత్రద్వయ
త్వం శ్రుణు,
కృష్ణం లోకయ లోచనద్వయ, హరేర్గచ్ఛాంఘ్రి
యుగ్మాలయం
జిఘ్ర ఘ్రాణ ముకుందపాదతులసీం మూర్ధన్నమాధోక్షజమ్.

అని కులశేఖరాళ్వారులు ముకుందమాలయందు ఇంద్రియముల నాదేశించిరి.

కావున వ్రతానుష్ఠానసమయమున మేము లౌకిక భోగవస్తువుల నాశింపము. "నెయ్యుణ్ణోమ్ పాలుణ్ణోమ్" అన్నది గోదాదేవి.

"మెయ్యిట్టెళుదోమ్, మలరిట్టు నామ్ ముడియోమ్" అని కాటుక దిద్దియు పూలు ముడువ మన్నది. ఇది తాంబూలాదుల కుపలక్షణము.

స్త్రీల కలంకారములన్న మహాప్రీతి. ఐననూ మాకు వాటిపై లక్ష్యము లేదు. ఆ కై సేతలతో కాలము రిత్తపుచ్చము. మలినభాండమైన శరీరము నెంత సింగారించిననూ మలినములనే గ్రక్కుచుండును. అట్టి దాని నలంకరించుటయందు కాల ధన హరణము వృథా. ఆ సమయ మును భగవత్సేవలందు గడుపుట మేలు. అట్లని జుగుప్సాకరముగ చింపిరితలతో చెమటోడు మోముతో నుండరాదు. లోకులు తన్నే చూచు నట్లు వింత పోకడల పోవనూ రాదు.

'కృష్ణుని సన్నిధికి పోవునప్పుడు రమ్యముగా నాకర్షణీయముగా జిలుగువలువలతో విలువైన అపరంజి నగలతో నలంకరించుకొనవలెనే?

అనవచ్చును. అతడు మనశ్శుద్ధినే గాని బాహ్యాడంబరములను గమనించు వాడుగాడు. శారీరకాలంకారములకన్న, శాంతి దాంతి క్షమ కరుణ సచ్ఛీలము మొదలగు హృదయాలంకారములనే ఆతడాశించును కావున,

"శెయ్యాదన శెయ్యోమ్-తీక్కురళై శెన్రోదోమ్" చేయరాని పర పీడాకరములైన పనుల చేయుము. భాగవతాపచారములు ఒనర్పము. పరులకు వెగటైన పరుష వాక్యములను, బాధాకరములైన కొండెములను అసత్యములను దూషణములను ప్రేలము.

ఇట్లు మనోవాక్కాయముల పరిశుద్ధులమై, "అయ్యుయుమ్ పిచ్చెయు మాన్దనైయ్యుమ్ కైకాట్టి" ఆచార్యాది పూజలను సాదరము యథాశక్తి సంభావించి, ఆర్తులకు దీనులకు బిచ్చమిచ్చి, మా యీ వ్రతమనుష్ఠింతుము.

సౌభాగ్యవతులారా! మీరును వచ్చి నియమానుసారము మాతో గలిసి, భగవంతుని భజించి "ఉగలన్దు"-ఆనందించండి. అదియే మా "ఉయ్యుమాఱు" ఆత్మోజ్జీవన మార్గము.

సంసారపారావారమున పరిభ్రమించు జీవుడు, అపునరావృత్తి పదంబు పడయుపలయుననిన; భగవంతుని పాదారవింద శరణాగతి ఏకైక సుగము పథము. అది తన స్వరూపము. పరమాత్మ స్వరూపము. ఆచార్యునివలన గ్రహించుట జ్ఞానయోగము. ఫలాశలేక పరమాత్మ తృప్తికై "పరమనడిప్పాడి" పరమాత్మ చరణముల కీర్తనార్చనాది యజ్ఞానుష్ఠానము కర్మయోగము, చేయరాని పనులు మానుట ప్రాతికూల్య నివృత్తి. భాగవతాది సంభావనము. అనుకూల్య సంపాదనము. "ఇదియే ఉజ్జీవన మార్గము" అను మహా విశ్వాసముతో, ఎన్నుకొనుట గోప్తృత్వవరణము. ఇట్లు సాంగశరణాగతి బోధితము.

అనువాదము:-

భౌతికభోగసౌభాగ్య భూషితలార!
పరమపదాప్తికి పథము గనుడు
నీరాడి వేకువ క్షీరోదశాయి ప
న్నీరేజములను గీర్తించి మేము;

చేసెడి వ్రతనిష్ఠ చెప్పెద చెలులార!
 కైకోము పాల్ నేయిగాని, మేము
పూలను గై సేయఁబోము కొప్పులయందు,
 కాటుక పెట్టము కన్నుఁగవకు
చేయఁగూడని చేతలు చేయబోము.
 పరులబాధించు పలుకులు పలుకఁబోము
చేతనయినంత యిత్తుము చేతులెత్తి
 బీదలకుఁ బూజ్యపాదుల కాదరమున. 2

## 3 వ పాశురము

అవతారిక:— తమ వ్రతానుష్ఠానమువలన కేవల స్వార్థమేగాక పరులకును ఫలమున్నదని చెప్పుచున్నది గోదాదేవి.

ఓఙ్గి యులకళన్ద వుత్తమన్ పేర్పాడి
నాఙ్గళ్ నమ్పావైక్కు చ్చాత్రి నీరాడినాల్
తీఙ్గన్ఱి నాడెల్లామ్ తిఙ్గళ్ ముమ్మారి పెయ్దు
ఓఙ్గు పెరుమ్ శెన్నెల్ ఊడు కయలుగళ
పూఙ్గువళై పోదిల్ పొరివణ్డు కణ్పడుప్ప
తేఙ్గాదే పుక్కిరున్దు శీర్ త్తములై పత్రి
వాఙ్గక్కుడమ్ నిఱైక్కుమ్ వళ్ళల్ పెరుమ్పశుక్కళ్
నీఙ్గాదశెల్వమ్ నిఱైన్దేలో రెమ్పావాయ్.

అర్థము:— ఓఙ్గి—వృద్ధి చెంది: ఉలకు—లోకమును; అళన్ద—కొలచిన, ఉత్తమన్—ఉత్తముని, పేర్పాడి—నామము కీర్తించి, నాఙ్గళ్—మేము, నమ్పావైక్కు—మా వ్రతమునకు, చాత్రి—చాటి (ప్రకటించి), నీరాడినాల్—నీరాడిననాడు, ఎల్లామ్—దేశమంతయును, తీఙ్గు—ఉపద్రవము; ఇన్రి—లేక, తిఙ్గళ్—నెలకు, ముమ్మారి—మూడుమారులు, పెయ్దు—కురిసి, ఓఙ్గు—పెరిగిన, పెరుమ్+శెమ్+నెల్—పెద్ద ఎర్రని, వరిపైరుయొక్క, ఊడు—మధ్య, కయల్—చేపలు, ఉగళ—త్రుళ్ళగా, పూమ్—పూచిన,

కువళై—కలువలమొక్క, పోదిల్—పొదలలో, పొఱి వణ్డు—రాణించు, తుమ్మెద....కణ్పడుప్ప—కనపడగా, పెరుమ్ పశుక్కళ్—ఎద్ద ఆవులు, తేఙ్గాదే—కదలక, పుక్కి—(లోనికి) పోయి, ఇరున్దు—ఉండి, శీర్ త్త ములై; అందమైన పొదుగులను, పఱ్ఱి—పట్టి, వాఙ్గ—పిండగా, నీఙ్గాద—ఎడతెగని; శెల్వమ్—సంపద (పాలు), నిఱైన్దు—నిండునట్లు, కుడమ్ +—నిఱైక్కుమ్—కుండనించును.

వివరణ: సత్కార్యము లాచరించిన, సకల జనులకును క్షేమ మవశ్యము కల్గును. యజ్ఞము చేసినచోట మట్టూ ఆమడ మేరము 12 ఏండ్లు క్షామభావము లుండవట.

"అన్నాద్భవంతి భూతాని పర్జన్యా దన్నసంభవః;
యజ్ఞాద్భవతి పర్జన్యః యజ్ఞః కర్మసముద్భవః."—గీత.

యజ్ఞముచేత వాన, వానవేత తెగుళ్లు తొలగి పైరులు పండి, పాడి పంటలు వెలసిన, సమృద్ధిగా భోజనము లభించును. కావున యజ్ఞము దేవపూజ. తప్పక చేయవలయును. చేసిన తనకేగాక దేశమునకును క్షేమ మేర్పడును.

"ఓఙ్గియులకళన్ద వుత్తమన్ పేర్పాడి" శ్రీహరి దేవకార్యార్థమై వామనావతారుడై జనించినాడు. హిరణ్యాక్ష హిరణ్యకశిపులను చీల్చి చెండాడినవాడు. బలినట్లు హింసించ లేకపోయెను. బలి తన భక్తు డగు ప్రహ్లాదుని మనుమడు. యజ్ఞయాగాది తత్పరుడు. దానదయా శీలుడు. సత్యసంధుడు.

కలరున్ దాతలు; నిత్తురున్ ధన
　　ములన్, గామ్యార్థముల్ గొంచు వి
ప్రులు నేతెంతురు గాని, యీవిని
　　బలిన్ బోలన్ వదాన్యుండు లేఁ;
డలఘుండై యొనరించె నధ్వర
　　శతం బా భార్గవానుజ్ఞచే.
బలివేడన్ బడయుంగ వచ్చు బహు
　　సంపల్లాభముల్ వామనా!" (పోతన)

అని భూసురుల మన్నన అందిన బలి నెట్లు హింసింపగలడు? కాన తిరిపెమునకై పోయినాడు రమారమణుడు.

ఆహా! "దేహి" యను టెంత నీచము, అందుకై అంత వాడింత వాడాయెను గదా! అట్లు వామనుడై, ఒకటి రెండడుగుల భూమిని దానము వడసి లోకముల గొలువ మేను పెంచినాడు. ఉలహాళన్ద స్వామి, త్రివిక్రముడు.

"ఇంతింతై వటుఁడింతయై మఱియుఁ
దా నింతై నభోవీథిపై,
నంతై తోయదమండలాగ్రమున
కల్లంతై, ప్రభారాశిపై నంతై,
చంద్రుని కంతయై ధ్రువునిపై
నంతై, మహర్వాటిపై నంతై,
సత్యపదోన్నతుండగుచు
బ్రహ్మాండాంత సంవర్ధియై." (పోతన)

పెరిగినాడు.

అట్టి ఆపన్నశరణ్యుని కీర్తించి మేము "శాత్రి నీరాడినాల్" మా చేయు వ్రతమునకు సంకల్పించి, తదాసక్తులగు వారందరు చేరి వచ్చునట్లు, తెల్లముగ చాటించి వ్రతోపక్రమమునకై నీరాడ, "తీఙ్గిన్ఱి నాడెల్లామ్ తిఙ్గళ్ ముమ్మారి పెయ్దు" రోగరోజనములు లేకుండునట్లు దుర్భిక్షములు తొలగునట్లు, నెలకు మూడువానలు గురియును. పంటలు సమృద్ధిగ పండును.

"ఓఙ్గు పెరుమ్ శెన్నెలూడు కయలుహాళ" సస్యములు సమృద్ధిగ పెరుగుచు, ఎన్నుల బరువుచే కాడలు తలలువంచి నిటికి తగులు చుండ వానిమధ్యలో చేపలు మిట్టిపడు చుండగా:—

అనిన, నా గొల్లపల్లెలో పాడిపంటలు సమృద్ధిగా నున్నందున, ప్రజలు సాత్త్వికులైనందున మడికయ్యలలో చేపలు మిట్టిపడుచున్నను వానిబట్టి హింసించువారు లేరు. "పూఙ్గువళై పోదిల్ పొరివణ్డు కణ్పడుప్ప

వికసించిన కలువలో మకరందమును గ్రోలిన గండుతుమ్మెదలు మత్తెక్కి చలింపక పడియుండగా,

"తేజ్గాదే పుక్కిరుందు శీర్త్తములై వత్తివాజ్గ" కడుపార మేసిన పెద్దయావులు కొట్టము జొచ్చి కదలక మెదలక కాలదన్నక కొమ్ములగుమ్మక, నెమ్మదిగ నిలిచియుండ-

"కుడమ్ నిఱైక్కుమ్ నీజ్గాద శెల్వమ్" ఎడతెగని క్షీరసంపదల చేత కుండల నించుమ.

ఇట్లు మా వ్రతానుష్ఠానముచేత, అది మొదలైనప్పటినుండి దేశమున పాడిపంటలు సమృద్ధములై సర్వశోభన మేర్పడుమ. ఇట్టి శుభకరమైనది మా వ్రతము.

త్రివిక్రమావతారుడు తన పాదస్పర్శచేత; లోకముల గొలుచునప్పుడు సర్వమును పవిత్రము చేసినాడు. తాను రాజని, దానమిచ్చుచున్న ఉదారుడని, కొంచెమిచ్చుట తన మహత్త్వమునకు కొఱత యని భావించినవాడు బలిచక్రవర్తి.

"వసుధాఖండము వేఁడితో, గజ
 ములన్ వాంఛించితో, వాజులన్
వెస నూహించితొ కోరితో యువ
 తులన్ వీక్షించి కాంక్షించితో
వసిబాలుండవు నేర వీ వడుగ
 నీ భాగ్యంబు లీపాటిగా
కసురేంద్రుండు వదాన్యయుండడుగ
 నీ యల్పంబు నీ నేర్పునే ?" (పోతన)

అన్న స్వాభిమానము అహంకారము గలవాడు బలి.

"దాత పెంపు సొంపుఁ దలఁపవలదె"! అని, తన యాధిక్యము తలపోయువాడు అట్టివానిని పరిశుద్ధుని చేయవలయునన్న, నా దురహంకారము తొలగించవలెను. సంపదవల్ల కలిగిన స్వాతిశయము, అది తొలగినగాని తొలగదు. కాన సర్వంసహాధిపత్యముతో బాటు అహంకార మమకారముల నూచముట్టు హరించి పరమ సాత్త్వికుని జేసినాడు హరి.

ప్రహ్లాదుడు, బంధితుడైన బాలిని జూచి, వామనావతారునితో,

"ఇతనికి మున్ను నీ వింద్ర పదం బిచ్చి
నేఁడు త్రివ్వటయును నెఱయ మేలు;
మోహనాహంకృతి మూలంబు గర్వాంధ
తమస వికారంబు దాని మాన్పి
కరుణ రక్షించుటగాక, బంధించుటే ?
తత్త్వజ్ఞునకు మహేంద్రత్వ మేల ?
నీ పాదకమలంబు నియతిఁ గొల్చినదానిఁ
బోలునే సురరాజ్య భోగవరత ?

గర్వమేపార కన్నులు గానరావు
చెవులు వినరావు చిత్తము చిక్కువడును
మఱచు నీ సేవలన్నియుఁ మహిమ మాన్పి
మేలు సేసితి నీ మేటిమేర సూపి." (పోతన)

అని తన మనుమని సర్వస్వము హరించుట, అతని మోక్ష ప్రతిబంధకము లైన అహంకార మమకారములను పాఱదోలుటకే. అతనిని రక్షించుటకే.

ఇతర దైవముల భజించువారు ధనధాన్యముల నింపరిపోదురు. సంపదలు వృద్ధిపొందుట భగవంతునికి దూరమగుటకే. వారిని భజించు వారలకు తొలుతవున్న దూడిపోషము. భౌతికవాంఛలు నశించినగాని పారమార్థికదృష్టి స్థిరమై భగవత్సన్నిహితుడు గాజాలడు. అటుపై, భాగవతులకు భగవంతుడే బలికివలె లోబడియుండును.

ఈ విధముగ భగవంతు నాశ్రయించినవానికి "అహం త్వా సర్వ పాపేభ్యో మోక్షయిష్యామి" అన్నట్లు, "తీఙ్గిన్ఱి నాడెల్లామ్" ఆత్మ వినాశ కరములైన మోక్షప్రతిబంధకములైన కర్మల నన్నింటినీ నశింపజేయును. 'ముమ్మారి పెయ్దు" అనుటచే అనన్యార్హత్వ, అనన్య భోగ్యత్వ, అనన్య శేషత్వము లను ఆకారత్రయ సంపత్తి సిద్ధించును.

"పెరుం శెన్నెలోఙ్గి" యనుటచేత సాత్త్వికములైన శాంతి దాంతి క్షమౌదార్యాది సద్గుణము లేర్పడును, పెంపొందును.

"పూఙ్గువళై పోదిల్ పొరివణ్డుకణ్పడుప్ప" అనుటచే స్వచ్ఛము లైన గుణములు వికసింపగా, మలీమసములైన తుమ్మెదల వంటి కామ క్రోధాద్యరిషడ్వర్గము అణగాడును.

"నీఙ్గాద శెల్వమ్ కుడమ్ నిఱైక్కుమ్" అనుటచేత, అవిచ్ఛిన్న ముగా పరమాత్మానుగ్రహము పరమానందానుభూతి నింపారునని అంతరార్థము.

కావున ఆత్మోజ్జీవన కాంక్షులందరు మాతో కలిసి భగవత్ప్రీతిగా వ్రత మనుసరింతము రండనుచున్నది గోదాదేవి.

అనువాదము:—

మెలమెల్ల మినుమంచి, మెయిపెంచి
లోకాల గొలిచిన పెరుమాళ్ళఁ, గొలిచి మేము
నోమదానముసేయ బాములెల్లను డిందు
నెల మూఁడువానలు నెమ్మి గురియు,
వెన్నువంగిన మళ్ళఁ జెన్నొందు కలువ పూ
పొదలతో మించు తుమ్మెదలు మొదలు.
కయ్యల నీటిలోఁ గాడలు కదలంగ
దుడుకు వేడిసలు దుందుడుకుసేయు
కుండపొదుగుల పశువులు గోష్ఠములను
పిడికిలికి పెక్కసంబగు కొడులఁబట్టి
పిండఁ గురియును కడవలు నిండఁబాలు;
సంపదలు వెల్లవలు గట్టి పెంపుదనర. 3

## 4. పాశురము

మార్గశీర్ష వ్రతమున నిత్యావగాహనమునకు జలసమృద్ధికై మేఘమును ప్రార్థించుచున్నది గోదాదేవి.

"ఆళిమళై క్కణ్ణా! ఒన్ఱు నీకై కరవేల్
ఆళియుళ్ పుక్కు ముగన్దు కొడా ర్తేఱి
ఊళిముదల్వ నురువమ్పోల్ మెయ్‌కఱుత్తు
పాళియందోళుడై ప్పర్పనాబన్ కైయిల్
ఆళిపోల్ మిన్ని, వలమ్బురిపోల్ నిన్ఱదిర్న్దు
తాళాదే శార్ఙముదైత్త శరమళైపోల్
వాళవులగినిల్పెయ్‌దిడాయ్; నాఙ్గళుమ్.
మార్గళి నీరాడ మగిళిన్దేలో రెమ్బావాయ్."

అర్థము:—మళైక్కు-వానకు, ఆళి-నియామకుడైన, అణ్ణా-అన్నా, నీ-నీవు: ఒన్ఱు-కొంచెమైనా, కై-చేయి, కరవేల్-దాచుకొనకుము. ఆళియుళ్-సముద్రమున, పుక్కు-చొచ్చి, ముగన్దు+కోడి; (నీరు) త్రావి, ఆర్త్తు=గర్జించి, ఏఱి-(పైన) ఎక్కి, ఊళి+ముదల్వన్-(లోకములకు) ఆదియైన, (విష్ణువుయొక్క) ఉరువమ్+పోల్-ఆకారము వలె, మెయ్-మెయి, కఱుత్తు-కఱ్ఱిగా నొనర్చుకొని. పాళి=పొడవైన అమ్-అందమైన, తోళ్=బాహువులు, ఉడై-ఒదవిన, పర్పనాబన్-పద్మనాభుని, కైయిల్-కేల, ఆళిపోల్=చక్రము పోలె, మిన్ని=మించి, వలమ్బురిపోల్-వలమురి వలె, (దక్షిణావర్త శంఖమువలె) నిన్ఱు-నిలిచి (స్థిరముగా), అదిర్న్దు=గర్జించి, తాళాదే-తాళక; శార్ఙ+ముదైత్త-శార్ఙముత్రోసిన, శర+మళైపోల్-బాణవర్షమువలె, వాళ-లోకము వృద్ధిపొందునట్లు, నాంగళుమ్=మేమును, మార్గళి=మార్గశీర్షము, నీరాడ-స్నానముచేయ, మగిళన్దు-సంతసింప, ఉలహినిల్=లోకమున, పెయిదిడాయ్-కురియుము.

వివరణము:-“ఆళిమళైక్కణ్ణా” వర్షాధిదేవతయగు పర్జన్యుడా!- వాన లేనిదే సస్యములు లేవు. ప్రాణులకు తిండి లేదు. ‘పర్జన్యాదన్నసంభవః” అని గీత. శ్రీమన్నారాయణుడు లోకరక్షణ కర్తృత్వము వహించినట్లు, పర్జన్యుడు అన్నముమ ప్రజలకు ఒసంగుచున్నాడు.

అటువంటి రక్షకా! “ఒన్ఱు నీకై కరవేల్” నీవు కొంచెమేని లౌభ్యము చూపకుము. ఉదారముగా వానలు కురియుము. ఇచ్చట మున్ను

కురిసితినే, వారు ఇచ్చట కురవుమని ప్రార్థింపలేదే, అని విచారింపక కురియుచూ పోవుటే మేఘలక్షణము. "పర్జన్యవల్లక్షణప్రవృత్తిః" అని వ్యాకరణ పరిభాష. అడిగినను అడుగకున్నను పెట్టుస్వభావము నీదైననూ, దీనుల కర్థించుట స్వభావముగాన అడుగుచున్నాము.

మేఘమునకు కురియుటకు జల మెక్కడిది? దన్న "ఆళియుళ్ పుక్కు ముహన్దు కొడా ర్తేఱి" సముద్రమును జొచ్చి కడుపార నీరు గ్రోలి గర్జనసేచి, మింటి కెగురుచున్నది. సముద్రమున నవ్వారిగా వారిగలదు. కాని ప్రయోజన మేమి? దప్పిగొన్నవారికిగాని, సస్యములకు గాని, అది యుపయోగపడదు. లోభులకడ నెంత ధనమున్న నేమి? పరుల కివ్వరు. తాము తినరు.

"ఆస్తికుఁడేని, విత్తము సమస్తము
పాత్రల హస్తసాత్కృతే
శస్తము; వెచ్చపెట్టుట ప్రశస్తము
భోగరసానుభూతికై,
నాస్తికుఁడేనిఁ దానుదిన కర్థుల
కియ్యక దాచిపెట్టు చా
దస్తపు చేతకున్ కతమతర్క్యము
సుంత, అగమ్య మెంతయున్."

(నా శాంతివిలాసము)

అట్టివారినుండి, అధికారులు సాధువులు దుర్మార్గులు, భయాననో నయాననో హరించి దానిని వినియోగించుకొనుచున్నారు. సజ్జనులకు దాన మిచ్చిన దాతకు సత్ఫలము గల్గును.

సముద్రజలము క్షారమైనను మేఘగ్రహణముచేత - పేయమై పోషక మగుచున్నది.

"నీరము తప్తలోహమున నిల్చి
యనామకమై నశించు నా

నీరమె ముత్యమట్లు నళినీదళ
సంస్థితమై తనర్చు, నా
నీరమె శుక్తిలోఁబడి మణిత్వముఁ
గాంచు సమంచితప్రథన్."

అన్నట్లు స్థానవిశేషముచేత వస్తువునకు వైశిష్ట్య మేర్పడుచున్నది. గడ్డి దిని గోవు పాలిచ్చుచున్నది. పాలు ద్రావి పాము విషము గ్రక్కుచున్నది.

అటులనే ఓ పర్జన్యుడా! నిరుపయోగముగ అస్పృశ్యముగ పడియున్న కడలినీరు గ్రోలుము. నీవు జగద్రక్షకుడైన నారాయణుని స్వరూపుడవు. శేషభూతుడవు. ఆయన నిమిత్తమాత్రుడగు నీచేత తన కార్యము సాగించుచున్నాడు. అతనికి పూతనవిషము విషమించలేదు. జీర్ణమయినది. అటులనే తదంశుడవగు నీకు సాగరక్షారము వికటించదు. అట్లు కడుపార నీరు గ్రోలితివేని నీకు హరిసారూప్య సిద్ధి కలుగును.

భక్తులకు సమస్తము భగవత్స్వరూపముగ గోచరించును. కాన మేఘమును విష్ణురూపునిగ వర్ణించుచున్నది గోదాదేవి.

"ఊళి ముదల్వ నురువమ్ పోల్ మెయ్ కఱుత్తు"

లోకాదియగు శ్రీమన్నారాయణుని మేనివలె నల్లనై.

జగత్తున కాదికారణముగావ, ఊళిముదల్వన్. "జన్మాద్యస్య యతః" అని ఈ ప్రపంచమునకు ఎవ్వనివలన జన్మ స్థితి లయములు గల్గుచున్నవో అతడు పరమాత్మ అని బ్రహ్మసూత్రము.

"యత్తదద్రేశ్య మగ్రాహ్య మవర్ణ
మచక్షు శ్శ్రోత్రం, తదపాణిపాదం
నిత్యం విభుం సర్వగతం సుసూక్ష్మం
తదవ్యయం తద్భూతయోనిం
పరిపశ్యంతి ధీరాః"

(ముండకోపనిషత్తు)

ప్రాకృతేంద్రియములు కగోచరుడు, ప్రాకృతాంగములు లేని వాడు పరబ్రహ్మమని నిర్ధయించుట, "భూతయోనిం" అని సమస్త చరాచరములకుపాదాన కారణభూతుడగుట పరమాత్మ జగదాది. ఆ పరబ్రహ్మ శ్రీమన్నారాయణుడే.

"అథ పురుషో హ వై నారాయణో౽
కామయత। ప్రజాస్సృజేయేతి।
నారాయణాత్ప్రాణో జాయతే।
మన స్సర్వేంద్రియాణి చ
ఖం వాయుర్జ్యోతిరాపః పృథివీ విశ్వస్య ధారిణీ
నారాయణాద్బ్రహ్మా జాయతే।
నారాయణా ద్రుద్రో జాయతే।
(అనిమహోపనిషత్తు)

అంతంపురుషోత్తముడు నారాయణుండు
స్వాంతమ్ములోఁ దలఁచెఁ బ్రజసృష్టిసేయ
ప్రాణమ్ము గలిగె నారాయణుని నుండి
హృదయాది కిరణసముదయమ్ము గలిగె
ఆకసమ్మును గలిగె నగ్ని యప్పులును
అఖిలమున కాధారమైన ధారుణియు
జనియించె నారాయణునినుండి బ్రహ్మ
జనియించె నారాయణునినుండి శివుఁడు—
(నా నారాయణీయము)

అని సమస్త చరాచరప్రపంచ నిర్మాణకారణము శ్రీమన్నారాయణు డనుచున్నది.

కవు లాతని నీలమేఘశ్యాము డందురు. గోదాదేవి మేఘమును ఉప మానముగ నారాయణుని పేర్కొన్నది.

"పాళియన్దోళుడై పర్పనాబన్ కైయిల్ ఆళిపోల్ మిన్ని" దీర్ఘ ములై అందములైన బాహువులవాడు పద్మనాభుడు.

"సుభుజో దుర్ధరో వాగ్మీ" అని విష్ణుసహస్ర నామము. జగన్ని ర్మితి ప్రయోజ్యకర్తయగు చతుర్ముఖునికి సృష్టికారణమైన నాభికమ లము గలవాడు.

"చకాసతం జ్యాకిణకర్కశైశ్శుభై
శ్చతుర్భిరాజానువిలంబిభిర్భుజైః,
ప్రియావతంసోత్పల కర్ణభూషణ
శ్లథాలకాబంధవిమర్దశంసిభిః."

(స్తోత్రరత్నము)

ఇందిరాదేవికి తలగడగా మంచివందున ఆమె కర్ణావతంసాభరణ ముల శ్లథ కేశ పాశముల తరులు గల్గి అందమైన దీర్ఘబాహువు లాతనివి. ఆతని కుడిచేతియందు సహస్రారమైన చక్రము తేజరిల్లు చున్నది. అవ్విధముగా మేఘమా! నీవునూ, మెరుపుల మెఱయింపుము.

"వలమ్బురి పోల్ నిన్ఱదిర్న్దు"

అతని వామహస్తమున విజ్ఞానమయమైన పాంచజన్యము మిత్రా నందకరముగా, శత్రుహృదయవిదారకముగా నినదించుచున్నది. అటులనే నీవును గర్జించుము.

వట్టి మెరపులతో నురుములతో ప్రయోజనము లేదు.

"తాళాదే శార్ఙముదైత్త శరమళై పోల్ వాళవులగినిల్ పెయ్దిడాయ్"

ఆ శ్రీ మన్నారాయణుడు తన శార్ఙమునుండి, భక్తులు శరణన్న వెంటనే కొంచెమేని యాలసింపక, భక్తరక్షణార్థము, దుష్టశిక్షణార్థము అంపవాన కురిసినట్లు నీవును జలధారల గురిసితివేని, శత్రువులవోలె క్షామడామరము లడంగును. మిత్రులవోలె పాడిపంట లభివృద్ధి జెందును. దానివలన మేమును "మార్గళి నీరాడ మగిళిన్దు" మార్గశీర్షవ్రతమునకు పుష్కలోదకముల స్నానమాది ఆనందింతుము అనుచున్నది గోదాదేవి

దీనిచే లోకోపకారము భగవంతునికి తృప్తి గల్గుచున్నది. భగవ ద్భాగవత సంతోషకరకార్యములే చేయవలసినవి. స్వార్థమునేగాక

లోకకల్యాణమునూ ఆకాంక్షింపవలయును. స్వసంపద లోకక్షేమము నకే వినియోగింపవలయును. బాహ్యాడంబరములుగాక లోకకల్యాణ కరము లగు కార్యములే అనుష్ఠింపవలయును అని విశదమగుచున్నది.

కుంచించుకొనఁబోకు కొంచెమేనియు దాన
హస్తమో యన్న! పర్జాధినాథ!
కడలి లోనికిఁ జొచ్చి కడుపార నీరాని
త్రేఁచి, నింగికి నెక్కి రేఁగి సాఁగి,
జగదాదికారణ శ్యామలవిగ్రహా!
పద్మనాభుని దీర్ఘబాహుయుగళి
1 సరియుఙ్లు మెరపులఁ బరపుచు, 2 వలమురి
కైవడి గంభీర గర్జ లెసఁగ
పైరు పచ్చల జగతి సంపదలు పొదల
3 నాగ్రహాయణి మేము నీరాడి మురియ
శార్ఙ్గ కార్ముక నిర్గత శరవిధాన
వానఁగురియుము వేగ ననూనదాన!" 4

## 5 పాశురము

అవ:-మోక్షప్రాప్తికి కర్మసందోహము ప్రతిబంధకము. కర్మలే జన్మపరంపరకు కారణములు కావున వానిని నిర్మూలించుకోవలయును. భగవద్ధ్యానము, సేవ, కీర్తనము, కర్మవిహీనతకు సులభతర మార్గ మనుచున్నది గోదాదేవి.

పాశురము

మాయనై మన్ను, వడమదురై మైన్దనై
త్తూయ పెరునీర్ యమునై త్తురైవనై
ఆయర్ కుల త్తినిల్ తోన్ఱుమ్ మణివిళక్కై
త్తాయైక్కుడల్ విళక్కమ్ శెయ్ద దామోదరనై

1. చక్రము. 2. శంఖము. 3. మార్గశిరము.

తూయోమాయ్ వన్దు నామ్ తూమలర్ తూవి త్తొళుదు
వాయినాల్ పాడి, మనత్తినాల్ శిన్దిక్క
పోయప్పిళ్ళైయుమ్, పుగుదరువా నిన్ఱనవుమ్
తీయినిల్ తూశాగుం. శెప్పేలో రెమ్బావాయ్.

అర్థము:–మాయినై–మాయావియై, మన్ను–మని, వడమదురై–ఉత్తర మథురానగరికి, మైన్దనై–అధిపతియై; తూయ–పవిత్రమైన, పెరునీర్–బాలనీరుగల, యమునై–యమునానదియొక్క, తురైవనై–తీరవనమున నున్న, ఆయర్కులత్తినిల్–గొల్లకులమున, తోన్ఱుమ్–అవతరించి, అణి+విళక్కై–అందమైన దీపమైన, తాయైక్కుడమ్–తల్లి కడుపును, విళక్కం శెయ్దు–వెలిగించిన, దామోదరనై–దామోదరుని, తూయోమాయ్–పవిత్రులమై, వన్దు–వచ్చి, తూ–పవిత్రమైన, మలర్కళ్–పూవులను, తూవి–చల్లి, తొళిదు–పూజించి, వాయినాల్–నోటితో, పాడి=పాడి, మనత్తినాల్–మనసుతో, శిన్దిక్క–చింతించిన, పోయ పిళ్ళైయుమ్=గడచిన పాపమును, పుగు దరువాన్–వచ్చుటకై, నిన్ఱనవుమ్–నిల్చినదియును, తీయినిల్–నిప్పును, తూశు=దూది, ఆహుమ్=అగును. శెప్పు–(అతనిని) చెప్పుము (కీర్తించుము)

తాత్పర్యము:–మాయామానవుడై మథురయందు అవతరించి, పరిశుద్ధ యమునానదీ తీరముల విహరించు కృష్ణుని శుద్ధమనస్కులమై యారాధించిన, సంచితాగామి కర్మలు, అగ్నిని బడ్డ దూదివలె నశించును.

వివరణము:—

అజోపి సన్నవ్యయాత్మా భూతానామీశ్వరోఽపి సన్,
ప్రకృతిం స్వామధిష్ఠాయ సంభవామ్యాత్మమాయయా.

జననమరణములు లేనివాడయ్యు శ్రీమన్నారాయణుడు, కర్మానుసారముగాక, స్వసంకల్పానుసారముగ–

యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత,
అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్. గీత.

అన్నట్లు ధర్మోద్ధరణ కవతరించు చుండును. అతని స్వరూపము ప్రాకృత దృష్టికి గోచరముగానిది. సహస్ర సూర్యాతిశాయి తేజస్సుగల తన సన్నిధిని మానవులుండజాలరని, ఆత్మతేజమును కుంచించుకొని మాయా మానవుడుగా నవతరించినాడు.

ఉత్తర దిక్కున మధురానగర ప్రజ దక్షిణమధురయందలి జనులకంటె అదృష్టవంతులు. కావుననే విభవావతారుడగు కృష్ణుని జూడ గల్గినారు. అతని పాలన ననుభవించినారు. అట్టి మధురానగరము నకు నాయకుడై, అతడు,—

"తూయపెరు నీర్‌యమునై త్తురైవనై" యమునానదీజల పూరము పవిత్రమైనది. సద్యోజాతుడై శిశురూపియైన కృష్ణుని, వసు దేవుడు గోపకులమునకు కొనిపోవుతఱి, బాలకృష్ణుని పాదారవిందముల స్పృశించి ఆతనికి తెరువానంగి, గోపికాకృష్ణుల జలక్రీడలచేతను పవిత్ర మైనది. వారి క్రీడలచే దాని తీరములు పునీతములైనవి. అట్టిపట్టుల బాలక్రీడల నెరపినవా డతడు.

"ఆయర్ కులత్తినిల్ తోన్లుమ్" రాజవంశమున బుట్టియు గొల్ల కులమున వెలసినవాడు.

ఏమి నోము ఫలమొ ఇంత ప్రొద్దొక వార్త
వింటి ముబలలార। వీను లలర
మన యశోద చిన్న మగవాని గనెనఁట
చూచివత్తమమ్మ సుదతులార! (పోతన)

నంద యశోదలకు కృష్ణుడు జనించిన వార్త వినుటయే తొలినోము ఫల మైన, అతనిని కనిపెంచి లాలించినవారి పురాకృత సుకృత సంచయ మెంతటిదో గదా!

తత్త్వ మాలోచించిన, శ్రీమన్నారాయణుడు వైకుంఠము వీడి ప్రాకృతలోకమున నవతరించుట దుష్టశిక్షణార్థ మనుటనమ్మరాని మాట.

"జగములఁ బ్రోచు బాధ్యత
భుజావళిఁ దాలిచి నీవు సాదులన్
సుదతుల బాధ పెట్టు, పరసుందరులన్
బలవంతపెట్టు, దుండ

గులను రూపుమాపుటకు,
నైగమధర్మములింపు పెంపునొం
దగ, విభవావతారుఁడయినావఁట
మాధవ చెన్నకేశవా!

కానీ నా కది నచ్చలేదు విను,
సంకల్పైక సంసిద్ధకా—
మా! నీ యిచ్ఛ యొకండె రక్కసి
గమిన్ మాయింప దక్షంబుగా
దా? నీ శార్ఙ్గములేద? చక్రమును
లేదా? వంపఁబోదా? అరిం
దానై దా విదళించ వచ్చునుగదా!
దామోదరా! కేశవా!

గోటను బోవుదానికయి గొడ్డలి
దెచ్చిన భంగి నీవు నీ
పేటను కోటనున్ విడచి
పెండ్లము పానుపు వెంటరాఁగ, నీ
రాట నిశాట శాల్మనివహంబు
నడంపగ వచ్చితన్న, నా
మాటను విన్న, నవ్వరె?
రమారమణీధవ చెన్నకేశవా!

(నా కేశవ ప్రవత్తి)

అంబరీషునిపై దుర్వాసుడంపిన కృత్తిని సంహరించుటకు వైకుంఠము వీడి వచ్చితివా? అచ్చటి నుండియే చేతిచక్రమును పంపలేదా? అది యుమ, ముని ప్రయోగించిన కృత్తిని హతమార్చి, తనివి సనక వెంట బడి మునిని తఱుమలేదా?

భువి దూఱన్ భువి దూఱు, నబ్ధిఁజొర
నబ్ధిన్ జొచ్చు నుద్వేగియై
దివిఁ బ్రాకన్ దివిఁబ్రాఁకు, దిక్కులకుఁ
బో దిగ్విభులన్ బోవుఁ జి
క్కి వెసన్ గ్రుంగిన గ్రుంగు, నిల్వ
నిలుచున్ గ్రేడింపఁ గ్రేడించు నొ
క్కవడిన్ దాపసు వెంటనంటి
హరిచక్రం బన్యదుర్వక్రమై.

ఏ లోకంబునకైన వెంటబడి తో
నేతెంచు చక్రానల
జ్వాలన్ మానుపువారు లేమిఁ
జని దేవజ్యేష్ఠు లోకేశు వాఁ
డాలోకించి, "విధాత! విశ్వ
జననవ్యాపార పారీణ రే
ఖా లీలేక్షణ! కావవే కరుణఁ,
జక్రంబున్ నివారింపవే.

(పోతన)

అని యా ముని ముల్లోకముల కేగి ముమ్మూర్తుల ప్రార్థించియు కృతకృత్యుడు గాలేక, భాగవతుడైన యంబరీషుని శరణము వలకు విడువ లేదుగదా! అట్టితరి తిరుగులేని యా యాయుధముల నాజ్ఞాపింపక తానేల దిగి రావలయును?

వచ్చియు గజేంద్రుని బట్టిన మకరిని, శతాధికము దూషించిన శిశుపాలుని ఆ చక్రము చేతనేగదా సంహరించుట. ఆ పని వైకుంఠము నుండియే చేయవచ్చును గదా!

కాన భూతని పుట్టుకకు పరమార్థము దుష్టశిక్షణ గాదు.

మరేమన,

"తావక మంజుముగ్ధ శిశుతన్
గనఁగోరిన భక్తకోటికిన్
నీ వదనేందుబింబరమణీయత
గోరిన గోపికాళికిన్
స్వావనదక్షు సేవ నలువంగఁ
దలంచిన యార్తకోటికిన్
నీవు ముదంబుఁగూర్పఁగ జనించితి
వంచుఁ దలంతు కేశవా.

(నా కేశవ ప్రవృత్తి)

అన్నట్లవతరించి, "తాయైక్కుడళ్ విళక్కం శెయ్ద-" తల్లి కడుపు వెలుగొండ చేసినాడు.

"తొల్లి స్వాయంభువ మన్వంతరంబున పృశ్నియను పరమ పతివ్రతయు, సుతపుండను ప్రజాపతియు, వేంద్రదంబుగ పంద్రెండువేల దివ్యవర్షంబులు తపంబుసేసిన-మీకు నాకుంగల రూపు సూపి యేమ, తిరంబులగు వరంబులు వేఁడుమనిన, మీరు నా మాయన్ బాయని మోహంబున, బిడ్డలులేని దొడ్డయడ్డబున దుర్గమంబగు నవవర్గంబుఁగోరక, నాయీడు కొడుకు నడిగిన మెచ్చి యట్ల వరంబిచ్చి మీ కేను పృశ్ని గర్భుండన, నర్భకుండనయితి మఱియును.

అదితియు కశ్యపుఁడనఁగా
విదితులరగు మీకుఁ గుఱుచవేషంబున నే
నుదయించితి వామనుఁడనఁ
ద్రిదశేంద్రానుజుఁడనై ద్వితీయ భవమునన్.

ఇప్పుడు మూఁడవ బామునఁ
దప్పక మీ కిరుపురకును తనయుఁడ నైతిన్
చెప్పితి పూర్వము మీయం
దెప్పటికిని లేదు జన్మమిటపై నాకున్.

(పోతన)

అటులనే రామావతారమున "పుంసాం మోహనరూపాయ" అన్నట్లు మనోహరాకారుడై మునుల యాలింగనాకాంక్ష దీర్చుటకు గోపాలవిలాసము నెరపుటయే యవతార పరమార్థము.

వైకుంఠమునుండియే దుష్టుల శిక్షించిన నీ భక్తుల కోరిక లెట్లు తీరును? కాన నందునికై యవతరించి తల్లికడుపు శోభాయమాన మొనర్చినవాడు.

"దామోదరనై" తల్లి యశోదచే తలుగుంచే ఉదరమున కట్టబడినాడు. అఖిలబ్రహ్మాండ సముదాయమును లోనధరించిన యాతని బొజ్జ తలుగులచే త్రాళ్లచేకట్టుపడునా? "ఆ ముద్దియ ముద్దులపట్టి యుదరంబు గట్టనడరుచు చతురంబుగ నొక్క త్రాడుగట్టిన, నది రెండంగుళంబులు గడమువడియె. మఱియొక్క బంధంబు నంధించి వలగొనిన, నంతియ కొరంతయయ్యె. వెండియు నొక్క పాశంబు గూర్చి పరివేష్టించిన వెల్తి చూపె నిట్లు.

చిక్కఁడు సిరికౌఁగిటిలోఁ
జిక్కఁడు సనకాది యోగిచిత్తాబ్జములన్
జిక్కఁడు శ్రుతిలతికావళిఁ
జిక్కె నతఁడు లీలఁదల్లి చేతన్ ఱోలన్.

తజ్జనని లోఁగిటం గల
రజ్జుపరంపరలఁ గ్రమ్మఱన్ సుతుఁ గట్టన్
బొజ్జ దిరిగిరాదయ్యె జ
గజ్జాలము లున్న బొజ్జఁ గట్టన్ వశమే?"

బంధవిమోచకుఁ డీశుఁడు
బంధింపన్ బెనఁగు జనని పాటోర్చి సుహృత్
బంధుఁడు గావున, జననీ
బంధంబునఁ గట్టుపడియె పాటించి నృపా!

(పోతన)

ఆ విధంబుగ దామోదరుడైన వాడు, అట్టి వానిని.—

"తూయోమాయ్‌వన్దు నామ్
తూమలర్ తూవి త్తొழుతు"
వాయినాల్ పాడి,
మనత్తినాల్ శిన్దిక్క"

మనము నీరాడి శరీరమలములను, హరినామకీర్తనముచేత వాచికమలములను తొలగించుకొని పవిత్రులమై వచ్చి మనస్సుచే తదేక చిత్తులమై చింతించుచు, నోటకీర్తించుచు, పవిత్రములగు పూలచే నర్చించిన మేని, త్రికరణ శుద్ధిగల మనకు—

పోయప్పిళైయుమ్ పుహుదరువాన్
నిన్ఱనవుమ్ తీయనిల్ తూశాగుమ్"

ముక్తి ప్రతిబంధకములైన కర్మలు నిప్పులబడ్డ దూదివలె రూపరును.

కర్మలు సంచితములు, ఆగాములు, ప్రారబ్ధములు అని ముత్తెగలు. అవి జీవుని ముక్తికి ప్రతిబంధకములు.

"మమైవాంశో జీవలోకే జీవభూతస్సనాతనః"

అని జీవులు భగవదంశసంభూతులగుట చిదానందరూపులు ఐనను ప్రకృతివిలాసములకు లోగి, ప్రకృతికి చిక్కి, పరమాత్మకు దూరమై, ఇంద్రియములను జయింపలేక వానివెంట పరుగిడుచున్నారు.

"ఆత్మానం రథినం విద్ధి శరీరం రథమేవ తు,
బుద్ధిం తు సారథిం విద్ధి మనః ప్రగ్రహమేవ చ.

ఇంద్రియాణి హయానాహు ర్విషయాంస్తేషు గోచరాన్,
ఆత్మేంద్రియ మనోయుక్తం భోక్తేత్యాహుర్మనీషిణః.

యస్త్వవిజ్ఞానవాన్భవత్యయుక్తేన మనసా సదా,
తస్యేన్ద్రియాణ్య వశ్యాని దుష్టాశ్వా ఇవ సారథేః.

యస్త్వవిజ్ఞానవాన్భవత్యమనస్కస్సదాఽశుచిః,
న స తత్పద మాప్నోతి సంసారం చాధిగచ్ఛతి.
యస్తు విజ్ఞానవా న్భవతి సమనస్క స్సదా శుచిః,
న తు తత్పద మాప్నోతి యస్మాద్భూయో న జాయతే.
విజ్ఞానసారథిర్యస్తు మనఃప్రగ్రహవా న్నరః,
సోఽధ్వనః పారమాప్నోతి తద్విష్ణోః పరమం పదమ్.

(కఠోపనిషత్)

దేహమే రథము. ఇంద్రియములు గుఱ్ఱములు. మనస్సు కళ్ళెము. బుద్ధి సారథి. మంచి బుద్ధితో మంచి మనస్సుతో నింద్రియములను చెడు తెరువుల బోనీక మంచి మార్గమున నడపించిన, గుఱ్ఱములకు రథమునకు రథికునకు అపాయములేక సన్మార్గమున బోయిన రథికునకువలె, ఆత్మకు సుఖముగా గమ్యస్థాన ప్రాప్తిగల్గును. తిరుగులేని మోక్షమును జీవుడు పొందగలడు. అటుగాక అదుపులేని పెంకి గుఱ్ఱములు పెడమార్గమున పరువుదీసి రథికున కపాయము కలిగించునట్లు దురింద్రియముల వెంట బోయిన దుర్మనస్కుడు, దుర్బుద్ధి సంసారగర్తమున పలుయాతనల నను భవించును.

కావుననే నవవిలాసములతో శృంగారచేష్టలతో ప్రవరుని వరూథిని యాకర్షింప ప్రయత్నింప వామె వలకు వలనుగాక యతడు—

తరుణీ! రేపును మాపుహవ్యముల
చేతన్ దృప్తుఁడౌ వహ్ని స
త్కరుణాదృష్టి నొసంగు సౌఖ్యము
లెఱుంగన్ వచ్చునే నీకు, నా
కరణుల్ దర్భలు నగ్నులున్ ప్రియము
లై నట్లన్యముల్ గావు దల్
దిరమె? చెప్పకు మిట్టి తుచ్ఛ
సుఖముల్ మీసాలపై తేనియల్.

(పెద్దన)

అని యామెమ తిరస్కరించినాడు.

విజ్ఞుడైనవాడు తాత్కాలిక సుఖముల కాసించి వరమును బలిపెట్టడు. క్షణికసుఖలాలసుడు కానివసులు చేసి తత్ఫలముగ దుష్టయోనుల జన్మించుచున్నాడు.

ఫలాపేక్షచే సత్కార్యము లాచరించినవాడును, స్వర్గాది సుఖముల ననుభవించియు "క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి" అన్నట్లు మరల భూమిలో పుట్టుచున్నాడు. మరల కర్మలు చేయుట మరల పుట్టుట - దీని కంతెక్కడ?

"పునరపి జననం పునరపి మరణం
పునరపి జననీజఠరే శయనమ్,
ఇహ సంసారే బహు దుస్తారే
కృపయాఽపారే పాహి మురారె."

(ద్వాదశమంజరి)

ఇట్లెన్నెని జన్మల సుడివడుచు, బహుజన్మకృత సుకృతవిశేషము చేత సదాచార్యసన్నిధిచేరి, సన్మార్గ మెరిగి నదుపదేశము నొంది, భగవంతుని దయకు పాత్రుడై ముక్తిని బడయుచున్నాడు.

కాన కర్మలు, సుకృతములుగాని, దుష్కృతములుగాని ముక్తి ప్రతిబంధకములే. సంకెలలు ఇనుపవైన నేమి? బంగారువైన నేమి? బంధకములే గదా?

అన్నెమువోలె హేతువగు నంట
యిహమ్మున బాము గొంటకై
పున్నెముగూడ; కర్మమను
భోగములేక నశించి పోవునే?
అన్నెము పున్నెమున్ వలన నన్య
యసౌఖ్య పదార్గళమ్ము, నే
నన్ని ఫలాశవీడి భవదర్పణ
సేయఁగఁ జూతు కేశవా.

(నా కేశవ ప్రవృత్తి)

కావున నీ సంచితాగామి కర్మలను దగ్ధమొనర్చవలయును.

"పుట్టుకు విత్తు కర్మ మది
పున్నెము పన్నెమునైన భుక్తికై
పుట్టువు నెత్తు జీవి యది
పొల్లొనరించిన దగ్ధ కర్ముడై
పుట్టడు మీద, నందులకు బోధ
మొనర్చెను సాంఖ్యయోగమున్
దొట్టియుపాయముల్ యదు
సుతుండు ప్రపన్న మహేన్ద్రసూరికిన్."

(నా యతిరాజీయము)

కర్మక్షయమున కనేకోపాయములు,

"భజ ముకుందుని భజ ముకుందుని
భజ ముకుందుని తమ్ముడా,
చావుకాలము దాపురించిన
కావ వేవియు మూఢుడా!"

అన్నారు శంకరాచార్యులు.

అనగా కాచువాడు ముకుంద దొక్కడే. కాచుట, తిండితీర్థములు, ఇల్లు వాకిలి, భూమి పుత్రలు, ఆలుబిడ్డలు ఇచ్చట గాదు.

రక్షణ యన్న, మేనునకు రాం
కవముల్ సునుపట్టు పుట్టముల్
కుక్షికిఁ బాయసాన్నములు
కూరలు భక్ష్యములించు పౌన కా
లక్షికి రమ్యవస్తువు లనామయమున్
ధనమున్ గృహమ్ములా!
మోక్షముగాక, చచ్చుచును
బుట్టుచుఁ గుందెడి జీవకోటికిన్.

(నా యతిరాజీయము)

ఆ ముక్తి ప్రదానము ముకుందునకే సాధ్యము. "ముకుందు" డన మోక్షము నిచ్చువాడని యర్థము. ఆత డన్వర్థనాముడు. కావుననే ఆతని భజింపు మనిరి శంకరాచార్యులు.

గోదాదేవి త్రికరణశుద్ధిగా దామోదరుని సేవింపు డనుచున్నది. మనస్సుచే చింతించి వాలకచే కీర్తించి చేతులతో మంచిపూలతో పూజించిన సంచితాగామికర్మలు నిప్పువబడ్డ దూదివలె నిశ్శేషముగ భస్మీభూతములగును.

ప్రారబ్ధకర్మ మనుభవించుటచే నమసిన దేహావసానమున జీవునకు ముక్తి కరస్థము. కాన మనమందరము హరిని భజింతము రం డనుచున్నది గోదాదేవి.

అనువాదము–

మాయలమారియై మధురలో జన్మించె,
గొల్ల కొలమ్మునఁ దల్లి కడుపు
విలసిల్లఁజేసె, మంగళ దీపమగుచు, కా
ళిందితీరాన కేళీవినోద
ముల సల్పె నట్టి దామోదరు మన మెల్ల
స్నాతలై పూతలై నతు లొనర్చి
కమ్మని పూవులఁ గడక పాదారవిం
దమ్ము లర్చించి చిత్తమ్మునందు
ధ్యానమొనరించి పాట నోరాడ పాడ,
1. న పునరావృత్తి వద గోపురార్గళములు
సంచితాగామి కర్మలు నమసిపోవు
కాలదే నిప్పులోబడ్డ తూలరాశి.

## 6వ పాశురము

అవతారికః– ఇది మొదలు పది పాశురములచే భగవత్కైంకర్యమునకు కలసిరండని ఇతర కన్యల పిలుచుట వర్ణితము.

1. వైకుంఠపురద్వారము గడియమానులు

పెరియాళ్వార్లు:—

"వాళాళ్ కెట్టునిన్తిరుళ్ళీ రేల్ వన్దు
మణ్ణుమ్ మణముమ్ కోణ్మిన్
కూళాళ్ పట్టు విన్తిరళై ఎజ్గళ్
కుళవినిల్ పుగుదలొట్టోమ్"

(తిరుప్పల్లాండు)

పెరుమాళ్ళ సేవలో మురిపమ్ము గలదేని
కుడిబడిగ నిలవుడీ నడికట్టు బిగగట్టి
కడుపు కూటికి వెతలబడు బడుగులను మేము
రానీము మా గుంపులోని కేరిని గూడ.

(నా మంగళాశాసనము)

అమచున్నది గోదాదేవి.

పాశురము:—

పుళ్ళుమ్ శిలుంబినకాణ్; పుళ్ళరయ్యన్ కోయిలిల్
వెళ్ళైవిళిశజ్గిన్ పేరరవమ్ కేట్టిలైయో
పిళ్ళా యెళుందిరాయ్; పేయ్ములై నఞ్జుణ్డు
కళ్ళచ్చగడం కలక్కళియ క్కాలోచ్చి
వెళ్ళత్తరవిల్ తుయిలమర్న్ద విత్తినై
ఉళ్ళత్తు క్కొండు మునివర్గళుమ్ యోగిగళుమ్
మెళ్ళవెళున్దు అరియున్ద పేరరవమ్
ఉళ్ళమ్ పుగున్దు కుళిర్న్దేలో రెమ్బావాయ్.

అర్థములు:—పిళ్ళాయ్—పిల్లా, పుళ్ళుమ్—పులుగులు, శిలుమ్బిన—శబ్దించుచున్నవి, కాణ్—కనుము, పుళ్—పక్షికి గరుత్మంతునికి, అరైయన్—అధిపతియైన (విష్ణువుయొక్క), కోయిలిల్—కోవెలయందు, వెళ్ళై—తెల్లని, విళి—పిలుచు, శజ్గిన్—శంఖముయొక్క, పేర్—పెద్ద, అరవమ్—నవ్వడి, కేట్టిలైయో—వినలేదా? ఎళున్దిరాయ్—లెమ్ము. పేయ్+ములై

నఞ్ఞు-రక్కసి స్తనముల విషమును, ఉణ్ణు-తిని; కళ్ళ+చ్చగడమ్-కల్ల శకటము, (శకటాసురుని) యొక్క; కలక్క=కలయిక, అళియ=అడగ, కాల్+ఓచ్చి-కాలుచాచి, వెళ్ళత్తు-పాలసముద్రము యొక్క, అరవిల్-పాముపైన, తుయిల్-తూగును, అమర్న్ద-అమరిన, విత్తినై-(జగములకు) విత్తైనవానిని, ఉళ్ళత్తు-ఉల్లమున, కొండు-ధరించి, మునివర్గళుమ్-మునివరులును, యోగిగళుమ్-యోగులును, మెళ్ళ-మెల్లగ, ఎళున్దు-లేచి, అరి+ఎన్ర-హరి యనెడి, పేర్+అరవమ్-పెద్ద, ధ్వని; ఉళ్ళమ్(మా) ఉల్లమును, పుగున్దు-చొచ్చి, కుళిర్న్దు-చల్లజేసినది.

ఓ చిన్నదానా! ఇంకనూ పండుకొనియున్నావే. పక్షు లఱచుచున్నవి. భక్తుల నాహ్వానించుటకు దేవాలయమునందు శంఖ మూదుచున్నారు. తాపసులు, యోగివర్యులు బ్రాహ్మముహూర్తముననే లేచి ఉచ్చరించుచున్న భగవన్నామములు, గుణకీర్తనములు మా డెందముల నానందతుందిలము లొనర్చుచున్నవి. నీ వేం ఇంకనూ లేవకయున్నావు?

వివరణ:–'బ్రాహ్మే ముహూర్తే బుద్ధ్యేత' అని స్మృతి.

శ్రుతులు, స్మృతులు మానవులకే. పశుపక్ష్యాదుల కా విధినిషేధములు లేవు. అవి ప్రకృత్యధీనములు. వానిలోని జీవుని జ్ఞానము తేజస్వి గాదు. తేజోవంతమైన జ్ఞానముగల మానవులు ప్రకృతిని అదుపులో బెటుకొనగలరు. యథేచ్ఛ మాచరింపగలరు. సుఖలాలసులై ఇంద్రియము లీడ్చినట్లు బోవుదురు. ఇంద్రియముల నరికట్టనూ గలరు. పశుపక్ష్యాదులకు ప్రకృతిని నియమించు శక్తి లేదు. ఆకలైనపుడు దొరికినది తిను; నిద్రవచ్చిన కన్నుమూయుట, అవసరమున మలమూత్రాలను విసర్జించుట వాని ధర్మము.

ప్రకృతి అహోరాత్రానుసారము తత్తద్ధర్మముల సాగించుచుండును. గడియారమునకు కీ యిచ్చిన, పడియున్నంత వరకు ఆడుచునే యుండును. మధ్యలో నిలుపజాలదు. దానిని నిలుపగలవాడు, త్వరపెట్టగలవాడు, మందగింపజేయగలవాడూ మానవుడే.

ప్రకృతికి లోబడి విశిష్టజ్ఞాన శూన్యములైన పక్షులే లేచి అఱచు చున్నవి. ఎరకు దిక్కులకు పోవ నాయత్త పడుచున్నవి. అట్లుండ జ్ఞానపతివై వ్రత మనుష్ఠింత మని సంకల్పించుకొన్న నీవు ఇంతవరకు నిద్ర లేవకున్నావే. తెమ్ము అప్పుడే వేగినది.

"పుళ్ళరయ్యఱా కోయిలిల్ వెళ్ళై
విళిశఙ్గిన్ పేరరవమ్ కేటిలె యో"

"తెలివిమాలిన పక్షు లెప్పుడు పట్టిననప్పుడు లేచును. అఱచును. వానికేమి వేళాపాళా?" అని ఙూకరింతువేమే పిల్లా! అదిగో విను. గరుడవాహమని ఆలయమున, స్వామిసేవకై యర్చకులు విచ్చేసి, శంఖ ధ్వనులతో భక్తుల నాహ్వానించుచున్నారు. అదియు అల్పము గాదు, మహాధ్వని. దీర్ఘనినాదము. ఆ శంఖధ్వనియే విలక్షణమైనది. ఎన్ని మారులువిని పరిచితమైనది గాదు! తెల్లని దక్షిణావర్తమైన ఆ విష్వా లయ శంఖారావమే ప్రత్యేకమైనది. ఆ నాదు నీ చెవి కెక్కలేదా? "పిళ్ళాయ్" వయసు వచ్చినా పసితనపు చేష్ట లుడగనిదానా! వయసు గాదే పెద్దఱికము నిచ్చునది. సమయానుగుణ ప్రవర్తనము లేకున్న పెద్దతనము లేదే. లెమ్మికనైనను—

"మునివర్గళుమ్ యోగిగళుమ్ మెల్ల
ఎళున్దు అరియన్ఱ పేరరవమ్"

మునివరులు యోగులు వేకువనే లేచి హరినామకీర్తన చేయు చున్నారు.

"నామస్మరణా దన్యోపాయం
న హి పశ్యామో భవతరణే
రామ హరే కృష్ణ హరే తవ
నామ సదాఽనువదామి హరే"

అని భవతరణమునకు హరినామ కీర్తనకు మించిన యుపా యము లేదు.

ప్రకృతిబద్ధమైన జీవి క్రిమికీట పక్షి పశుజన్మాల దాటి భగవదను గ్రహముచే మానవతకు దేబడినది.

"కరుణాసింధువు నీవుగా, తృణ
ముగా కంజంబుగా గ్రామనుగా
పురువుంగా విహగంబుగా మృగ
ముగా పుట్టించి గిట్టించినన్
వరుసన్ మర్త్యునిగా నొనర్చి మరి
నీ పాదారవిందద్వయీ
పరివస్యా సుకృతంబు గూర్చితివి
దేవా! మాధవా! కేశవా!

(నా కేశవప్రతిపత్తి)

ఈ విధముగ మానవజన్మకు తెచ్చినవాడు జ్ఞానము నొసగి యుక్తా యుక్త విషయబోధకు వేదశాస్త్రముల ననుగ్రహించినాడు.

జీవుల మేలుకై వెడలఁజేసితి
వాగమరాశి నీవు త
ద్భావము బోధసేయఁదగువారలు
జీవులె యంచు శాస్త్రముల్
నీవ రచింపఁజేసితి ముని
ప్రవరావలిచేతఁ దాముగా
భావన సేయఁగా వలఁభవం
బులఁ బుట్టఁగఁ జేసినాడవో
దేవ! తథాపి యీ ప్రజకు
తెల్వి జనింపమి నీదు దోసమా?

(నా శాంతివిలాసము)

పురుషార్థములు సాధించుటకు పటిష్ఠములైన యింద్రియములుగల దేహమును సమకూర్చినాడు. ఇట్టి శరీరము, బుద్ధిపాటవము మరి యే

ప్రాదికినీ లేవు. మహాకాయమైన మదమాతంగమును, అతిక్రూరమైన శార్దూలమును ఈ మానవు డదుపులో పెట్టుకోగలడు. అట్టి దీ మానవ జన్మ. దీనితో ఆత్మోద్ధరణకు పూనుకోవలె. ఇంద్రియములను సద్వినియోగ మొనర్చుకొన్నగాని ఆత్మాభివృద్ధి గల్గదు. కాని వానిని దుర్వినియోగ మొనర్చుకొన్నవారే మెందు.

కలదు పటిష్ఠ పాదయుగ
     కావథమందె చరింప నెప్పుడున్
కలదు రసజ్ఞవాడియయి
     కారులు ప్రేలనె దూఱులాడనే
కలదు మనీష యన్యగత
     కల్మషచర్చల నాచరింపనే
కలగియు నవ్వి, యాత్మహిత
     కర్మల కుందిని మూఁగజంతువన్.

(నా శాంతివిలాసము)

భగవానుడు భవతరణమునకు సాధనముగ నిచ్చిన ఈ శరీరమును అందులకై యుపయోగింపనివాని జీవితము నిరర్థకము.

"మామేకం శరణం వ్రజ" నన్నొకనినే శరణుబొందుము. అది నీవంతు. నీ వట్లుచేసిన నీ మోక్షప్రతిబంధకములైన అన్ని పాపములను కొట్రోలి నిమ్ము భవబంధములనుండి విముక్తుని చేయుదును. అది నావంతు- అన్నాడు భగవానుడు.

కావున అన్యచింతలుమాని మౌనులు యోగులు పడకవీడినది మొదలు శ్రీహరిని కీర్తించుచున్నారు.

'మన' ధాతువునకు "ఇఙ" ప్రత్యయముచేర్చి 'ఉ' కారమురాగా మునిశబ్దమేర్పడినది. "మన్యతే ఇతి మునిః" అని వ్యుత్పత్తి. మన- జ్ఞానే అను ధాతుజన్య మదిగాన జ్ఞానముగలవాడని యర్థము,

స్వస్వరూప జ్ఞానము, పరస్వరూప జ్ఞానముగలవాడు ముని యోగి యన్న-

"యోఽంతస్సుఖోఽ న్తరారామః
తథా న్తర్జ్యోతిరేవయః స యోగీ." — గీత.

బాహ్యవిషయాసక్తుడుగాక తనలో వెలుగుచున్న పరమాత్మయెడ ఏక కాముడు యోగి.

అట్టి మునులు, యోగులు భగవత్కీర్తనము చేయుచున్నారు; కీర్తించుటయన్న గుణములు వర్ణించుట, ఆతని లీలలు వర్ణించుట.

"వెళ్ళ త్తరవిల్ తుయిలమర్న్ద, విత్తి,"

క్షీరార్ణవమున శేషతల్పమున యోగనిద్ర నున్నవాడు. తన భక్తుల నేదుండగు లెప్పుడు ఇడుమలకు గురిసేతురో అని గమనించుచునే యున్నవాడు. ఆతని నిద్ర మననిద్ర వంటి తామసనిద్ర గాదు. ఆతని దృష్టికి సర్వావస్థలందు సర్వవిషయములును విదితములే. కావుననే హా కృష్ణా! "పాహి యాదవనందనా!" అని ఆర్తితో ఆర్తులాక్రందించి నను; "నీవే తప్ప నితఃపరంబెరుగ రక్షింపంగదే దీనునిన్" అని విపన్ను లాక్రోశించినను రక్షణకు హుటాహుటి బయలుదేరుచుండుట, ఆతని యలవాటు. అనన్యగతికులై అర్థించిన అనుక్షణమే భార్యకుగూడ చెప్పు విలంబము సైపక దీనులగావ నవతరించినవాడు.

"తన వెంచేయు పథంబు పేర్కొన
దనాథ స్త్రీ జనాలాపముల్
వినెనో, ముచ్చులు ముచ్చిలించిరొ
ఖలుల్ వేదప్రపంచంబులన్,
దనుజాధీశులు దేవతానగరిపై
దండెత్తిరో, సాదులన్
గని చక్రాయుధుఁడేడి ? చూపుఁడని
ధిక్కారించిరో దుర్జనుల్.

(పోతన)

అన్నవిధమున, ఆర్తత్రాణ పరాయణుడగు శ్రీమన్నారాయణుడు దేవకీ వసుదేవులకు పూర్వజన్మ తపఃఫలముగా నవతరించినవాడు.

శ్రీ మన్నారాయణుడే కృష్ణుడుగా నవతరించినవా డనుటకు కృష్ణ ద్వైపాయనుని వర్ణనమే నిర్ణాయకము.

" తమద్భుతం బాలకమంబుజేక్షణం
చతుర్భుజం శంఖగదాద్యుధాయుధమ్,
శ్రీవత్సలక్ష్మం గళశోభి కౌస్తుభం
పీతాంబరం సాంద్రపయోదసౌభగమ్,
మహార్హ వైదూర్య కిరీటకుండల-
త్విషా పరిష్వక్త సహస్రకుంతలమ్,
ఉద్దామ కాంచ్యంగద కంకణాదిభిః
విరోచమానం వసుదేవ ఐక్షత.

(శ్రీమద్భాగవతం)

ప్రాకృతమానవులు తల్లి కడుపునుండి బొడ్డుతాడితో పుట్టుచుండ, ఈతడు నాల్గు చేతులయందు శంఖచక్రగదశార్ఙాయుధములతో, రొమ్మున శ్రీవత్సచిహ్నముతో, కంఠమున కౌస్తుభముతో, చెవుల మకరకుండ లములతో, చేతుల బంగారు కడియములతో, శిరమున కిరీటముతో నవతరించినాడట. అట్టి బాలకుని వసుదేవుడు చూచెనట. కావుననే యత డద్భుత బాలకుడు.

అంతియగాక అతడు బాలుడేగాక, బాలకుడు. ఇచ్చట 'క' ప్రత్య యము అల్పార్థమున వచ్చి బాలకుడై చిన్నిపిల్లవాడని యర్థమిచ్చును. అందులో విశేషము లేదు. మరేమన అతడు బాల-బాలుడైన, కః-బ్రహ్మగలవాడు అనగా బ్రహ్మకు తండ్రియైనవాడు.

శ్రీవత్సమను మచ్చగలుగుటచేతనేగాదు అతడు శ్రీవత్సలక్ష్ముడు, మరేమన, శ్రీ-లక్ష్మియందు, వత్సలా-వాత్సల్యముగల, క్ష్మా-భూదేవి గలవాడూ. కాన శ్రీవత్సలక్ష్ముడు.

ఆతనికి శ్రీదేవి భూదేవి అని ఇద్దరు భార్యలు "హ్రీశ్చ తే లక్ష్మీశ్చ పత్న్యౌ" అని పురుషసూక్తము.

సాధారణముగ సవతులకు మాత్సర్యము సహజము. కాని ఇతని విషయమున నట్లు గాదు. పెద్దభార్య భూదేవికి, చిన్నభార్యయగు లక్ష్మియెడ వాత్సల్యమట. ఆమెకు వాత్సల్యమున్న నీమెకు ఆమెయెడ నాదరముండితీరును. ఇట్లు పరస్పరానురక్తభార్యలుగల వాఁడీ బాలుడు. కావుననే అద్భుతబాలకుడు.

పరిత్రాణాయ సాధూనాం
వినాశాయ చ దుష్కృతామ్,
ధర్మసంస్థాపనార్థాయ
సంభవామి యుగే యుగే. (గీత)

అన్నట్లు అవతరించినవాడు. సృష్టిలయములను బ్రహ్మ రుద్రుల కొప్ప జెప్పి రక్షణభారమును తానే వహించినవాడు.

అందువల్లనే పుట్టినదాది దుష్టశిక్షణకు పూనినాడు. అతడు తొలుత చేసినపని, "పేయ్ములైనళ్ళుఙ్గు" రక్కసి చనువిషమును భుజించిన వాడు. రక్కసి చను విషమైనను గోపిక వెన్నముద్దయినను ఆతనికి సమానమే.

"కిం కాలకూటః కిము వా యశోదా-
స్తన్యం తవ స్వాదు వద ప్రభో మే"
(తిక్కన భారతము)

"కాలకూటమా; యశోద చనుబాలా నీకు ప్రియము" అన్న ప్రశ్న, హరిహరాద్వైతము లేకున్నను నందనందనుని యెడ సన్వితమగుచున్నది.

"రక్కసి మగువ చిఱుతకొమరుని దిగిచి తొడల నిడికొని, యొడలు నివురుచు, ఎడనెడ మమతఁ గదలుకొలుపుచు" "ఆకొన్న చిన్నియన్న! చమ్మ గుడువు" మని చన్నిచ్చు సమయంబున;

మేల్కొన్న తెఱఁగున మెల్లన కనువిచ్చి
క్రేఁగంటఁ జూచుచు కిదికి నీల్గి
యావులించుచు చేతులాదరంబునఁ జాఁచి
యొదిఁగిలి యాఁకొన్న యోజ నూఁది
బిగి చన్నుఁగవఁ గేలఁ బీడించి కబళించి
గ్రుక్క గ్రుక్కకు గుటుగుటుకు మనుచు
నొక రెండు గ్రుక్కల నువిద ప్రాణంబులు
సయితము మేనిలో సత్త్వ మెల్లఁ

ద్రావెఁ నదియును గుండెలు తల్లడిల్లఁ
జిమ్మఁదిరుగుచు నిలువక శిరము వ్రాల,
నితర బాలుర క్రియవాఁడ వీవు గావు ।
చన్నువిడువుము విడువుము చాలు ననుచు.

నిబ్బరపు దప్పి మంటలు
ప్రబ్బిన ధృతిలేక నేత్రపద హస్తంబుల్
గొబ్బున విప్పృతములుగ నా
గుబ్బగుచున్నట్టి కూఁతఁగూలెఁ నేలన్.

(పోతన)

అట్లు ఆ పూతన విషకలిత స్తన్యము నామె ప్రాణానిలములతో పీల్చి వైచినాడు.

"పీత్వా విషాక్తమమరాధి కురంగనేత్రా
స్తన్యం సజీవ పవమాన మమారయద్యః,
భక్త్యైస్వమం పరమధామ నినాయ తాం తం
గోపాలబాలకముకుంద మహం నమామి."

(నా ముకుందవిలాసము)

అట్లు ప్రాణాలు హరించినా ఆ జీవికి మోక్షమిచ్చినాడట.

అటులనే, "కళ్ళుచ్చగడం కలక్కశియక్కాలోచ్చి"

శకటాసురుని సంధిబంధములు విరిచి మగ్గునూచము చేసినాడు. ఇత్యాది హరిచరితములు కీర్తించు మునులు మెల్లగా లేచుచున్నారు.

గర్భమున భగవంతుని ధరించిన దేవకి మెల్లగా లేచినట్లు అంతర్యామికి నొప్పి గల్గునేమో యని వీరును "విత్తినై ఉళ్ళత్తు క్కొండు" జగములకు మూలబీజమగు పరమాత్మను ధరించినందున మెల్లగా లేచినారట.

"అహం కృత్స్నస్య జగతః ప్రభవః ప్రళయ స్తథా
మత్తః పరతరం నాన్యత్కించి దస్తి ధనంజయ,
మయి సర్వ మిదం ప్రోతం సూత్రే మణిగణా ఇవ."

అని సర్వమునకు మూలకారణము, ఆధారము ఐనవాడు. వానిని కీర్తించు చున్నారు. ఆ ధ్వనియైనను చెవిని బడలేదా? పిల్లా! అని;

"ఉళ్ళం పుగున్దు కుళిర్న్దు" మా మనముల జొచ్చినది. మా మది చల్లనైనది.

ఎండకు మంటకు తపించు వానికి నీడపట్టులు శీతవాత పానీయములూ శాంతి చేకూర్చును. ఆధ్యాత్మి కాధిభౌతికాధిదైవిక తాపత్రయ పీడితులకు వానిచే తాప మారునా?

"తాపత్రయాభీల దావాగ్ను లాఱునే హరిమనీషామృత వృష్టిలేక" అన్నట్లు హృదయతాప మడప హరికీర్తన శ్రవణములే సమర్థములు. కావున, మునులు యోగులు గావించు హరిచరితామృతపానము శ్రవణము తాపత్రయాపహము. అది తలుపులు మూసికొని పడుకొన్న నీ చెవి కెక్కునా? ఇప్పటికైనా లెమ్ము.

దీనిచే వేకువనే లేవవలయును. నిద్రలేచుచునే హరికీర్తనసేయ వలయునని సూచితము.

అనువాదము:-

పక్షులు కూసెను! 'పక్షిరాట్పత్ర మం
దిర శంఖనాదమ్ము చొరదె చెవుల?
మెల్లగాలేచి మునితల్లజుల్ యోగులు
క్షీరాబ్ధిశాయిని శేషతల్ప

లోకనిర్మాతను లోకసంరక్షకు
    కపటకాంతాస్తనగరళ హారు
శకటాసురధ్వంసి చరణవిక్రము ఖగో
    నిలయుని కీర్తించు నినదమిదిగో

హరి హరి హరియంచు నాకాంతరాళమ్ము
లలమి మామకాంతరంగములను
పల్లవింపజేసె పిల్లరో! ఘనమైన
నిదురలేచి రావె నీలవేణి!

1. పక్షిరాజు పత్రి-వాహనముగా కలవాడు విష్ణువు.

## 7 వ పాశురము

అవతారిక:-

మరొక కన్యను నిద్రలేపుచున్నారు.

పాశురము:-

కీశు కీశెన్ఱెఙ్గుమానై చ్చాత్త కలన్దు
పేశిన పేచ్చరవమ్ కేట్టిలైయో! పేయ్ప్పెణ్ణే!
కాశుమ్ పిఱప్పుమ్ కలగలప్పక్కై పేర్త్తు
వాశ నఱుఙ్గుళల్ ఆయిచ్చియర్ మత్తినాల్
ఓశై పడుత్త తయిరరవమ్ కేట్టిలైయో
నాయకప్పెణ్పిళ్ళాయ్! నారాయణన్ మూర్త్తి
కేశవనైప్పాడవుమ్ నీ కేట్టే కిడత్తియో
తేశ ముడైయాయ్! తిఱ వేలో రెమ్బావాయ్.

అర్థములు:- పేయ్ పెణ్ణే-పిచ్చిపిల్లా! ఎఙ్గుమ్-ఎల్లెడలను, ఆనై చ్చాత్తన్-భరద్వాజ పక్షులు, కలన్దు-కలిసి. కీశు కీశు+ఎన్ఱు-కీచుకీచు మని, పేశిన-పలికిన, పేచ్చు+అరవమ్=పలుకు ధ్వని, కేట్టిలైయో=విన లేదా! వాశమ్+నఱుమ్-భావముంచే పరిమళము, కుళల్-కురులుగల

ఆయిచ్చియర్=గొల్లెతలు. కాశుమ్+పిరప్పుమ్-(దండలోని) కాసులు, తాళియు, కలకలప్ప-గలగలమన, కై=చేయి, పేర్తు-కదలించి, మత్తి వాల్-కవ్వముతో, ఓశై+పడుత్త-మ్రోయించిన, తయిర్+అరవమ్-పెరుగుశబ్దము, కేట్టిలై యో-వినలేదా? నాయక+పేణ్+పిళ్ళాయ్-నాయకురాలైనదానా! నారాయణన్మూర్తి+కేశవనై=నారాయణమూర్తియైన, కేశవుని; పాడవుమ్-పాటలను, నీ-నీవు, కేట్టే-వినియే, కిడత్తియో-నిద్రింతువా? తేశం-తేజముమ, ఉడై యాయ్-ఒదవిన దానా? తిఱ=(తలుపు) తెరువుము.

తాత్పర్యము:— మాటకారియు, తేజస్వినియుఅగుట గుంపునకు కన్నాకైన దానిని లేపుచున్నారు. ఓ దానా! మా కెల్లరకు నాయకురాలివై యుండియు మమ్ములను మున్ను నిద్రలేపెదనని, త్వరగా లేవవలెనని వలికి నీవే ఇంకనూ లేవకున్నావే.

> యద్యదాచరతి శ్రేష్ఠస్తత్త దేవేతరో జనః,
> స యత్ప్రమాణం కురుతే లోక స్తదనువర్తతే. (గీత)

అన్నట్లు నీవే లేవకున్న నితరులు లేతురా! ఇంకనూ తెల్లవారలేదని బూకరింతువేమో! భారద్వాజపక్షులు ఎరకై బయలుదేరుచు, కిచకిచమని రొదసేయుచున్నవే. అది నీ చెవికెక్కలేదా? తలుపులు మూసికొని ఇంటి లోన పరున్నదానికి బయట కలకలము వినిపించకపోవచ్చును. ముదు సలి గొల్లెతలు ప్రౌఢాంగనలు గృహకృత్య పరాయణలు అప్పుడే లేచి ధౌతముఖులై పెరుగు ద్రచ్చుచున్నారు. కన్నుమూసికొని పడుకొన్న నీకు కనిపించకున్నను, ఇంటివారు చేతులుజాచి చిలుకునప్పుడు వారి మెడలోని కాసులు, తాళిబొట్టు ఒండొంటికి రాచుకొని చేయు కలకలనినాదము కవ్వపు చిఱ్ఱుబుఱ్ఱుసవ్వడి చెవిని బడలేదా? నీకు చెవులకునూ మూత లున్నవా?

త్రచ్చువమయమున కుడియెడమలకు కదలుట చేత, రేయి కైసేసిన కబరీభరములు సడలి పూల ధూపముల పరిమళములు ఇల్లంతయు నిండి బయటికి ప్రసరించుచున్నవే, ఆ వాసనలైన నీ ముక్కున కెక్క లేదా?

అంతియగాక వారు చిలుకుచూ, నారాయణావతారుడైన కేశి మొదలగు రక్కసులను దునుమాడిన నందనందనుని గూర్చి పాడు మేలు కొలుపులైనను వినిపించలేదా? ఇప్పటి కైనను లెమ్ము. లేచి మాకెల్లరకు మార్గదర్శకురాలివై నీ తేజశ్శాలితను నిరూపించుకొనుము. తలుపు తెరువుము.

దీనిచే సూర్యోదయాత్పూర్వమే నిద్రలేచి కాలుచేతులు కడిగికొని గృహకృత్యములకు పూనుకొనవలయును. చేయు విహితకృత్యము లన్నియు భగవదారాధనములే అను దృష్టితో భగవంతుని నోటకీర్తించుచు చేతులతో కార్యముల నిర్వర్తించవలయును.

భగవంతుని కీర్తించుటచే వాక్పారిశుద్ధ్యము, ధ్యానానుసంధానముచే మనోనైర్మల్యము నేర్పడును. భగవదావాసమగు మనస్సునందు, కామ క్రోధాది అరిషడ్వర్గములకు తావుండదు అని తెలియవలయును.

అనువాదము:—

నాయకురాలివై నాయమా నిదురింత
వేగెడిదాకను పిచ్చిపిల్ల
కీచుకీచు మటంచు నేచు నేత్రింతల
వలుకు లెల్లెడ బర్వె కలికి వినవె
కరకంకణమ్ములు కంఠెకాసులు తాళి
కలసి మ్రోయఁగ గొల్లనెలత లెల్ల
వలచు కొప్పులుగదల వాలుఁగంటీ; కేలు
కదలించి కవ్వానఁ గడవఁ బెరుగు

చిట్టుబుట్టు మటంచును చిలుకు చప్పు
డైన వినలేదో ? వెలఁది! నారాయణావ
తారు కేశవు కీర్తన ధ్వనుల నేని ?
తలుపు తీయవె ఇకనేని తలిరుఁబోఁడి!

## 8 వ పాశురము

అవతారిక:— వేరొక్క చెలిని మేల్కొల్పుట.

కీళ్‌వానమ్ వెళ్ళెన్ఱు ఎరుమై శిఱువీడు
మేయ్‌వాన్ పరన్దనకాణ్ మిక్కుళ్ళ పిళ్ళైగళుమ్
పోవాన్ పోగిన్ఱారై ప్పోగామల్ కాత్తున్నై
కూవువాన్ వన్దు నిన్ఱోమ్ కోదుకలముడైయ
పావాయ్! ఎళున్దిరాయ్ పాడిప్పఱై కొణ్డు
మావాయ్! పిళన్దానై మల్లరై మాట్టియ
దేవాది దేవనై చ్చెన్ఱునామ్ శేవిత్తాల్
ఆవావెన్ఱారాయ్‌న్దరుళేలో రెమ్బావాయ్.

అర్థము:— కోదుకలముడైయ=కౌతూహలముగల, పావాయ్=పావా! కీళ్+వానమ్=తూరుపు ఆకాశము, వెళ్ళెన్ఱు=తెల్లవారినది, ఎరుమై=ఎనుములు, శిఱు=దొడ్డి, వీడు=విడచి, మేయ్‌వాన్=మేయుటకు, పరన్దన=బయలుదేరినవి, కాణ్=కనుము, పోవాన్+పోగిన్ఱారై=పోబోవుచున్న, మిక్కుళ్ళ+పిళ్ళైగళుమ్=మిగిలిన పిల్లలను. పోగామల్=పోకుండునట్లు, కాత్తు=కాచి, ఉన్నై=నిన్ను, కూవువాన్=పిలుచువారై, వన్దు+నిన్ఱోమ్=వచ్చి నిలిచితిమి. ఎళున్దిరాయ్=లెమ్ము, పాడి=కీర్తించి, పఱై=దక్కిని (కోరికను). కొణ్డు=కైకొని, మావాయ్=మావును (అశ్వాసురుని), పిళన్దానై=చీల్చిన, మల్లరై=మల్లురను, మాట్టియ=మట్టు పెట్టిన, దేవాది+దేవనై=దేవాదిదేవుని, నామ్=మనము, శెన్ఱు=చేరి, శేవిత్తాల్=సేవించిన, ఆరాయ్‌న్దు=అరసి, ఆవా వెన్ఱు='ఆహా' అని, అరుళ్=అనుగ్రహించును.

తాత్పర్యము:— తూరుపు దిక్కు చీకటి తెరతొలగి ఆకాశము తెల్లవారినది. ఐనను నీవు లేవక నిద్రించు చున్నావే! 'బుద్ధిలేనివి' అని పేరుగన్న పసువుగొడ్డులు, దొడ్డివిడిచి మేతకు బయలుదేరినవి. మన తోటి కన్నెలు అప్పుడే వ్రతస్నానమునకు బయలుదేరినారు. వారి నాపి

నిన్నులేప వచ్చితిమి. మీ ముంగిట నిలిచి ఎంత సేపాయె. పిలిచి పిలిచి చాలైనది. ఇంకనూ లేవకున్నావు. కాలము వృథా అగుచున్నది. చేత దక్కిబూని ధర్మోద్ధరణ కవతరించి, అశ్వాసురుని మల్లురను హత మార్చిన దేవాదిదేవుని నోరార పాడి సేవించిన మనల నాత డనుగ్రహించును. వేగ రమ్ము అని హెచ్చరించుచున్నారు.

వివరణ:— మానవులు ఇతరప్రాణులకంటె జ్ఞానాధికులు. మానవ జన్మమెత్తినందుకు పురుషార్థముల సాధించవలయును. వానిలో ధర్మార్థ కామములు త్రివర్గములు. బుభుక్షువులకు విషయములు.

విబుధులు నాల్గవ మోక్ష పురుషార్థమును సాధించుటకు పూని మానవజన్మ సార్థకమొనర్చు కొందురు. మానవులకు విధినిషేధములు వేదముఖమున ఎరుక సేయబడినవి.

త్రైగుణ్యవిషయా వేదా నిస్త్రైగుణ్యో భవార్జున।
"నిర్ద్వన్ద్వో నిత్యసత్త్వస్థో నిర్యోగ క్షేమ ఆత్మవాన్."

త్రైగుణ్య పదము సత్త్వ రజస్తమస్సులను త్రిగుణములుగల మానవులను దెల్పుచున్నది. వేదములు వారికై యేర్పడినవి.

యావానర్థ ఉదపానే సర్వతస్సంప్లుతోదకే,
తావాన్ సర్వేషు వేదేషు బ్రాహ్మణస్య విజానతః.

జలాశయములోని నీరు స్నానపానములకు గొడ్డుగోదలకు పైరు పచ్చలకు పనకాత్మహత్యలకును ఉపయోగపడవచ్చును. కాని దప్పిగొన్న వాని కెంత యవసరమో అంతియే వా డుపయోగించుకొనును.

అటులనే వేదబోధిత విషయము లనేకములున్నను ముముక్షువునకు మోక్షసంబంధి అర్థములే అవసరములు. ఇతరములు త్యాజ్యములు.

ఎనుపగొడ్డు తెలివిమాలినది. మానవత దాల్చినను మూఢులైన వారు నట్టివారే. వారు సంసారకూపమున దూసుకపోయి బుభుక్షువులై తెల్లవారినది మొదలు తిండికై దేవులాడుదురు.

"ఎరుమై శిరువీడు వరందనకాణ్" తిండిపోతులు కూటికై వెతల బడుచుండ, ఇతరులు సంసారబంధమునుండి విడివడుటకు భగవత్సేవకై బయలుదేరుచున్నారు.

విష్ణుభక్తి లేని విబుధుండు విబుధుఁడే ?
పాదయుగముతోడి పశువుగాక.

భగవచ్చింతనాపరులగు మనుజులే విబుధులు (దేవతలు). ఇతరులెంత పండితులైనను ద్విపాత్పశువులు. రెండుకాళ్ళ ఎనుములే.

భగవత్సేవకై బయలుదేరినవారిని ఆపి, పరమామృతము కలిపి భుజింపవలయునని, నిన్ను పిలుచుకొని పోవచ్చితిమి.

"పోవాన్ పోగిన్దారై ప్పోగామల్
కాత్తున్నై కూవువాన్ వన్దు నిన్ఱోమ్"

"అనేకజన్మ సాహస్ర తపోధ్యాన సమాధిభిః,
జనానాం క్షీణపాపానాం కృష్ణే భక్తిః ప్రజాయతే."

కృష్ణునిపై భక్తి గల్గుట ఎన్ని జన్మల సుకృతపరిపాకము వల్లనో!

'లోకాధ్యక్షం స్తువన్నిత్యం సర్వదుఃఖాతిగో భవేత్'

"సంకీర్త్య నారాయణశబ్దమాత్రం
విముక్తదుఃఖాః సుఖినో భవన్తి."

"నామస్మరణా దన్యోపాయం నహి పశ్యామో భవతరణే"

ఇత్యాదులచేత భగవత్కీర్తనము సర్వదుఃఖహరము సుఖసంధాయకము. భవతారకము.

ధ్యాయన్ కృతే, యజన్ యజ్ఞైః త్రేతాయాం, ద్వాపరేఽ ర్చయన్
యదాప్నోతి తదాప్నోతి కలౌ సంకీర్త్య కేశవమ్.
(విష్ణుపురాణము)

కలిలో నామకీర్తనము శ్రవణము మోక్షదము. కావున–

మావాయ్ పేశన్దానై, మల్లరై మాట్టియ
దేవాదిదేవనై శెప్పిత్తాల్

కేశి యను రాక్షసుడు మావురూపుదాల్చి మంద జొచ్చి విప్లవ మాచరించు చుండ-

భీషణ ఘోటక దానవ
హేషానిర్ఘోషభిన్నహృదయ నిఖిల గో
యోషా పురుషార్భకమై
ఘోషము హరిసూడ దైన్యఘోషం బయ్యెన్.

ఇట్లు బీభత్సమాచరించువానిని ధనుశ్శతమాత్రంబు విసరివైచియు తిరిగివచ్చినవాని నోట తన బాహువుమంచి కడుపులోనికిజొనిపి, పెంచిన,

వాయువు వెడలక నిలచినఁ
గాయంబుసెమర్పఁ గన్నుఁగవ వెలికుబుకన్
మాయసెడి తన్నుకొనుచును
కూయుచునశ్వాసురుండు గూలెన్నేలన్.

ఘోటకాసురేంద్రు కుక్షిలోఁగృష్ణుని
బాహువధికమైనఁ బట్టలేమి
వగిలి దోసవండు వగిది తద్దేహంబు
వసుమతీశ! రెండు వ్రక్కలయ్యె.

ఇట్లు కేశినిషూదనుండై, మల్లుర సంహరించినవాడు కృష్ణుడు.

కంసుడు గోపావతారుల రామకృష్ణుల మట్టుబెట్టుటకు ప్రేరేపింప చాణూరుండను మల్లుడు

"హరికిని లోఁబడి వెగడక
హరియురము మహోగ్ర ముష్టి నహితుఁడు వొడువన్,
హరి కుసుమ మాలికాహత
కరిభంగి వరాక్రమించె కలహోద్ధతుఁడై."

శౌరి నెఱిఁజొచ్చి కరములు
గ్రూరగతిఁ బట్టి త్రిప్పి కుంభిని వైచెన్
శూరున్ గలహగభీరున్
వీరుం జాణూరు ఘోరు వితతాకారున్.

శోణితము నోర నొలుకఁగఁ
జాణూరుండట్లు కృష్ణసంగ్రామణ సం
క్షీణుండై క్షోణింబడి
ప్రాణంబులువిడిచెఁ గంసు ప్రాణము గలఁగన్.

అంత నద్దముజాంతకుండు చరణప్రహరణంబుల భిన్నమస్తకులం జేసి వాని చెలులం గూటతోసలకలుం నంతకాంతికంబున కనిచిన-

(పోతన)

ఇట్లు సాధు పరిత్రాణంబునకు దుష్కృత వినాశనంబున కవతరించిన దేవాధిదేవు సేవించిన-

"ఆవావెన్గారాయ్ న్దరుళ్" మన మొరలాలించి ఆదరముతో ననుగ్రహించును. ఆతని కృపకు పాత్రుల మైతిమేని ఐహికసుఖములను వాంఛింపని మనం నతడు తన పదంబున జేర్చును.

అదియు ననన్యభక్తితో, అనన్యశేషత్వ, అనన్యభోగ్యత్వ, అనన్యార్హత్వరూప ఆకారత్రయ సంపన్నులై, భగవచ్చరణ శరణాగతులైన వారికి-

"అనన్యాశ్చిన్తయన్తో మాం యే జనాః పర్యుపాసతే,
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్."

అన్నట్లు యోగక్షేమముల నరసి రక్షించును. అట్టివాని గీర్తింపవలయును. రక్షణ యన్న ఐహికభోగములు మాత్రము గాదు. వాని నితరులు నివ్వగలరు. మోక్షమే పరమపురుషార్థము దానిని ఇతరు లివ్వజాలరు.

ఇత్తురుగాక నిర్జర సురేశ గిరీశ సరస్వతీశులఞా
దత్తదిఁ బత్తదిఞా సుతుల దారల భూముల వాహ
గేహ సం
పత్తుల; దానపాటవము వారల కెవ్వనివల్ల కల్గె
లోకోత్తరు గొల్తు నా హరి ననుత్తమ ముక్తిదు మా
మనోహరుఞా.
(నా శాంతివిలాసము)

నిరవధి సౌఖ్యదాయక మనిందిత మవ్యయమైన మోక్షమే
నరునకు రక్షణమ్మన, జనార్దను వీడి మరొక్క దైవ మే
కరణి నొసంగ నోపును? జగజ్జననాదుల కర్తయైన యా
పరుడు నిరంజనుండు నిరుపాధికబంధువు జీవకోటికిఞా.
(నా యతిరాజీయము)

అట్టి యాతని సేవించిన లేనిది, కావలసినదియగు మోక్షముతో యోగమును కూర్చగలడు. ఆర్తులై యాతని ప్రపత్తి చేసిన,

"అగ్నిర్జ్యోతి రహశ్శుక్ల షణ్మాసా ఉత్తరాయణమ్"

అను క్రమమైన సంసారముక్తులు పయనించు నర్చిరాది మార్గమును వదలి హుటాహుటి గరుడ స్కంధాధిరూఢుని గావించుకొని పరంధామమునకు తోడ్కొనిపోవును. కావుననో "కోదుకలముడైయ పావాయ్" భగవత్సేవాకుతూహలి యయ్యును నిద్రలేవకయున్న పిచ్చిపిల్లా! "ఎళున్దిరాయ్" ఇప్పటికైనా లెమ్ము. తోడివారందరు వెడలిపోక మునుపే వారితో కలిసి భగవత్సేవకు పూనుకొందము.

అనువాదము:—

తెల్లవారెను తూర్పుదెస నింగి, యెనుములు
వెలికి బోయెను మేయ వెరడు వీడి:
పోఁబోవు పిల్లలఁబోనీక నిలిపి నిఞా
బిలువ వచ్చితి మేము పెంకిపిల్ల!

నీ యింటి ముంగిట నిలిచియున్నా మోసి
లెమ్ము వే రమ్ము గానమ్ము సేయ.
మాపురూపుని సోకు మర్దించి మల్లుర
హతమార్చి నట్టి దేవాదిదేవు
చేత దక్కబూని చిత్తము తత్పాద
యుగలమందుఁ జేర్చి నిగమగమ్యు
హరి నుతింప మనల నాదరించును దయా
రస తరంగితాంతరంగమునను.

## 9 వ పాశురము

అవతారిక:— సంవత్సరాలైన యొకకన్యను లేపుచున్నారు.

తూమణి మాడత్తుచ్చుత్తుమ్ విళక్కెరియ
తూపమ్ కమళ త్తుయిలణై మేల్ కణ్ వళరుమ్
మామాన్ మగళే! మణిక్కదవమ్ తాళ్ తిఱవాయ్
మామీర్! అవళై యెళుప్పీరో! ఉన్ మగళ్దాన్
ఊమైయో? అన్ఱిచ్చెవిడో? అనన్దలో
ఏమప్పెరున్దుయిల్ మన్దిరప్పట్టాళో?
మామాయన్ మాదవన్ వైకున్దన్ ఎన్ఱెన్ఱు
నామమ్ పలవుమ్ నవిన్ఱేలో రెమ్బావాయ్.

అర్థము:—తూ+మణి మడత్తు—పవిత్రములైన, మణుల, మేడ యొక్క, చుట్టుమ్—చుట్టూ, విళక్కు—దీపము, ఎరియ—వెలుగగా, తుయిల్+అణై+మేల్—తూగు మంచము మీద: కణ్—కన్ను, వళరుమ్—మూసిన, మామాన్+మగళే—మామకూతురా! మణి+కదవమ్+తాళ్—మణుల, తలుపుల, తాళము, తిఱవాయ్—తెరువుము, మామీర్—అత్తా! అవళై—ఆమెను, ఎళుప్పీరో!—లేపెదవా! ఉన్+మగళ్+తాన్—మీ కూతురేగదా! పెరుమ్+తుయిల్—గాఢ నిద్ర యందు,

ఏనుమ్+పట్టాళో-కావలి యుంచబడినదా? మన్దిరప్పుట్టాళో-మంత్రించ బడినదా? మా+మాయఙా-మహామాయలమారియైన, మాదవఙా-మాధవుడు, వైకున్దఙా-వైకుంఠుడు, ఎన్రెన్ను-అని యని, పలవుమ్-పలు, నామమ్-నామములు, నవిన్ఱు-నుతించితిమి.

తాత్పర్యము:—మామకూతురా? ఎంత ఎమ్మెలాడివే? స్నానమునకు వత్తునని చెప్పి, వేగినను లేవకున్నావు? నీకు మెలకువ అగునా? నిర్మల మాణిక్య సౌధమున, మాణిక్య దీపకాంతులు, వింతవింత రంగులీనుచుండ ఘ్రాణ తృప్తిగా కమ్మని ధూపములు ప్రసరించుచుండ, మెత్తని హంసతూలికాతల్పముపై పవ్వళించిన నీకు మెలకువ యెట్లు వచ్చునే? మేమందరము వచ్చి నీ యింటి ముందు నిలిచి పిలుచుచున్నాము. ఇప్పటికేని లెమ్ము. మణివాకిలి తల్పుతీయుము. అని పిలిచియు లేవకున్న అత్తను లేపుమనుచున్నారు. అత్తా, ఆమెను లేపవమ్మా! మేము లేపినా లేవదు. ఆమె మూగయా? మాటాడదు. చెవిటియా? మా పిలుపు, చెవినిబడుటలేదా! నీ బిడ్డయే గదా! బాగ పెంచితివమ్మా! నీ గుణాలే అలవడినవి. నిజముగ గాఢ నిద్రయందున్నదా? లేక యెవ్వరూ లేవకూడదని కావలి పెట్టితివా? లేక మంత్రించినావా? మేము మాయామానుషరూపుని రమాపతిని వైకుంఠుని నామకీర్తనము చేయుచున్ననూ, ఆ గాననాదమునకన్న నిద్ర లేవకున్నది.

వివరణము:—

సంపదలు భగవంతుని దూరము చేయును. సుఖభోగములకు భగవచ్చింతనకు పొందిక కుదురదు. అందుకనే-

"విపదస్సన్తు వశ్శశ్వద్యాసు సంకీర్త్యతే హరిః."

అని యొక భక్తుడు ఆపదలనే కోరుకొనుచున్నాడు.

"ఆర్తో జిజ్ఞాసు రర్థార్థీ జ్ఞానీ చ భరతర్షభ,
చతుర్విధా భజన్తే మాం జనాస్సుకృతినోఽర్జున!" (గీత)

ఆర్తునకు భగవంతునిపై దృష్టిపారును. కాని, ఆపదలో దగుల్కొని దానిని తొలగించమని ప్రార్థించుట కంటె—

"యద్యద్భవ్యం భవతు భగవన్ పూర్వకర్మానురూపమ్"

అని, సిరులో, ఇడుములో, పూర్వజన్మ కర్మానుసారము వచ్చేవిరానీ యని, సమదుఃఖసుఖుడుగా నుండు జ్ఞానియై-మోక్షేచ్ఛగలవాడై భగవంతుని సేవించుటయే తన పని యని యుండుటుత్తమము. అతినిద్ర తామసలక్షణము.

"తమస్త్వజ్ఞానజం విద్ధి మోహనం సర్వదేహినామ్,
ప్రమాదాలస్య నిద్రాభి స్తన్నిబధ్నాతి భారత."

వస్తుతత్త్వావబోధము జ్ఞానం. తద్భిన్నమజ్ఞానము. దానివల్ల తమస్సు, దానివలన ప్రమాదాలస్య నిద్రలు గల్గుచున్నవి. అవి నానావర్థ కారకములు. వాని నణచి సత్త్వమును పెంపొందించుకొనవలయును.

"చుత్రుం విళక్కేరియ" చుట్టునూ దీపములు వెలుగుచున్నవి. అవి బైటి చీకటిని పోగొట్టగలవు. కాని అంతరమైన అజ్ఞానమును పోకార్ప జాలవు. బైటి సువాసనలు హంసతూలికా తల్పములు ఇంద్రియములను తమవైపునకు లాగికొని భగవానునకు దూరమొనర్చుచున్నవి.

జ్ఞానులు ఐహిక భోగములకు దేవులాడక భగవత్ప్రీతికై అటమటింతురు. అందుకే కలియుగమున నామకీర్తనమే మంచి యుపాయము. "నామస్మరణా దన్యోపాయం నహి పశ్యామో భవతరణే." కావున లక్ష్మీపతియై వైకుంఠవాసియైన భగవంతుని కీర్తింపవలయును. అతడు మహామాయలాడు.

ఈ ప్రకృతి యంతయు అతని మాయ. అది జీవులను ముప్పుతిప్పలు బెట్టును. దానిని దాటవలయునన్న ఆ భగవంతుని అనుగ్రహమే గావలయును. అతని శరణుజొచ్చిన యాతని యనుగ్రహమునకు పాత్రులము గాగలము.

"దైవీహ్యేషా గుణమయీ మమ మాయా దురత్యయా,
మామేవ యే ప్రపద్యంతే మాయామేతాం తరంతి తే."

ఈ ప్రకృతియే మాయ. అది ఆతని అపరా ప్రకృతి. దాని ప్రబోధమునకు చిక్కి భౌతికశరీరముల బంధింపబడి, విడిపించుకొను శక్తి లేక జీవులు విలవిలలాడుచున్నారు. ఆ భగవానునియెడ ప్రపన్నులైన గాని తరింపలేరు.

కావున నో మామకూతురా! లెమ్ము. మాతోబాటు హరిని సేవింతము రమ్ము.

అనువాదము:—

మాణిక్య భవనాన మణిదీపికలు వెల్గ
  కమ్మని ధూపమ్ము క్రమ్ముకొనఁగ
మెత్తనిపాన్పుపై మెయిసేర్చి, కన్నుమూ
  సిన మామ కూఁతురా! చిన్నెలాఁడి!
వచ్చి తీయవే మణి వాకిలి తలుపుల
  గడియ; నీ యిల్లు బంగారుగాను
అత్త! లేవగ రాదె యామెను నీవైన?
  నీ కూఁతురే గదా! నిద్రలోన

మునిగియున్నదె? చెవిటియా? మూఁగ? మంత్ర
ముగ్ధయా? గుప్తయా? మేము మురవిరోధి
మాధవుని విష్ణు వైకుంఠు మాయలాని
పలుదెఱంగులఁ బాడినా పలుకదేల?

## 10 వ పాశురము

అవతారిక:—మరొక నిద్రబోతును మేల్కొల్పు చున్నారు.

పాశురము:—

నోట్రుచ్చువర్కమ్ పుహిగిన్దవమ్మనాయ్!
మాట్రముమ్ తారారో వాశల్ తిఱవాదార్
నాట్రుత్తుళాయ్ ముడి నారాయణన్ నమ్మాల్
పోట్రప్పఱై త్తరుమ్ పుణ్ణియనాల్, పణ్డొరునాళ్,

కూౖటు త్తి ఞా వాయ్ విళన్ద కుమ్భకరుణనుమ్
తోౖటుమునక్కే పెరున్దుయిల్ తాఞాతన్దానో?
అౖత్తి వనన్దలుడై యా యరుఙ్గలమే
తేౖటమాయ్ వన్దు తిరవేలో రెమ్బావాయ్.

అర్థము:— నోౖటు—నోచి, శువర్కమ్—స్వర్గ (సౌఖ్య)ముమ, పుహిగిన్ద—పొందిన, అమ్మనాయ్—తల్లీ, వాశల్—వాకిలి, తిఱవాదార్—తెరువనివారు, మాౖటుమమ్—మాటైనా, తారారో—ఇవ్వరా? నాౖటు—త్తుళాయ్+ముడి—పరిమళించు, తులసి ముడిచిన (ధరించిన) నారాయణా—నారాయణుడు, నమ్మాల్—మనచే, పోౖట—పొగడబడి, పుణ్ణియనాల్—(ఆ) పున్నెముచేత, పఱై—దక్కని (పురుషార్థమును) తఱుమ్—ఇచ్చును.

పణ్డు—పూర్వము, ఒరునాల్—ఒకనాడు, కూౖటు త్తి ఞా—యముని యొక్క, వాయ్+విళన్ద—వాత బడిన. కుమ్భకరుణనుమ్—కుంభకర్ణుడు, తోౖటుమ్—పోటీపడి (ఓడి) ఉనక్కే—నీకే, పెరుమ్+తుయిల్—గాఢ నిద్రమ, తాఞా—తాను, తన్దానో—ఇచ్చెనా? ఆట్రి—అధికమైన, అనన్దల్—నిద్దురను, ఉడై యామ్—పొందినదానా? అరుఙ్గళమే—అలంకారమైన దానా? తేౖటమాయ్—తేరి, వన్దు—వచ్చి; తిఱ—(తలుపు) తెఱువుము.

తాత్పర్యము!—నోములు నోచి, పూర్వసుకృత ఫలముగా దివ్య సౌఖ్యముల మునిగిన పుణ్యాత్మురాలా! తలుపు తీయకున్నమానె, బదులైన పలుకరాదా! మాటాడిన నోట ముత్తెములు రాలునా? తులసీ మాలికాభరణుడు శ్రీమన్నారాయణుడు మనము స్తుతించిన పుణ్యమునకు ఫలముగా ఐహికాముష్మిక సౌఖ్యము లొసంగునుగాని, భజింప కున్న నొసంగునా?

సేవించ వలసిన కాలమున నిద్రించు చున్నావే. ఎంత నిద్ర పోతుతనమే నీది. నిద్రవందెమున కుంభకర్ణుడు గూడ నిన్ను గెలువలేక ఓడి, చచ్చుచూ తన నిద్రనుగూడ నీకు దారవోసి పోయెనా? ఇట్లయిన పుట్టింటికి మెట్టినింటికి మంచికీర్తి తేగలవు సుమా? చాలు చాలింక నిద్ర మత్తు వీడి వచ్చి తలుపు తీయుము.

వివరణము:—

"మేలు చేసెనేని మేలొందు మనుజుండు
కీడుచేసెనేని కీడు గుడుచు
తనదు కర్మఫలము తాఁ బొందవలెఁగాక
దాని నితరుఁ డెవఁడు తలభరించు."

(నా సుధాబిందువులు)

ఇప్పటి సుఖానుభూతి పూర్వపు నోముల ఫలము. ఇప్పుడు మంచి పనులు చేసినగదా, ముందు శుభములు పొందుట, కాన అబ్బిన సౌఖ్యములకు మఱిగి రాబోవు శుభములకు పాటుపడకుండరాదు.

కాని, తత్త్వమరసిన, ఐహిక సుఖములేనా దేహికి శుభములు? అవి నశ్వరములు. వానిని శాశ్వతములని నమ్మియుండరాదు. వచ్చిన మానవజన్మమును శాశ్వతసుఖ సంపాదన కుపయోగించు కోవలెను.

ఆ నిశ్శ్రేయసము కూర్చువాడు "నాట్రుత్తులాయ్ముది నారాయణణా"

ఈ నరసముదాయ మెట్లవ్యయానందమును పొందునా? ఇంద్రియ చాపల్యమునకు లోనుగాక, భగవద్భాగవత కైంకర్యమునకు పూనునా? అని యాతడు యోచించుచుండును.

ఇతర దైవములకు లేని తీపురము జీవులపై అతని కేల? అనినఁ ఆతడు నారాయణుడు అనుటయే కారణము. నరులకు దిక్కైనవాడు గాన నారాయణుడు. ఆత డవ్యాజ బాంధవుడు. అంతియగాక-

"పితా చ రక్షక శ్శేషీ భర్తా జ్ఞేయో రమాపతిః,
స్వామ్యాధారో మమాత్మా చ భోక్తా చాద్యమనూదితః."

అని నరులకు నాతనికి నిట్లు నవవిధ సంబంధములు గలవు. పంచభూతాత్మక శరీరము చైతన్య విశిష్ట జీవమును చేరి దేహులగుచున్నారు.

.... మే భిన్నా ప్రకృతి రష్టధా.
అపరేయ, మిత స్త్వన్యాం ప్రకృతిం విద్ధి మే పరామ్,
జీవభూతాం మహాబాహో యయేదం ధార్యతే జగత్.
ఏ తద్యోనీని భూతాని సర్వాణీత్యవధారయ.

జగ త్తంతయు భగవంతుని పరావర ప్రకృతులచే నేర్పడినది.

"అహం కృత్స్నస్య జగతః ప్రభవః" గీత.

అన్నందున ఈ సమ స్తమునకు తండ్రి నారాయణుడే కాని, వాని వాని తండ్రి అనువాడు జానకి జనకుడుగాడు. అతడు పంచభూతాత్మక శరీర మును సృజింపగలడా? కాన నారాయణుడే తండ్రి.

రక్షకుడు నాతడే. జీవికి జరామరణములనుండి రక్షించి అవ్య యానందమగు మోక్షము నొసగువాడు గదా రక్షకుడు. కాన జనార్దనుని కంటే నురెవ్వరికి సామర్థ్యము గలదు? కాన నాతడే రక్షకుడు.

"మమైవాంశో జీవలోకే జీవభూతస్సనాతనః"

అన్నందున జీవులందరూ అతని యంశలు గాన శేషభూతులు. అతడు సర్వశేషి.

"స్త్రీ ప్రాయ మితరం జగత్" అనుటచే జీవకోటి యంతయు స్త్రీ కల్పము. అతడొక్కడే పురుషుడు భరించువాడు గాన భర్త.

మూలద్రవ్యము తత్త్వ మెరింగిన తజ్జన్యములన్నింటినీ తెలిసి కొన్నట్లగును కాన, తెలియదగినవాడు అన్నిటికి మూలకారణమైన ఆ నారాయణుడే.

జగ త్తంతయు నా పరమాత్మ లీలకై ఏర్పడినది. కావున దీనిని లీలావిభూతి యనిరి.

పశ్యంతీషు శ్రుతిషు పరితః సూరిబృందేన సార్ధం
మధ్యేకృత్య త్రిగుణఫలకం నిర్మితస్థానభేదమ్,
విశ్వాధీశప్రణయినిః సదా విభ్రమద్యూతవృత్తౌ
బ్రహ్మేశాద్యా దధతి యువయోరక్షశారప్రచారమ్.

(వేదాన్త దేశికుల శ్రీస్తుతి)

సరసిజసూతి శంకరుఁడు శక్రుఁడు
మున్నుగ దేవజాతులున్
నరులును నీడజ ప్రభృతి నైక
చరిష్ణువులెల్లఁ గాయమై
వరచిన పట్టమై ప్రకృతి వర్తిల,
సూరులు చూచుచుండగా
హరి, సిరిఁగూడి పాచికల నాడుట
లాడట లోకవృత్తముల్.

(నా యతిరాజీయము)

అట్టి పరాపర ప్రకృతుల కతడు స్వామి. అతని సొత్తు జీవుడు.

జీవుడులేని శరీరము నిలువదు, నడువదు. శరీరమునకు జీవు డాధారము. అట్టి జీవునకు అంతర్యామియైన పరమాత్మ యాధారము.

"యస్యాత్మా శరీరం" అని శ్రుతి. "వాసుదేవాత్మకాన్యాహుః"
క్షేత్రం క్షేత్రజ్ఞ ఏవ చ (భాగవతము)

అన్నందువలన అతడే ఆత్మ.
"భోక్తా చ ప్రభురేవ చ" అని గీత.

ఈ లీలా విభూతియైన జడాజడ ప్రపంచమును సృజించు వా డాతడే గాన నతడే భోక్త.

ఇట్లు నవవిధ సంబంధములు గలవాడు గాన పరుల కయనమైన వాడు. అతనికి తులసి యన్న పరమప్రీతి. ఆ తులసితో నర్పించిన ఆనందించును. అతని కీర్తించిన మన కాంక్షితములు నీడేర్చును. అందుకిది యనువైన కాలము. ఈ సమయమున నిద్రించుట పాడి గాదు. నిద్ర నాశనము. తాము నెంత బలవంతులైనను కడపట భంగపడ వలసిందే. తపించి వరములు పొందిన కుంభకర్ణుడు దేవతలకు గుండె దడ పుట్టించిన వాడైనను కడపట యముని పాలను బడక తప్పినది గాదు. వానిని నిద్రలో గెల్చినట్లున్నావు నీవు. లేచి వచ్చి తలుపు

తీయుటకు మజ్జూశనమైననూ, నోటిమాటైన వాదకూడదా? దానికినీ, ఓపిక లేదా? ఇది సరియైన పద్ధతిగాదు. ఇప్పటికైనావచ్చి తలుపు తీయుము.

అనువాదము:—

పలునోములను నోచి పడసిన స్వర్గ సౌ
  ఖ్యాంబుధి మునిగిన యతివమిన్న!
తెరవకున్నను తల్పు తెరవరో నోరైనం
  దెరచిన ముత్తెము లురలు నేమొ?
నుతియింప నారాయణుని తులసీ ధారి
  అర్థమ్ములిచ్చు పుణ్యమ్ము కొలది
కూలుచు జమువాత కుంభకర్ణుఁడు పందె
  మోడి నిద్దుర నీకు నొసగి చనెనొ?

గొల్ల తలిరుబోండ్ల కెల్ల నలంకార
మైనదాన! తెర తల్పు నేమొ
సుఖము? నిద్ర దేరి శోభనాంగి మఱి
లెమ్ము తలుపుతీయ రమ్ము వేగ.

## 11 వ పాశురము

కట్రుక్కఱవైక్కణజ్ఞళ్ పల కఱన్దు
శెట్రార్ తిఱలళియచ్చెన్ఱుశెరుచ్చెయ్యుమ్
కుట్రమొన్ఱిల్లాదకోవలర్తమ్పొఱ్కొడియే
పుట్రరవల్ గుల్ పునమయిలే పోదరాయ్
శుట్రత్తుతోళిమా రెల్లారుమ్ వన్దు నిన్
ముట్రమ్ పుహున్దు ముగిల్వణ్ణన్ పేర్పాడ
శిట్రాదే పేశాదే శెల్వప్పెణ్డాట్టి! నీ
ఎట్రుక్కుఱజ్ఞుమ్ పొరుళేలో రెమ్బావాయ్.

అర్థము:—వలి=వలు, కట్టుమ్+కఱవై=లేగటి యావులయొక్క, కఱజ్గళ్=గణములను, కఱన్దు=పిండి, శెత్తార్=శత్రువుల యొక్క, తిరల్=స్థైర్యము, అళియ=అడగ, శెన్దు=పోయి, శెరు=పోరు, శెయ్యుమ్=చేయునట్టి, కుట్రమ్=కుటిలము, ఒన్దుమ్=ఒక్కటియు, ఇల్లాద=లేని, కో+వలర్తమ్=గోవుల పెంచు (వారియొక్క), పొన్+కొడియే=బంగారుతీగా! పుట్రు=పుట్టలోని, అరవు=పాము (పడగ)వంటి, అల్గుల్=మలుగులు గలదానా! పున+మయిలే=వన మయూరమా, శెల్వ+పెణ్డాట్టి=చెలువ ముగల, పడుచుదానా! పోదరాయ్=లేచిరా, శుట్రుత్తు=చుట్టపు, తోడిమా=తోడివారు, ఎల్లారుమ్=ఎల్లరు, వన్దు=వచ్చి, నీముట్రమ్=నీముంగిలి, పుహున్దు=చొచ్చి, ముగిల్+వణ్ణ+పేర్=మేఘ వర్ణుని, పేరుపాడ=కీర్తింపగా, నీ=నీవు, శిట్రాదే=చలింపక, పేశాదే=పలుకక, ఉఱజ్గుమ్+పొరుళ్=నిద్రించు, ప్రయోజనము, ఏట్రుమ్=ఏమిటి?

తాత్పర్యము:– ఓ కన్యామణీ! ఇంకనూ నిద్ర లేవకున్నావు. మన గొల్లలు స్వధర్మపరులు. పాలను పిండుట, తమ గోవులకు, తమకు శత్రువులైనవారి పీచమడచుట యను తమ కృత్యములయందు తామ సింపనివారు. అట్టి యకలంకవంశమున బుట్టినదానా! నీవు సంకల్పించిన వ్రతాచరణమున తామసింపవచ్చునా? నీ యింటి ముంగిటికి వచ్చి నీతోడివారమందరము నీల నీరదవర్ణుని నోరార కీర్తించుచున్నము, అదేమియు పట్టనట్లు ఉలుకక పలుకక ఉన్నావు–నీ యభిప్రాయము మేమి? ఓ అందగత్తె! సువర్ణవర్ణాంగి! వనమయూరము వంటి వన్నెలాడీ! పాముపడగ దెగడు నితంబముదానా! నీ వంశమును నీ యందమును జూచి, ఆ నల్లనయ్య తనంత పలచి వరించుననియా!

నీ సౌభాగ్య సౌందర్య గర్వము వీడి మా తోడ రమ్ము కలసి భజింతము.

వివరణ – మేఘమునకు మయూరమునకు స్నేహము.

మేఘ పర్వతయో రబ్ధి చంద్రయోరబ్జ సూర్యయోః,
శిఖిజీమూతయోర్దృష్టిరమ్యా యోర్మిత్రతా స్వయమ్.

భగవంతుడు నీరనీరద శుభాంగుడు. ఆమె పునమయిల్ – వనమయూరము. మేఘ మురిమినంతనే పురి విప్పియాడుట మయూర లక్షణము. ఆ మేఘవర్ణుని కీర్తించుచుండ నీవు కదలక మెదలక యుండుట న్యాయము గాదు.

మేఘమున కిచ్చట కురిసితిమే మరల నేల కురవ వలయునను నియమములేదు. అదే విధముగ కృష్ణుడుగూడ అందరియెడ దయారసము వర్షించ వలసినదిగదా? అట్లైన గుణాగుణ వివేచన లేక అందరిపై కృపారసము వర్షించిన తన లీలావిభూతికే లోపము వాటిల్లును. అది యాతని సంకల్పమునకే విరుద్ధము.

కావున అనన్యభక్తితో సేవించువారినే ఆతడు దయజూచును. రక్షించును. సేవించుట భక్తుని వంతు. రక్షించుట ఆయన విధ్యుక్త. కనుకనే 'రక్షాపేక్షా మపేక్షతే' నన్ను రక్షింపుమని కోరకున్న, స్వశక్తితో తరింతుమన్న వారి జోలి వర్తించుకొనడు.

అనన్యాశ్చిన్తయన్తో మాం యే జనాః పర్యుపాసతే,
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్.
సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ,
అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః."

అనిగదా అతని శపథము.

సర్వధర్మములను సన్యసింపుము నాదు
చరణ కమలములను శరణు చొరుము
కాచువాడ నిన్ను కలుషంబు లన్నింటి
నడచి, యింక నీకు నడలు వలదు?

(నా యతిరాజీయము)

సర్వధర్మములను అనగా, మోక్షసాధకములని యుపదేశింపన జ్ఞానకర్మ భక్తిరూపములైన యుపాయములు నన్నింటిని వదలి పెట్ట వలయును. వాటిని ఆశ్రయించిన ముక్తి లభ్యమగునేమో యను ఆశ

లేశమైనను లేకుండ విడువవలయును. ఇతర దైవములైన త్వరగ రక్షింతురేమో అను నాశయు కొంచెమేని యుండరాదు. అట్టి ఆకించన్యము గలిగి "ఇతడు రక్షించునో లేదో" అను అనుమానము లేక, తప్పక రక్షించి తీరునను దృఢవిశ్వాసముతో, అతని కిష్టముగాని పనులు మాని, ఇష్టములైన పనులే చేయుచు, ఆతనిపైననే మనభారము నుంచి ఆశ్రయించితిమా, మన మోక్ష ప్రతిబంధకములైన సర్వపాపములను హరించి తన సన్నిధానమునకు చేర్చికొనును.

కరీంద్రుడు స్వశక్తితో మకరిని జయించగలనని యనుకొన్నంత వరకు స్వామి యాతని చింత పట్టించుకొనలేదు. స్వశక్తి నిరుపయోగమని తలచి,

"లా వొక్కింతయు లేదు ధైర్యము
విలోలంబయ్యెఁ బ్రాణంబులున్
ఠావుల్‌దప్పెను; మూర్ఛవచ్చెఁ
దనువున్ డస్సెన్ శ్రమంబయ్యెడిన్
నీవే తప్ప నితఃపరంబెఱుఁగ;
మన్నింపన్ దగున్ దీనునిన్
రావే యీశ్వర! కావవే వరద!
సంరక్షింపు భద్రాత్మకా! (పోతన)

అని సర్వాత్మనా అనన్యగతికుడై వైకుంఠనాథుని శరణు వేడగనే,

సిరికిం జెప్పఁడు శంఖచక్రయుగముం జేదోయి
సంధింపఁ డే
పరివారంబును జీరఁ డభ్రగపతిన్ బన్నింప డాకర్ణికాం
తరధమ్మిల్లముఁ జక్కనొత్తఁడు వివాదప్రోత్థిత శ్రీకుచో
పరిచేలాంచలమైన వీడఁడు గజప్రాణావనోత్సాహియై.

హుటాహుటి బయలుదేరినాడు.

అట్లనన్యభక్తితో నాతని సేవించిన, నతడు ప్రసన్నుడగును. కాని, వాకు ప్రాకృతక్షడిక సౌందర్య సౌభాగ్యములు గలవు. వానికి ముగ్ధుడై యాతడే వలచి వచ్చునని తలంవకుమే బంగారుబొమ్మా!

స్వధర్మపరాయణులైన గొల్లకులమున జన్మించినావు. గోవుల పాలించుట నందనందనున కిష్టమైన పని, అది ఆనుకూల్య సంపాదనము. వానికి విరోధములైన వన్యమృగముల శిక్షించుట, ప్రాతికూల్య వర్జనము. అట్టి వంశమునబుట్టి భగవత్ప్రీతికర కార్యము లనుష్ఠింపక అహంకారముతో స్వాభిమానముతో మండుట వంశమర్యాద గాదు. మాతోబాటు చేరి భజింతము రమ్ము.

అనువాదము:—

కడవల కొలది లేగటియాల కదుపుల
విసువక పాలను పిండి పిండి
బవరాన తెగ నీల్గు పగవారి బలముల
చేతుల తీ(టవో చండి చండి
కుటిల మింతయులేని గొల్లల కులము రం
గారు మేలైన బంగారు తీవ
భుజగమ్ము భోగమ్ము బోలు మల్గులదాన
వనమయూరమువంటి వన్నెలాఁడి!

తోడివారెల్లరును గూడిమాడి యింటి
ముంగిటను జేరియున్నారు మొగిలు వన్నె
కానిఁ, బొగడుచుఁ బలుకవు కదలవిట్లు
వండి యుండగ నేల సంపన్నురాల?

## 12 వ పాశురము

కనైత్తిళఙ్గత్తెరుమై కన్ఱుక్కిరఙ్గి
నినైత్తుములై వళియే నిన్ఱు పాల్ శోర,
ననైత్తిల్లమ్ శేఱాక్కుమ్ నచ్చెల్వన్ తఙ్గాయ్!
పనిత్తలై వీళ నిన్వాశల్ కడైపత్తి

చ్చినత్తినాల్ తెన్నిలజ్గైకోన్కమానై చ్చెత్త
మనత్తుక్కినియానై ప్పాడవుమ్ నీ నాయ్ తిఱవాయ్
ఇనిత్తాన్ ఎళున్దిరాయ్ ఈదెన్న పేరుఱక్కమ్
అనైత్తిల్లత్తారు మఱిన్దేలో రెమ్బావాయ్.

అర్థము:– కనైత్తు–అరచి, ఇళమ్–లేత, కత్తెరుమై+కన్ఱుక్కు– ఎనుపదూడలకు, ఇరఙ్గి–జాలిగొని, నినైత్తు–తలంచి, ములై+వళియే– పొదుగు ద్వారా, నిన్ఱు–నిలచి (ఎడతెగక), పాల్ శోర–పాలు జారగా, ఇల్లమ్–ఇల్లు, ననైత్తు–నాని; శేఱ్ ఆక్కుమ్–బురద యగును. నఱ్+ శెల్వన్–ఉత్తమమగు ఐశ్వర్యముగలవానియొక్క, తఙ్గాయ్–చెల్లెలా! పని–మంచు, తలై–తలపై, వీళ–పడగ, నిన్ఱా–నీ, వాశల్+కడై– వాకిలి కడ, పఱ్ఱి=పట్టి, శినత్తినాల్–కోపముతో తెన్+ఇలఙ్గై+కోమానై– దక్షిణ లంకాధిపతిని (రావణుని), చెత్త–చంపి, మనత్తుక్కు–మనస్సుకు, ఇనియానై–ఆహ్లాదకరుడైన (రాముని), పాడవుమ్–పాడినా, నీ=నీవు, వాయ్–నోరు, తిఱవాయ్=తెరవవు. ఇనిత్తాన్–ఇప్పటికైనా, ఎళున్దిరాయ్–లెమ్ము. ఇదు=ఇది, ఎన్న–ఏమి, పేరు+ఉఱక్కమ్–గాఢనిద్ర, అనైత్తు+ఇల్లత్తారుమ్=ఇన్ని యిండ్ల వారును, అఱిన్దు=తెలిసికొన్నారు.

తాత్పర్యము:– ఓసీ భాగ్యవంతురాలా! నీ సంపత్సమృద్ధి ఏమని చెప్పుదును! లేదూడ లాకలిగొన్నవని వానిపై దయగలిగి 'అంబా' యని పిలుచుచు, వాని తల్లిఎనుములు తమ దూడలను తలపోయుట చేత, పొదుగు పాలుచేపునకు వచ్చి, కొదుల వెంట ఎడతెగక స్రవించుటచే ముంగలియంతయు బురదయైనది. అంతటి సంపన్నురాలగు నీ యింటి ముంగిట బురదనేలపై నిలచి, తలలపై మంచు గురియుచుండ తడియు చున్నాము. ఊరక నిలుచుటగాదు. దేవతా కార్యార్థమై హరి విభవావతారుడుగా అవతరించినాడు. తన ఇల్లాలిని హరించినాడను నెపముతో సముద్రమున సేతువుగట్టి సైన్యసమేతంగా సాగరమును తరించినాడు. లంకను ప్రవేశించి దాని యధినాథుని రావణుని హత మార్చి తాపసుల మనస్సుల నానందపరచినాడు.

అట్టి శ్రీరామచంద్రమూర్తిని కీర్తించుచు నీ వాకిలి ముంగిట నిలిచి యున్నాము. మేము వచ్చి నీకై నిలిచియుండుట చూచియు, రామ కీర్తనము వినియు లేచిరాక పరుండియున్నావు. ఇదేమి నిద్రపోతు తనమే నీది! లే లెమ్ము! ఇకనైనా నిద్రలేచి రమ్ము.

విశేషార్థము :- ఇచట మనము, లేదూడలను జీవకోటిగాను, తల్లులను పరమాత్మగాను భావించుకొనిన—

గుంజలకు బంధింపబడిన లేదూడలను తలచి, తలచి, తల్లులు "ఇవి ఆకటితో అటమటించు చున్నవే తలుగుల తెగదెంచు కొని తమ కడకువచ్చు శక్తి జాలనివే" అని, వానిపై కరుణ గలిగి, తద్భావనచే, అవిచ్ఛిన్నముగ పాలు చేపుకువచ్చి, కొడులవెంట ఏకధారగా స్రవించు నట్లు,

పరమాత్మ, ప్రకృతి వ్యామోహమునబడి ఆ బంధనమునుండి తప్పించుకొని, తన దగ్గరకురాలేని, సంసారసాగరమున మునిగి అట మటించు జీవకోటిని చూచి, వాని కుపకరింపదలచి, కరుణతో వలసిన యుపకారమంతయు చేయుచున్నాడు.

ఆధారముగ భూమిని, త్రాగను నీటిని, పీల్చను గాలిని, వండ నగ్నిని, నడయాడ నాకాశమును సృష్టించినాడు. క్రిమికీట పశుపక్షి దశలనుండి మానవజన్మకు తీసుకొనివచ్చినాడు. తెచ్చి పటిష్ఠములైన ఇంద్రియములతో బాటు జ్ఞానమును ఇచ్చినాడు. ఇది మంచి తెరువు, ఇది చెడు మార్గము, దీని వెంట నడువుము, ఇటు పోవకుము అని వేద శాస్త్రముల మూలమున విధి నిషేధముల నెఱింగించినాడు.

"ఇవన్నియు భౌతికములే గదా! శరీరపోషకములేగాని ఆత్మో జ్జీవకములు కావుగదా? ప్రకృతి బంధములను తొలగించుట ఉపకార మగుమగాని, ఇంకను బంధముల కూరుకపోవు విషయసుఖముల పెం పొంద జేయుట దయయా? వానిపై వ్యామోహముచే నాకర్షింపబడి సంసారమున సుడివడుచుండ తేరకానివలె చూచుచుంట కరుణయా? ఇది హితశత్రుత్వము గాదా? కౌరవవంశ నిర్మూలనకు హితకారివలె నడచిన శకునిచేష్టలవంటివి గావా ఇవి? ధన ధాన్య గృహారామాది

ఎరలజూపి హితుడుగాదోచినా, పరమార్థమున కాతడు హితుడా? విషయ వైరాగ్యము గలిగించి ముక్తి నొసంగుట గదా జీవులకు హితము .... అనిన.

జీవకోటి సంతతిని గుణాగుణవివేచన లేక ముక్తులను జేయుట తన లీలావిభూతికే లోపము గల్గించుట. అది తన తొలి సంకల్పమునకే విరుద్ధము.

బిడ్డల క్షేమమే ఆశించు తల్లియైనను చిన్నతనమున ఆకలి యొద్దరసి అడుగకున్నను తిండి తీర్థముల నమరించి, నిద్రపుచ్చి, లాలించి పోషించునుగాని, వయసు వచ్చిన మీదటగూడ నా రీతి నీర క్షీరముల నిచ్చి అవసర మక్కరలు పరికించునా? అడిగిన గాని అమ్మైనా పెట్టదుగదా?

అటులనే భగవంతుడును, మానవత వచ్చువరకు వలసిన సౌకర్యములను గూర్చినాడు. అటుమీదట, స్వతంత్రముగా జీవింప గోరు తనయునకు తండ్రివలె మంచి చెడు బోధించి తాను సాక్షిభూతుడుగానుండి వాని చర్యను గమనించుచుండును. అపమార్గమున బోయిన, అంతరాత్మగా నుండి వలదని హెచ్చరించును. అహంకార మమకారములచేత అతని హితబోధను పెడచెవిని బెట్టిన నీ కర్మ నీ వనుభవించుమని తా నుదాసీనుడుగా నుండును.

"ద్వా సుపర్ణా సయుజా సఖాయా
సమానం వృక్షం పరిషస్వజాతే,
తయోరన్యః పిప్పలం స్వాద్వత్తి
అనశన్నన్యో అభిచాకశీతి."

(ముండకోపనిషత్)

రెండు పక్షులు తేజోవంతములగు రెక్కలతో స్నేహముతో ఒకే వృక్షము నాశ్రయించియున్నవి. వానిలో నొక్కటి "పిప్పలం స్వాద్వత్తి" తియ్యని ఆ రావియాకును మేయును. మరొక్కటి తినక విరాజిల్లుచుండును అని.

దీని భావము:— ఈ శరీరమే వృక్షము. దానిమీద రెండుపక్షులు. అవియే జీవుడు, పరమాత్మ. అని 'సుపర్ణా సయుజా సఖాయా' బంగారు వంటి తేజస్సు గలిగి కలిసిమెలిసి మిత్రులవలె ఒండొండిని విడువక యుండును. వానిలో నొక్కటియైన జీవాత్మ తియ్యని రావియాకును (అనగా కర్మఫలమును) అనుభవించును. అది చేదు అగు దుష్కర్మకు ఉపలక్షణము.

మరొక్క పరమాత్మ కర్మఫల భోక్తగాక సాక్షిమాత్రుడుగా విరాజిల్లు చుండును. అని,

ఇరువదినాల్గు తత్త్వముల నేర్పడి
    ప్రాకృతమైన దేహమే
తరువట; పైడిరెక్కల పతంగము
    లచ్చట రెండు జీవుఁ డీ
శ్వరుఁడని; యందు కర్మ ఫల
    చర్వణ చేసెడి పక్షి జీవుఁడే
పొరి పొరిఁ బుట్టు; వేరొకఁడు
    పొంపిరి పోవును సాక్షిభూతుఁడై.

(నా యతిరాజీయము)

వేదచోదితములైన నిత్యకర్మలే ఫలాపేక్షలేక భగవత్ప్రీతికై యాచరించుచు, సంసారబంధమునుండి విడివడవలయునని ఆసక్తి గల్గువారిపై భగవంతుడు దయామృతము వర్షించి భవతరణమునకు ఉపాయ ముపదేశించుట కాచార్యుని అతడే సమకూర్చును.

"పని త్తలై వీళ"— మంచు తలపై బడినట్లు శిరముపై నాచార్యుని కృప ప్రసరించినవారు కృతార్థులగుదురు. వారి జన్మ సార్థకమగును. గోపిక లార్తిగల్గి సద్ర్వతము సాగించుచున్నందున భగవదనుగ్రహమునకు ఆచార్యానుగ్రహమునకును పాత్రులగుచున్నారు.

"తెన్నిలఙ్గై క్కోమానై చ్చెత్త"

రావణుడు పరరాజ్య పరదారాపహరణము గావించి, పరులను, సాధువులను పీడించువాడు. వారిని హతమార్చినవాడు రామావతార భగవానుడు.

పరదారాపహరణము పరపీడనము, కామక్రోధాది దుర్గుణములవల్ల గల్గుచున్నవి. అవి అంతశ్శత్రువులు. బహిశ్శత్రువులను కత్తితో నరికివేయవచ్చును. అంతశ్శత్రువుల నిర్మూలించు టెట్లు? అది యసాధ్య కార్యము. అవి యెంత కోసివేసిననూ రావణుని తలలవలె తలెత్తుచునే యుండును.

సత్సహవాసము సదాచార్యోపదేశము సాత్త్వికాహారము భగవచ్చింతన ఇత్యాదులచే రజోగుణ జన్యములగు అరిషడ్వర్గములు అడుగు మాలి పోవును. అప్పుడు భగవత్సేవ నిరంతరాయముగ సాగును. ఆ సేవయే తరణోపాయము.

జ్ఞానమే మోక్షసాధనమని కొందరు బోధింతురు. "జ్ఞానవిహీన స్సర్వమతేన ముక్తిం న భజతి జన్మశతేన" అని, మోక్షసాధనోపాయములలో జ్ఞానమొక్కటే మోక్షసాధనమని, "జ్ఞానాదేవ తు కైవల్యం" అని వాదించువారుందురు. ఉండనీ, గీతాచార్యులు జ్ఞాన కర్మ భక్తి యోగములు ఒక్కొక్కటియు మోక్షసాధనమనిరి.

ఆటవికజాతి శబరికి, పక్షియైన జటాయువుకు మోక్షప్రాప్తి జ్ఞానముచేతనేగా గల్గినది? "అథాతో ధర్మజిజ్ఞాసా" అని వేద వేదాంత జ్ఞానము సంపాదించి, కర్మమీమాంసా పరినిష్ఠితులై బ్రహ్మజ్ఞానము సంపాదించిన వారికే ముక్తియన్న, కోటికొక్కరికిగూడా ముక్తి లభించదు. మిగిలిన వారి గతియేమి? అదియేనా గీతాచార్యోపదేశము?

ఏ వేదంబు పఠించె లూత? భుజగం
బే శాస్త్రముల్ చూచెఁ? దా
నే విద్యాభ్యసనం బొనర్చెఁ గరి?
చెంచేమంత్ర మూహించె? బో
ధావిర్భావ నిదానముల్
చదువులయ్యా? గావు! నీ పాదసం
సేవాసక్తియ గాక జంతు
తతికిన్ శ్రీకాళహస్తీశ్వరా! (ధూర్జటి)

అని భగవత్సేవా కైంకర్యమే ప్రాణులకు మోక్షసాధన మన్నాడు.

జనన మరణ పరంపరా రూపమగు సంసారము కర్మఫలితముగా నేర్పడినది. కర్మఫలానుభవముననే పలుజన్మముల నెత్తుచున్నారు జీవులు. వారియెడ నవ్యాజానురాగముతో నరవ్యాజమున తరణో పాయముల నుపదేశించినాడు భగవానుడు. ఆ ఉపాయములే యోగములు. వానినే ధర్మములనియు భగవానుడు పేర్కొన్నాడు.

ఈ ప్రపంచమే మాయ. అది భగవంతుని శక్తి. భగవంతునికి ప్రపన్నులైనవారికే ఈ మాయను దాట సాధ్యమగును. అదియే

"మామేవ యే ప్రపద్యంతే మాయా మేతాం తరంతి తే"

అని వక్కాణించినాడు. "మామేవ" నన్నే శరణు జొరవలయు నన్నాడు.

ఇతర దైవతముల గొలిచిన దానివలన ఐహికములేగాని మోక్షము లభింపదన్నాడు.

ఇత్తురుగాక నిర్జర సురేశ
గిరీశ సరస్వతీశ్వరుల్
తత్తదిఁ బుత్తదిఁజా సుతుల దారల
భూముల వాహ గేహ సం
పత్తుల నిందిరాపతి కృపా
ప్రతిపాదిత శక్తిఁ గాని, కిం
చిత్తది యంతవత్తుః పరిశీలన
చేసిన శాశ్వతమ్మొకో ?

(నా యతిరాజీయము)

అనన్యదేవతాభక్తులై నారాయణేతర మంత్రానపక్తులుగాక, ప్రపత్తీతర సాధనములను సర్వాత్మనా వదిలి - సర్వధర్మాన్ పరిత్యజ్య - ఆ లక్ష్మీ నారాయణునే భజింపవలయును.

అట్లు భజించుట మానవులవంతు. భవబంధములనుండి తరింప జేయుట నారాయణుని వంతు.

మానవులలో బుభుక్షువులే మెండు. నూటికొక్కరో కోటికొక్కరో ముముక్షువులు. "హఠాత్తుగా, భగవంతుడు నిన్ను మోక్షమునకు రమ్మని పిలుచుచున్నాడు. ఉన్నదువున్నట్టుగా బయలుదేరి రావల యును" అనిన ఇల్లు ఇల్లాలు ఆస్తి పాస్తి విడచి పయనము కట్ట నెందరు సిద్ధము? "బహూనాం జన్మనామంతే జ్ఞానవాన్" ఎన్ని జన్మలో ఎత్తినమీదట ఆ జన్మలలోని సుకృతఫలితముగ మోక్షేచ్ఛ గలవా డగుచున్నాడు.

ఐహిక భోగముల యందనురాగము లేని శ్రీమద్యామున మునులే "రంగనాథుడు నీకు మోక్ష మిచ్చితిని బయలుదేరుము" అనగా, రెండు దినములు వాయిదా యిమ్మనెనట. అట్లుండ బుభుక్షువుల సంగతి దడవనేల?

గోపిక లా విధమున నార్తిగలవారై "మనత్తుక్కినియానై ప్పాద వుమ్" మనోహర గుణములుగల హరిని కీర్తించుచున్నారు.

అట్లు కీర్తించి తరించవలయుమగాని, సజ్జన సాంగత్యము పరిహరించి తలుపులు మూసికొని నిద్రించుచు, వేకువయందు గూడ లేవక, పావనమైన మానవజన్మము నిరర్థకముగ భౌతికసౌఖ్యములకై వ్యయ మొనర్చుట "బొగ్గులకై కల్పతరువు నరుకుట గాదే?"

అనువాదము:—

ఆఁకొన్న లేగల నాదరమ్మునఁ బిల్చి
    ఎనుములు తచ్చింత మనము గరిగి
పాల్ చేపి చన్నులఁబడి జాలువారి యి
    ల్లెల్ల జంబాలమై యుల్లసిల్లు
ధన్యురాలా! మంచు తలలపై గురియంగఁ
    దడియుచు నీ యింటి గడపపట్టి
సీతను చెరగొన్న యాతుధానుని లంక
    నేతను కాలుని వాతఁ ద్రోసి

సాధుమానస మానంద జలధిదేల్చి
నట్టి శ్రీరామచంద్రు నోరారఁ బాడి
నప్పటికి మారుమాటాడ; వందరెరిగి
నార లింకేని లెమ్మ బంగారుబొమ్మ.

## 13 వ పాశురము

అవతారిక:— మరొక కన్యను మేల్కొల్పుచున్నారు.

పాశురము:—

పుళ్ళిన్ వాయ్ కీణ్డానై ప్పొల్లావరక్కనై
క్కిళ్ళి క్కళైన్దానై క్కీర్తిమై పాడిప్పోయ్
ప్పిళ్ళైగళెల్లారుమ్ పావైక్కళమ్ బుక్కార్
వెళ్ళియెళున్దు వియాళ ముఱజ్గిత్తు
పుళ్ళుమ్ శిలుంబిన కాణ్, పోదరిక్కణ్ణినాయ్
కుళ్ళక్కుళిరక్కుడైన్దు నీరాడాదే
పళ్ళిక్కి డత్తియో పావాయ్! నీ నన్నాళాల్
కళ్ళమ్ తవిర్న్దు కలన్దేలో రెమ్బావాయ్.

అర్థము:— పుళ్ళిన్=పక్షియొక్క, వాయ్-నోటిని, కీణ్డానై-చీల్చిన, పొల్లా-దుష్టుడైన, అరక్కనై-రక్కసుని, కిళ్ళి-గిల్లి, కళైన్దానై-పారవేసినదాని, కీర్తిమై-కీరితిని, పాడి-పాడి, పోయ్-పోయి, పిళ్ళైగళ్=పిల్లలు, ఎల్లారుమ్-ఎల్లరు, పావై+కళమ్=నోము స్థలమును, పుక్కార్-చొచ్చిరి. వెళ్ళి-శుక్రుడు, ఎళున్దు-లేచెను వియాళమ్-గురువు, ఉఱజ్గిత్తు-మునిగెను. పుళ్ళుమ్=పక్షులు. శిలుంబిన-అఱచుచున్నవి. కాణ్-కనుము. పోదరి-పూలవంటి. కణ్ణినాయ్-కన్నులదానా! పావాయ్!-పిల్లా! కళ్ళమ్-కాపట్యమును, తవిర్న్దు-తొలగించి కలన్దు-(మాతో)కలసి, నల్+నాళాల్-[illegible]దినమున, కుళ్ళ+కుళిర-అతిశీతలము[illegible] [illegible]మునిగి, నీ+ [illegible]రాడక, పళ్ళి+[illegible]ద్తియో-వం[illegible]

తాత్పర్యము:— "పోదరిక్కణ్ణినాయ్" వికసించిన పూలవంటి కన్నులదానా! నీ కన్నులలోనే అందముట్టిపడు చున్నదే. చూచిన కొలది నీ కన్నులనే చూడవలయు ననిపించు చున్నదే. మాకే యిట్లుండ, ఆ నల్లనయ్య నీ కన్నుల జూచిన మరొక్కటి చూడగోరునా? అట్టి నీ కన్నులు మూసికొని పండుకొనియుండదగునా? ఒక్కసారి కన్నువిచ్చి చూడుము. "వెళ్ళి యెళున్దు వియాళ ముఱఙ్గిత్తు" చుక్క పొడిచినది. గురు డస్తమించినాడే.

కన్నులు మూసికొని లోనపడుకొన్న నీకు తెలియక పోవచ్చును. "పుళ్ళుమ్ శిలుమ్బినకాణ్" పక్షులు కూయుచున్నవిగదా? ఆ నవ్వడి యైనను నీ చెవుల బడలేదా? చెవులకునూ మూతలున్నవా?

"ఏకాంతమున భగవద్ధ్యానానుసంధానముననున్న నాకు బాహ్య ప్రపంచము తెలియలేదందువేమో" పోనిమ్ము. లౌకిక విషయములు నీ మదికెక్కకున్న మానె భగవద్విషయమన్న భగవత్కథలన్న చెవి కోసుకొందువు గదా!

"పుళ్ళిన్వాయ్ కీణ్డానై పొల్లావరక్కనై క్కిళ్ళి క్కళైన్దానై క్కీర్తిమైపాడి" బకాసురుని చీల్చిన కృష్ణునిలీలలను, పరదారాపహరణాది ఘోర కార్యక్రమములఁ జేసిన రావణాసురుని తలలు గిల్లి పారవేసిన శ్రీరామచంద్రుని ప్రశంసించుచూ, తోడివారందరూ ఈ వీధి గుండానే పోయిరిగదా! వారి పాటలైనా చెవిని బడలేదా?

కన్ను లరవిచ్చి వారేరీ యనెదవా? ఎంతపిలిచిననూ లేవనందున వారు నోము నోచు పట్టునకు వెళ్ళిపోయినారు. నీకై కాచి నీతోబాటు మేమును వెనుకబడితిమి. లెమ్ము. ఇప్పటికైనను మించినది లేదు. త్వరగబోయి వారితోకలిసి సంకల్పిత వ్రతాచరణమునకు చన్నీట స్నానమాడుదము. కపట నిద్దుర చాలించి, ఏకాంత ధ్యానానుసంధానము ముగించి రమ్ము. ప్రత్యక్ష పరమాత్మయగు శ్రీకృష్ణుని సాయుజ్యము లభించు నవకాశమున్న ఈ "నన్నాళాల్" శుభసమయము మరి రిత్త పుచ్చి ఊహాలోకమున విహరింపనేల? కృష్ణుని యనుగ్రహమునకు పాత్రమగునట్లు శారీరక మలములు వాయ, వేకువనే ఆరోగ్యకర

మగు ఏటి చన్నీట స్నానమాడుదము. మన మాలసించిన ముందు పోయినవారే శ్రీకృష్ణదర్శన స్పర్శనాలాప భాగ్యములను చూర గొందురు. త్వరపడుము. లెమ్ము.

సత్కార్యములకు త్వరపడవలెను. ఆలస్యాదమృతం విషం, చెడు పనులకు నిదానమే ప్రధానము.

అనువాదము :

పులుఁగులు రొదసేసెఁ బొడిచెను చుక్కయు
గురుఁడ స్తమించెను కువలయాక్షి!
పులుఁగుఁ జీల్చినవానిఁ! బొలసుదిండిని సంహ
రించినవానిఁ గీ ర్తించుకొనుచు
సఖియలెల్లరు మున్న చని చేరి కొన్నారు
భామినీమణి నోము పట్టునకును
ఈ మేలిదినమున నిందాఁక లేవక
పడకను వీడక పవ్వళించి

పొరలు చున్నావదేమిటే! పూవుబోణి!
కపట నిద్దుర విడనాడి, కలసి మెలసి,
యవగహించెను జలముల నిందువదన!
మునిగి నీరాడుదము రమ్ము మోహనాంగి.

## 14 వ పాశురము

అవతారిక :— మరొక్కకన్యను నిద్ర లేపుచున్నారు.

ఉఙ్గళ్ పుళైక్కడై తోట్టత్తు వావియుళ్
శెఙ్గళునీర్ వాయ్‌నెగిళి న్దాంబల్ వాయ్ కూంబిన కాణ్
శెఙ్గల్పొడిక్కూఱై వెణ్‌పల్ తవత్తవర్
తఙ్గళ్ తిరుక్కోయిల్ శఙ్గిడువాన్ పోగిన్దార్

ఎజ్గళై మున్నమ్ ఎళుప్పువాన్ వాయ్ పేశుమ్
నజ్గా యెళున్దిరాయ్ నాణాదాయ్ నావుడైయాయ్
శజ్గొడు శక్కర మేన్దుమ్ తడక్కైయన్
పజ్గయక్కణ్ణానై ప్పాడేలో రెంబావాయ్.

అర్థము:- ఉజ్గళ్-మీయొక్క, పుళై+కడై-కాలిబాట కడనున్న, తోటత్తు-తోటయొక్క, వావియుళ్-బావియందు, శెజ్గళునీర్-ఎఱ్ఱదామరలు, వాయ్+నెగిళున్దు-నోరువిచ్చినవి (వికసించినవి) ఆంబల్-నల్లకలువలు, వాయ్+కూంబిన-ముకుళించినవి. కాణ్-కనుము, శజ్గల్+పొడి+కూరై-కావివస్త్రములను, వెణ్+పల్-తెల్లని పండ్లుగల, తవత్తవర్-తపస్వులు. (జీయర్లు) తజ్గళ్-తమ, తిరుక్కోయిల్-దేవాలయమున, శజ్గిడువాన్-తాళపుచెవి మంచువారు (ఆలయ ద్వారము తలుపులు తీయువారై), పోగిన్దార్-పోవుచున్నారు. ఎజ్గళై-మమ్ము, మున్నం-ముందుగ, ఎళుప్పువాన్-లేపెదనని, వాయ్+పేశుమ్-మాట చెప్పియు, నజ్గాయ్-నాతిరో, నాణాదాయ్-సిగ్గులేనిదానా! నా+వుడై యాయ్-నాల్కగలదానా. (గడుసు మాటలదానా) శజ్గోడు-శంఖము తోడ, శక్కరం-చక్రమును, ఏన్దుమ్-తాల్చి, తడ+కైయల్-దీర్ఘ బాహువులైన, పజ్గయక్కణ్ణానై-పంకజనేత్రుని, పాడ-పాడుటకు, ఎళున్దిరాయ్-లెమ్ము.

తాత్పర్యము:— కాంతామణీ! ఎంత గట్టిదానవే? మమ్ములను వేకువనే వచ్చి నేనే లేపెదనని చెప్పితివే. మేము వచ్చి లేపినను లేవకున్నావు. "ఇంకనూ వేకువ కాలే"దని బూకరింతువా? మంచి మాట కారివే. నాలుకున్నదని గడుసుమాటలాడ లజ్జింపవలదా? మేమసత్యమాడుచున్నామా? అదిగో నీ నడబావిలోని కెందామరలు వికసించినవి. కన్నుమూసిన నిన్ను పరిహసించుచున్నవి. నీవు అభిమానవతివి గావా? లెమ్ము. సహస్రపత్రముల దెగడు నీ కనుగవ నొక్కసారి తెరిచి పరికింపుము, ఎంత పొద్దెక్కినదో తెలియును. విచ్చిన తామరల జూచి పరుల పంచన నోర్వలేని వానివలె నల్లకలువలు ముకుళించినవి. అవియైన తెల్లవారినదని తెల్పుచుండలేదా?

"ఏమో బావికడకు బోయి చూచు వారెవ్వరు అనెదవా?" పోనిమ్ము తలవాకిలి వీథిలోనికైనా దృష్టి సారింపుము.

హృదయములోని వైషయిక రాగము నంతయు వెలికి నెట్టివేసి నారా అన్నట్లు శుద్ధ సాత్త్వికతను తెలుపు పలువరుసతో, పరివేష్టితమైన కాషాయవస్త్రముతో, జన్మసార్థకతకై దేవపూజా నిత్య కైంకర్యమునకు తాము తరించి; లోకులను తరింపజేయుటకు దేవాలయోద్ఘాటనకు కుంచి కను తీసికొని జీయ్యర్లు పోవుచున్నారు. లేవకున్నమానె కనురెప్పల నించుక విచ్చిచూడుము. వీథిలో బోవువారు కనుపింతురు.

వివరణ:—

కమలములుగాని, కలువలుగాని, క్షణికవిలాసము గలవియే. ఈ భౌతిక సంపదలు శాశ్వతములు కావని తెల్పుచు రేయంతయు వికసించిన కలువలు వేగుబోకనే వాలిపోయినవి. ప్రొద్దు ముసుగువరకే ఆ కమలముల శోభయును.

మానవజన్మ మెత్తిన మనము ఈ క్షణిక భౌతికభాగ్యములను గాక శాశ్వత సౌభాగ్యమును సాధింప ప్రయత్నింపవలెనన్న, ఏ కాలమందుగాని, కాంతి మాయని "పంకయక్కణ్ణానై" పుండరీకాక్షుని కీర్తింపవలెను. అతనిని అనన్యభక్తితో నాశ్రయించి శరణుజొచ్చితిమేని అతడు మనలను రక్షించును. "శఙ్గోడుశక్కరమేన్దుమ్ తడక్కైయన్" అతడు శత్రుసంహారకమైన చక్రమును కుడిచేత దాల్చినాడు. జీవులకు శత్రువులు వారి ఉన్నతగతికి అటంకములైన కామక్రోధాది అరిషడ్వర్గములు, సంచితాగామి కర్మలును, వానిని నిర్మూలింప జాలినవాడా చక్రాయుధుడు.

పరమాత్మానందానుభూతికి ప్రతిబంధకములు దేహాత్మభ్రాంతి, స్వస్వాతంత్ర్యము, "అహం బ్రహ్మాస్మి" అను నజ్ఞానమును – దానిని నిర్మూలింపజేయజాలినవాడు ఆ పాంచజన్యపాణి. ఆజానులంబి దీర్ఘ బాహు సమలంకృతమై పుంసాం మోహనమైన దాతని దివ్యమంగళ విగ్రహము.

అతడు సహస్రశీర్షుడు, సహస్రాక్షుడు, సహస్రబాహువు, సహస్ర పాత్తు, విరాడ్రూపుడు కావచ్చును. ఐన నేమి? శంఖచక్ర శోభితమైన చతుర్భుజ రూపమే మన కానందసంధాయకము. ఆ చండభాను హిమధామ విలోచనములుగల ఉగ్రరూపుడు గాక "వజ్రయక్కడ్డానై" తామరసాక్షుడే మా మనశ్చోరుడు. కనుకనే విశ్వరూపము జూచిన మీదట దానిమీద ఆదరము లేని నరుడు.

"తదేవ మే దర్శయ దేవ రూపం
ప్రసీద దేవేశ జగన్నివాస,
కిరీటినం గదినం చక్రహస్త
మిచ్ఛామి త్వాం ద్రష్టుమహం తథైవ,
తే నైవ రూపేణ చతుర్భుజేన
సహస్రబాహో భవ విశ్వమూర్తే."

అని ప్రార్థించినాడు.

అటులనే మనమునూ అతని సౌందర్య శోభితమైన సౌమ్య రూపమునే ఆశ్రయించి అతని పాడి; సేవించి, యర్చించి, శరణుజొచ్చి అవ్యయ శుభములను బడయుదము రమ్ము, లెమ్ము.

నడబావిలో కమలాలు వికసించియున్నవి. కలువలు ముకుళించి యున్నవి అసుటలో నొక గూఢమైన పరమార్థము గోచరించుచున్నది. సరస్సే శరీరము. అందులో ఇంతవరకు వికసించి ఇప్పుడు ముకుళించిన కలువలు సుఖాలు కష్టాలు ఐన కర్మఫలాలను అనుభవిస్తూవుండే జీవులు. ఆ సరస్సు అనే శరీరంలోనే వికసించిన తామర విరాజిల్లుచున్నది. అదియే పరమాత్మ. ఆ పరమాత్మకు కర్మఫలానుభూతి లేదు. కేవలం సాక్షి భూతంగా వున్నది అనేది ద్వాసుపర్ణా సయుజా సఖాయా, సమానం వృక్షం పరిషస్వజాతే, తయోరేకః పిప్పలం స్వాద్వత్తి, అనశ్నన్యో అభిచాకశీతి— అని ముండకోపనిషదర్థమును సూచించుచున్నది. ఒక్క చెట్టుమీద రెండు బంగారు రెక్కల పక్షులు. వానిలో ఒక్కటి పిప్పలం-రావిఆకును (కర్మఫలాన్ని) తినుచున్నది. తినక రెండవ పక్షి తేజరిల్లు

చున్నది. పిప్పలమే కర్మఫలము. అటులనే ముకుళనమనే కర్మఫల దుఃఖమును అనుభవించు జీవులు, వికాసమున తేజరిల్లు కమలవనమును పరమాత్మ సన్నిధానమున నున్నను, ప్రకృతిబద్ధులైనందునను ఆనంద దూరులగుచున్నారు. వారు, "తవత్తవర్" తపస్వులను ఆచార్యుల అనుగ్రహము బడసిన ధన్యులగుదురు. ఆ తపస్వులు, "శజ్గల్ పొడిక్కూరై వెణ్పల్" కాషాయాంబరులు. కాషాయము రాగము. వస్తువులపై భ్రాంతి. హృదయములోని రాగము వస్తువులపై కామము. వెలికినెట్టి వేయబడినది. అదియే కావివస్త్రముగా బైటనున్నది. కామము తొలగిన కామజన్యములైన క్రోధాదుల కాస్పదమే లేదు. కామాత్ క్రోధోఽభిజాయతే.... ప్రణశ్యతి, అనిగదా గీత. మానసిక రాజస తామస గుణములు తొలగించిన సత్త్వము, తజ్జన్య శాంతి శమ దమాదులు హృదయమున నిండి బైటకు, వెణ్పల్-శుభ్రమైన పలువరుసగా తొంగిచూచుచున్నవి. అట్టి సుగుణవంతులగు ఆచార్యులను శరణుజొరవలయును. చొచ్చినవారు "తంగళ్ తిరుక్కోయిల్" తమ ఆరాధ్యదైవమైన శ్రీమన్నారాయణుని పరంధామమునకు చేరు నుపాయము అనుగ్రహించగలరు. మోక్షారామముల తెరచు "శంగ్" బీగముచెవి, నారాయణాష్టాక్షరి వారికడ నున్నది. వారి యనుగ్రహమునకు పాత్రమైన వారికి దానిని ప్రసాదింతురు. అష్టాక్షరీ జపపరాయణుల హృదయములకు "శంగోడు శక్కరమేందుం తడక్కైయణ్" రాక్షసులవంటి తామస గుణములను కామక్రోధాదులను దునుమాడగల చక్రాయుధమును, సాత్త్వికగుణములగు శమదమాదులను అనుగ్రహింపగల పాంచజన్యమును, బాహువుల ధరించిన శ్రీమన్నారాయణుడు వశవర్తియై వారి యోగక్షేమముల నరయును. క్షణిక శోభకు నెలవైన ప్రాకృత కమలములవలె గాక శాశ్వత లక్ష్మినివాసములైన "పజ్గయక్కణ్ణాణ్" పద్మాక్షుడు. భక్తులకు అచ్యుతామృతానందమును అనుగ్రహించును. కాన, ఆచార్యానుగ్రహముచే, మంత్రోత్తమమును బడసి భగవచ్చరణారవింద శరణాగతులై నిశ్శ్రేయసమునందుట జీవులకు పరమగమ్యము.

పూఁదోఁట నడబావిఁ జూచె కెందామరలు
కాంచుమా ముకుళించె కలువపూలు
కావు లీనుమదుంగు కటి జుట్టి, శ్రీతెల్లని
పలుచాలు తోడి తపస్వివరులు
దేవాలయము తల్పుఁదీయఁ గుంచికఁ బూని
వెడలుచున్నారమ్మ వడఁతిమిన్న
'మిమ్ము ముందుగ వచ్చి మేలుకొల్పెద' నంచు
మాటిచ్చి లేవని మాటకారి

దానఁ యిఁకనైన లెమ్ము మందాక్షహీనః
పంకరుహనేత్రు వ్యాదీర్ఘ బాహువులను
దర్శనము పాంచజన్యముఁ దాల్పువాని
కీర్తనముసేయ రావమ్మ కీరవాణీ!

## 15వ పాశురము

అవతారిక:—

ఇంకొక్క కన్యామణిని శ్రవ్యనాదముతో నందనందనుని కీర్తించుచు తన్మయురాలైన దానిని లేపుచున్నారు. ఇది సంభాషణ రూపము.

ఎల్లే యిలంగిళియేః యిన్నమ్ ఉఱంగుదియో?
శిల్లెన్ఱళై యేన్మిన్‌గళ్? నఙ్గై మీర్: పోదరుగిన్ఱేన్
వల్లై, ఉన్ కట్టురైగళ్ పణ్డేయున్ వాయఱిదుమ్
వల్లీర్గళ్ నీఙ్గళే, నానేదానాయిడుగ
ఒల్లైనీపోదాయ్: ఉనక్కెన్న వేఱుడైయై?
ఎల్లారుమ్ పోన్దారో? పోన్దార్, పోన్దెణ్ణిక్కొళ్
వల్లానై కొన్ఱానై మాత్తారై మాత్తళిక్క
వల్లానైమాయనై ప్పాడేలో రెమ్బావాయ్.

అర్థము:—గొల్ల కన్యలు—ఎల్లే!—ఏమే! ఇలజ్ఞిశియే—లే జిలుకా: ఇన్నమ్—ఇంకా, ఉఱజ్గదియో—నిద్రించుచున్నావా?

ఆమె:— శిల్లే+ఎన్ను—జల్లుమని, అళై యేన్మిన్—అరవకుడు, మీర్—మీరు, నజ్గై—గొప్పవారు, పోదరుగిన్డేన్—వచ్చుచునేయున్నాము.

వారు:— వల్లై—సమర్థురాలవు, ఉ౯—నీయొక్క, కట్టు+ఉరై గళ్—గడుసుమాటలు, ఉన్+వాయ్—నీ నోరు, పణ్డే—ముందే, అఱిదుమ్—ఎఱుగుదుము.

ఆమె:— నీజ్గళే—మీరే, వల్లీర్గళ్—సమర్థురాండ్రు, నానేదా౯—నేనే, ఆయిడుగ—అగుదునుగాక.

వారు:— నీ—నీవు, ఒల్లై—త్వరగా, పోదాయ్—రమ్ము, ఉనక్కు—నీకు, వే+రుడై యో—వేరు(భోగ)అనుభూతి, ఎన్న+ఏమి? (ఏల?)

ఆమె: — ఎల్లారుమ్—అందరును, పోన్దారో—వచ్చినారా?

వారు:— పోన్దార్—వచ్చినారు, పోన్దు—వచ్చి, ఎణ్ణిక్కొళ్—ఎంచుకో, వల్ల+ఆనై—బలమైన ఏనుగును (కువలయాపీడనమును), కొన్ఱానై—చంపిన; మాత్తారై—మార్తురను (శత్రువులను), మాత్తు—మతమును; అళిక్క—అడచ, వల్లానై—సమర్థుడైన, మాయనై—మాయలమారిని (అతిశయిత శక్తిగల కృష్ణుని), పాడ—పాడుటకు; (రమ్ము)

తాత్పర్యము:—నిద్రించు గోపకన్యలను మేల్కొలుపు పాశురములలో నిది కడపటిది. ఇంతకు మునుపటి 9 పాశురములలో లేపవచ్చిన వారిమాటలే, ఇందులో వచ్చ్రించిన యామె మాటల గూడ కలిసి ఉక్తి రూపమున నున్న ప్రత్యుక్తి పాశురము.

వా రనుచున్నారు:—

ఏమే యింతవరకూ నిద్ర లేవకున్నావు. అందరికన్న మున్ను లేచి అందరినీ నేనే లేపెదమ. ఈ దినము ఘనముగ వైభవోపేతముగా నోము నోమవలయునని, ఏమేమో బీరములు పల్కితివే. మేము వచ్చి నీ ముంగిట నిలచి పిలుచుచున్నను లేచి రాకున్నావు. వట్టి చిలుక పలుకులు పలికెదవే కిరవాడీ! మాట నిలుపకపోయితివి. పోనీ ఇప్పుడైనా

త్వరగారా! అని పిలుచు వారికి, ఆమె గట్టిగా అరవకుడు. ఎత్తి పొడవకుడు. ఇప్పుడే వచ్చుచున్నాను అనగా,

వారు:— 'ఎంత గడుసరివే' కానిమ్ము. నీవూ నీమాటలు మాకు క్రొత్తలా? అనగా

ఆమె:— మీరే గడుసువారు. కాని నేనే గడుసరిని కొందు. దాని కేమి? ఇప్పు డేమి చేయమందురు? అన

వారు:— అనుట కేమున్నది? ఏకాంతసౌఖ్యానుభూతితో ప్రొద్దు తెలియక మురియుచున్నావు. సమష్టి యానందానుభూతికన్న ఏకాంత భోగ మానందకరమా? రమ్ము మాతోబాటు కలసి కువలయాపీడనమును పీచమడచిన, ముష్టికాసుర, బాణాసుర సంహర్తను, మాయామానుష విగ్రహుని కీర్తింతము అనిరి. దాని కామె— వత్తునుగాని, నేనేనా రాని దానను? మిగిలిన వారందరు వచ్చినారా? అన

వారు:— వట్టిమాటలతోనే సరిపెట్టుచున్నావు గాని పడక విడచి లేచి రాకున్నావు? ఎవ్వరే నిన్ను రానీక యాపినది. ఎంత స్వార్థపరురాలవే! అందరూ వచ్చినారన్నను లేచిరాక కుంటి ప్రశ్నలు వేయుచున్నావు. మా మాటమీద నమ్మిక లేకున్న నీవే వచ్చి లెక్కించుకొనుము అని పిలిచిరి.

సమానధర్ములతో కలసి పంచుకొన్న సౌఖ్యమే ఆనందాతిరేకమును గల్గించును. "ఏకస్స్వాదు న భుంజీత" కొంచమైనను పంచి కుడువమేలు అనియు భగవత్కీర్తన స్మరణ ధ్యానానుసంధానములకు మించిన ఆనందవిషయము లేదనియు

"అంబుజోదర దివ్య పాదారవింద
చింతనామృతపాన విశేషమత్త
చిత్త మేరీతి నితరంబు జేరనేర్చు?" (పోతన)

అమృతరసమొల్కు నీదు పాదారవింద
మందు మది చేర్చి యెవ్వ డన్యంబు గోరు
తుమ్మెద మరందతుందిలతోయజాత
ముండ నుమ్మెత్తఁజూచునే యూరకైన"

అనియు దీని సారము.

అనువాదము:—

ఎందాఁక నిద్రింతువువే? లేతకీరమా!
వరవర్ణినులు మీరు దురుసు పల్కు
లాడఁబోకుం డిదే యరుగు దెంచితి నేను;
గట్టిదానవు; నీదు గడుసుమాట
లన్నిన్ను మే మెల్ల మున్నెఱుంగుదు
మఱివఁ మీరల దిట్ట నగుదుగాక
నేన: యేమందురు? నీవొక్కతే వేఱ
భోగసౌభాగ్యమ్ము పొందనేల?

అరుగుదేరుము వేగిర; మంద రరుగు
దెంచిరే? వచ్చి రేతెంచి యెంచికొనుము
మత్తమాతంగ సంహర్తమాయలాని
రమ్ము గీర్తింప దుర్దమారాతిఘాతి.

## 16 వ పాశురము

అవతారిక :—

ఇట్లు పది పాశురములతో కన్యలను లేపి, అందరును కలసి నంద నందనుని నగరికి చని, నగరి యారెకుని ద్వారపాలకుని ప్రవేశానుమతి నర్థించుచున్నారు.

పాశురము!—

నాయగనాయ్ నిన్ఱ నన్దగోపనుడైయ
కోయిల్ కాప్పానే కొడిత్తోన్ఱుమ్ తోరణ
వాశల్ కాప్పానే! మణిక్కదవమ్ తాళ్ తిరవాయ్
ఆయర్ శిరుమియరోముక్కు అఱై పఱై
మాయన్ మణివణ్ణన్ నెన్నలే వాయ్ నేర్న్దాన్
తూయోమాయ్ వన్దోమ్ తుయిలెళప్పాడువాన్
వాయాల్ మున్నమున్నమ్ మాత్తాదే అమ్మా! నీ
నేశ నిలైక్కదవమ్ నీక్కేలో రెంబావాయ్.

అర్థము:- నాయగనాయ్+నిన్ఱ=నాయకుడై నిలచిన, నన్దగోపనుడైయ-నందగోపునియొక్క, కోయిల్-ఆలయమునకు, కాప్పానే-కావరీ, కొడి-ధ్వజము, తోన్ఱుమ్-ప్రకాశించుచున్న, తోరణ వాశల్-తోరణపు వాకిలి, కాప్పానే-కావరీ, మణిక్కదవమ్=మణుల తలుపులయొక్క, తాళ్-తాళము, తిరవాయ్-తెరువుము, ఆయర్+శిఱుమియర్-గొల్లల చిరుతలమైన, ఓముక్కు-మాకు, మాయన్-విలక్షణ శక్తిగల, మణివణ్ణన్-మణివర్ణుడు, నెన్నల్+ఏ-నిన్ననే, అఱై పఱై-వాద్యమగు డక్క, వాయ్‌నేర్న్దాన్-ఇవ్వమాటిచ్చినాడు. తూయోమాయ్-పవిత్రలమై, తుయిల్+ఎళ-నిద్రలేచునట్లు, పాడువాన్-పాడువారమై, వన్దోమ్-వచ్చితిమి, అమ్మా-స్వామీ, మున్నమ్ మున్నమ్-మున్ముందుగా, వాయ్-నోటితో, మాత్తాదే-అడ్డు వెట్టకుము: నేశన్-నెయ్యము గల, నిలై=నెలవుయొక్క, కదవమ్-తలుపులను, నీ-నీవు, నీక్కు-తెరువుము.

తాత్పర్యము:— నందుడు నాయకుల కెల్ల నాయకుడు, అధిపతి. సామాన్యప్రజల మందిరములకంటె రాజప్రాసాదము విలక్షణము. వైభవోపేతముగనే యుండును. అది పెద్దనగరు. ఆ నగరి కొక ప్రాకారము. అది దాటినమీద ధ్వజస్తంభము. తోరణాలంకృత మహాద్వారమును. దానిని దాటిన కక్ష్యాంతరంబులుగల మహాభవనము. అందు ఆ [illegible] ములకు నా యా వ్యక్తులకు సుఖాసనమునకు స్నానాలంకార భోజన శయనాసనాదులకు అనుకూలములగు గదులుండును. ప్రాకారద్వారములకడ కావలి వారుందురు.

అనావృష్టి దోషము వారించుటకు గొల్లపెద్దలు కృష్ణనాయకత్వమున గొల్లపడుచులను వ్రతాచరణమునకు నియమించినారు. కృష్ణుని సాంగత్యము నిషేధించిన పెద్దలే ఈ పనికి నియమించుట కృష్ణ సాంగత్యాభిలాషిణులగు గోపికాకన్యలకు సంతోషావహము. వారు వేకువనే గుమిగూడి శుచిగా కృష్ణుని సేవ బయలుదేరినారు. ఆదిలోనే వారికి కావలివారు లోన ప్రవేశించుట కడ్డు దగిలినారు.

నందాలయ ప్రవేశమునకు మునుపింత నిర్బంధముండలేదు. పూతనాది రక్కసుల దాడి మొదలైనది మొదలు స్త్రీ రూపముననో పురుష రూపముననో, అశ్వగార్దభాది జంతురూపముననో, శకటాది అచేతన రూపముగనో రాత్రించరులు ప్రవేశించి బాలకృష్ణున కపాయము గల్గింతురని, లాతివారిని రానీయక నందుడు కావరులను నియమించి చండ శాసనము గావించినాడు.

అందునను కనుచూపు చక్కగా ఆనని గుడ్డివెన్నెల వేళలయందు ప్రతివ్యక్తినీ శంకించవలసి యున్నది. కావున నాలయ ప్రవేశము దుర్లభమే.

అందుననే కన్యలను ఎవ్వరు మీరు ? నిలుడని బయటి కావలి కావరి వారించుటకు మునుపే వారు "కోయిల్ కాప్పానే" అని సంబోధించినారు.

ఆతడు కోటవెలుపల నుండువాడుగాన పౌరులతో నిత్యపరిచితుడు. అది గొల్లపల్లె. పరిమితవ్రజ గలది. కృష్ణునితో గలసి నగరి పరిసరముల వీథులందు తోటలందు నెప్పుడు నాటలాడు పాటలపాడు కన్యలను చూడగనే గుర్తుపట్టి మనవారే యని లోనికి పోనిచ్చినాడు.

దానిని దాటగనే ధ్వజస్తంభము. అది గడవగనే మహాద్వారము. దానికి రత్నఖచితములైన తలుపులు గాఢముగా బిగింపబడి పలె కదిసి యున్నవి. దానికి తాళము వేయబడినది. చెవి కావరి మెడలన వ్రేలాడుచున్నది. వానికి వీరి పరిచయము లేదు. మొనటి వానివలె వీరిని సులభముగ లోనికి వదలునట్లు లేదు. కాన ప్రాధేయపడుచున్నారు.

"అమ్మా! తోరణవాశల్ కాప్పానే!
మణిక్కదవం తాళ్ తిఱవాయ్"

స్వామీ! మణి తలుపుల తాళముతీసి, లోనికి మమ్ము ప్రవేశింప నిమ్ము. తాళము దీసినా తలుపులను తీసికొనిపోవు సామర్థ్యములేని కన్నెలము. తలుపులు చాల దృఢమైనవి. ఆప్తమిత్రులవలె నొంటొంటి కదిసి యున్నవి. కాన "నేశనిలై క్కదవమ్ నీక్కు" నీవే తలుపులను త్రోయుము.

"మీ రెవ్వరో నే నెరుంగను. క్రొత్తవారికి ప్రవేశమివ్వ వీలులేదు" అనిన, అట్లనకుము మేము పరులముగాము. ఈ గొల్లపల్లె పిల్లలమే. మాయ మర్మములనెఱుంగని వారము. కృష్ణునితో ఆడిపాడినవారము. నిన్ననే కృష్ణుడు మమ్ము వేకువనే రండనినాడు. వ్రతార్థము పోవలయునని పెద్దలు నియమించినారు. వ్రతోపకరణముల నిత్తునని నిన్న చెప్పినాడు కృష్ణుడు. ఆతడాడి తప్పువాడు గాదు.

కృష్ణునికి సుప్రభాతము పాడి మేల్కొలుపవలయును. అందుకై పవిత్ర హృదయములతో శుచిగా స్నానమాడి వచ్చినారము. శీఘ్రముగా లోనికి ప్రవేశమీయవేని మాకును నీకును మాటవచ్చును. దయయుంచి తొట్టతొలుతనే అడ్డుమాటలాడి కార్యవిఘ్నము చేయక ప్రవేశమిమ్ము.

పరమార్థము:— భక్తుడు భగవత్సన్నిధికి ఆచార్య పురుషకారము తోడనే పోవలెను. పోవునప్పుడు వీడు భాగవతుడు అను నమ్మిక గల్గునట్లు సముచిత వేషభాషలతో పోవలెను. ఆ వేషభాషలు విష్ణుదానత్వము ప్రస్ఫురింప జేయవలెను. అది యెట్లన్న?

యే కంఠలగ్నతులసీనలినాక్షమాలాః
యే బాహుమూలపరిచిహ్నితశంఖచక్రాః,
యే వా లలాటఫలకే లసదూర్ధ్వపుండ్రాః
తే వైష్ణవా భువన మాశు పవిత్రయన్తి.

విష్ణువాసత్వము వెల్లడిసేయునవి అలాంటి స్థలముల ద్వాదశోర్ధ్వ పుండ్రములు, తప్త శంఖ చక్రలాంఛనములు, కటీతటీ ఘటితోత్త రీయములను, పురుషులకు, స్త్రీలకు, ఊర్ధ్వపుండ్ర లలాటతిలకము. శంఖ చక్ర లాంఛనములు. నోట లక్ష్మీనారాయణ స్తోత్రములును.

ఇవి బాహ్యవేషములు మాత్రమే. సామాన్య దృష్టిగోచరములు. భగవంతు డంతశ్శుద్ధిని ముఖ్యముగ గమనించును. వరులయెడ అసూయ లేమి, పరదోషపహనము, కలుపుగోలుతనము, వరుల సౌభాగ్యమును చూచి యానందించుట, స్మితపూర్వభాషణము, పరక్షేమాకాంక్ష, ఇంద్రియ నిగ్రహము, లౌకికసుఖములయందు వైరాగ్యము, వరుల దూషింప కుండుట, వరోపకారము, కృతజ్ఞత ఇత్యాదు లంతశ్శుద్ధి లక్షణములు.

'తూయోమాయ్ వన్దోమ్' అని బాహ్యాన్తశ్శుద్ధిగల్గి కావలివారి యనుగ్రహముతో కన్యలు ప్రవేశించినట్లు ఆచార్య పురుషకారముతో పరమాత్మ సన్నిధికి చేరవలయును.

అట్టివారి కోరికలదీర్ప భగవంతుడు "నెన్నలే వాయ్‌నేర్న్దాన్" అన్నటుల నిన్ననేగాదు, ఏనాడో మాట యిచ్చినాడు.

"మీరు నిర్మల మనస్సుతో నన్ను సేవింపుడు అదెంత అందరాని కోరికయైనను, దానిని నేను తీర్చెదను" అని మాటయిచ్చినాడు. మన వంతు పని మనము నెరవేర్చిన, జాతి కుల లింగ వివక్షణ లేకుండ అత డాశ్రితుల సంరక్షణ మను తనవంతు పని తప్పక నెరవేర్చును.

"రామో ద్విర్నాభిభాషతే" రాముడు రెండు మాటలవాడు గాదు. తనకు కష్టమైనను సైచి తండ్రిని సత్యవాదిగా జేయుటకు అడవుల పాలైనాడు. ఆ నాడి తప్పునే?

"ఇంతి పుమాంసుడంచు, మది
వృద్ధుఁడు బాలుఁడునంచు, మర్త్యుఁడుకా
జంతువునంచు, లెక్కిడక సర్వు
ల కే నభయంబు నిత్తు నా

వంతది "సర్వథా శరణ
వర్జితుఁడన్ నను గావు" మంట నీ
వంతని యుంట నీ యెదుట
వాంఛ వచించితి చెన్నకేశవా!

(నా కేశవప్రవత్తి)

అనువాదము:

మహనీయ! నందుని మాళిగ కావరీ!
ధ్వజపటాలంకృత ద్వారపాల!
గొల్లపిల్లలము; గైకొనుము వందనము, ర
త్న ఖచిత ద్వారబంధనము తెరువు
మణివర్ణుఁడౌ మాయి మాట యిచ్చెను నిన్న
మాకు డక్కయొసంగ మాన్యచరిత!
పరిశుద్ధతరలమై యరుగుదెంచితి మయ్య!
నిద్దుర లేపను నీలవర్ణు
తొట్టతొలుతనె మము నడ్డుపెట్టి మాట
లాడబోకుము; కదిసిన యరరములను
నీవ నీచేత విఘటించి, బోవనిమ్ము
మమ్ము లోనికి సుప్రభాతమ్ముఁ బాడ.

## 17 వ పాశురము

అవ:—లోనికేగిన కన్నెలు నందాదుల మేల్కొలుపుచున్నారు.

పాశురము:—

అంబరమే తణ్ణీరే శోఱే అఱమ్ శెయ్యుమ్
ఎంబెరుమాన్ నందగోపాలా ఎళున్దిరాయ్
కొంబనార్కెల్లామ్ కొళున్దే కులవిళక్కే
ఎంబెరుమాట్టి యశోదాయ్ అఱివుఱాయ్

అంబరమూడఱుత్తోఙ్గి యులగళంద
ఉంబర్ కోమానే ఉఱఙ్గాదెళున్దిరాయ్
శెమ్‌పొఱ్కళల డిచ్చెల్వా! బలదేవా!
ఉంబియుమ్ నీయుమ్ ఉఱఙ్గేలో రెంబావాయ్.

పాశురార్థము:—

అంబరమే=వస్త్రమును, తణ్ణీరే-చల్లనినీటిని, శోఱే-అన్నమును, అఱమ్+శెయ్యుమ్-దానముచేయు, ఎంబెరుమాణ్-యజమానియైన, నందగోపాలా-నందగోపాలుడా! ఎళుందిరాయ్-మేల్కొనుము, కొంబు+అనార్కు+ఎల్లామ్-ప్రబ్బలివంటి స్త్రీలకు అందరికి, కొళున్దే=చిగురువలె ముండుదాన! కులవిళక్కే-వంశప్రకాశక ప్రదీపమా! ఎంబెరుమాట్టి=యజమానురాలా! యశోదా-యశోదా! అఱివుఱాయ్-మేల్కొనుము. అమ్బరమ్-ఆకాశముయొక్క, ఊడు-మధ్యభాగమును, అఱుత్తు-చీల్చి, ఓఙ్గి-పొంగి, ఉలహు-లోకమును, అళన్ద-కొలచిన, ఉమ్బర్+కోమానే-దేవతల కధిపతీ, ఉఱఙ్గాదే=నిద్రింపక, ఎళున్దిరాయ్-లెమ్ము. శెమ్+పొన్ కళల్-ఎర్రని బంగారు కడియముగల, అడి-అడుగుల, చెల్వా!-అందము గలవాడా! బలదేవా=బలదేవుడా! ఉమ్బియుమ్-తమ్ముడును, నీయుమ్=నీవును, ఉరఙ్గేల్-నిద్రింపకుడు.

తాత్పర్యము!— నగరిలోని కేగిన కన్యలు లోనివారిని లేపుచున్నారు. తొలుత యజమాని నందుని మేల్కొలుపుచున్నారు. అతడు కట్టుగుడ్డలు తిండి తీర్థములు దానము చేయు ధర్మాత్ముడు. దప్పి గొన్నవారికి చల్లని నీరు పోయు చలిపందిరులు పెట్టింతురు ధర్మాత్ములు. ఆకలిగొన్నవారి కన్నసత్రము లుంతురు. తిండి నీరు ప్రాణాధారములు.

అవశ్య పదార్థములు వస్తువులు దానము చేసిన అవి దుర్వినియోగపడు నవకాశమున్నది. అన్నపానీయము లటుగాదు. ఎవ్వడైనను కడుపునకు మించి తినలేడు. రేపటికి మాపటికి దాచియుంచు వస్తువుగాదు. అన్నము తాను తిని ఎక్కువైన పారవేసిన ఏ ప్రాణియైనను తినిపోవును. ధనమిచ్చి చాలనిపించలేము. అన్నము చాల్చాలనునట్లు పెట్టవచ్చును.

అట్టి అన్నదానము జలదానము చేయు మహానుభావుడు నంద గోపుడు.

ఇతర ప్రాణికి లేని మానసంరక్షక వస్త్రము మానవజాతికి ప్రధానము. అన్నపానములకంటే ముఖ్యము. అన్నము లేక కొంతకాల ముండవచ్చును గాని వస్త్రము లేకుండ నుండజాలము. అట్టి ముఖ్య వస్తువుల నుదారముగా పాత్రోచితముగ దానము చేయు ధర్మాత్మ దాతడు.

అట్టి మహానుభావా! నందగోపాలా! లెమ్ము అనుచున్నారు. దేవతలుగూడ స్తోత్రప్రియులు. కావుననే దేవతాస్తుతి రూపముగా వేద ములు వెలయుచున్నవి.

తమ కార్యము నెరవేరవలయునన్న పొగడవలెను. ఎదుటి వాడెంత కఠినచిత్తుడైనను పొగిడింపులచే మెత్తబడును. అందునను నందుడు కొడుకుపై ప్రేమాభిమానములు గలవాడు. అతని నిద్రా భంగము సైపజాలడు. అతని నే పిశాచి, ఏ రక్కసి, ఏ రూపున వచ్చి అపాయము గల్గించునో అని అతని దగ్గరనే పండుకొని యున్నాడు. చీమ చిటుక్కుమన్న లేచి దండించగలడు: కావున తొలుతనే కృష్ణుని లేపిన, అడుగుల సడికే లేచి ఎక్కడ తరిమివేయునో యని తొలుత నందుని యనుమతి పొందిన బాధకము లేదని అతనినే లేపుచున్నారు.

"నన్దగోపాలా ఎళున్దిరాయ్" అని ఊరకే లేపుటకన్న ఆయన గొప్ప దనమును శ్లాఘించిన, మనసు మెత్తనై తమ కోరిక నిరాకరింపడు అని ఓ ధర్మాత్ముడా! అన్నారు.

జీవనాధారములైన అన్న వస్త్రపానీయముల నార్తులకిచ్చువాడవు. అపరిచితులకే దానమిచ్చు నీవు, పరిచితలు మీవారమునైన మాకోర్కి నిరాకరింతువా? నీవు గోపాలుడవు. మేమును గోపాల బాలికలము. పని వారలగు మా కోర్కి నివారింపకుము.

విశ్వామిత్రుడు రాముని అర్థించినాడు. తొలుత దశరథుడు రాము నీయ నిరాకరించినాడు. పిదప కౌసల్య ప్రోత్సాహముచే దానమునకు సమ్మతించినాడు. స్త్రీలు దయాస్వరూపిణులుగదా!

కావున నందుని మేల్కొలిపియు నాతడు పలుక కున్నందున, గోప కన్యలు యశోదను లేపుచున్నారు.

"కొమ్బనార్కెల్లామ్ కులవిళక్కే! ఎమ్బెరుమాట్టి యశోదాయ్ అఱివురాయ్" అమ్మా యశోదమ్మతల్లీ! నీవైనా లేవవమ్మా కృష్ణ స్వామిని, నీవు కులానికంతయు మంగళదీపమై వెలుగునిచ్చుదానవు. వెలుగేమి? జ్ఞానానందముల నను గ్రహించు కృష్ణపరమాత్మనే అను గ్రహించిన దానవు. కృష్ణుడు నీకు కుమారుడే కాని, నీ యొక్కడానివాడే గాదు. లోకోద్ధరణ కవతరించిన పరమాత్మ. అందరికిని సంబంధించిన వానిని స్వీయానందమునకు ప్రత్యేకించి యుంచుకొనుట మీ బోటి యుదారు లకు సమంజసముగాదు గదా! నీవు "ఎంబెరుమాట్టివి" మాకు యజమాను రాలివి. దాసీల కాంక్ష నీవుగాక మరెవ్వరు తీర్చగలరు? తల్లీ నీవు లేచి స్వామిని లేవవమ్మా!

అని ఆమెను లేపి స్వామికి సుప్రభాతము కొలువు చేయుచున్నారు.

"ఉంబర్ కోమానే ఉఱఙ్గాదెళున్దిరాయ్" దేవతల కధిపతివైన మహామహావా! నీ భక్తులు శరణాగతులైన దేవతల కెవ్వా దేమి కీడు మూడినా, ఆదుకొను వాడవు నీవే గదా! హిరణ్యాక్ష హిరణ్యకశిపుల బాధల కోర్వజాలని దేవతలను బాలింప, కాలానుకూలముగ వరాహజన్మ మెత్తుటకు సింగంపురూపు దాల్చుటకు వెనుదీయనివాడవు గదా! శ్రియః పతివై యుండి గూడ, విరాడ్రూపుడవైన నీవు, దానమునకునై నీ మహా స్వరూపమును కుంచించుకొని, ఎంత ఉన్నతుడవో అంత అణగి మణగి పోయితివి. "దేహీతి వచనం కష్టం, నాస్తీతి వచనం తతః" దానముడు గుటే నీచకార్యము, నీ చేయి ఒక్కని చేతికిౕందకు చాచవలసిన దౌర్భాగ్యమునకు గూడ పాల్పడితివే; అది సామాన్యహస్తమా?

"అదిగో శ్రీసతి కొప్పుపై తనువుపై నంసోత్తరీయంబుపై పాదాబ్జంబులపై కపోలతటిపై పాలిండ్లపై నూత్నమర్యాదం జెందు కరంబు" గదా!

అట్టి తిరుకైక్క క్రిందగుట నీ దయామయత్వమును చాటుచున్నది. నీవు దేహియని కేలుసాచినంతనే,

వరచేలంబులో మాడలో ఫలములో
వస్త్రంబులో గోవులో
హయలో రత్నములో శకటంబులో
విశిష్టార్థంబులో కన్యలో
కరులో కాంచనమో నికేతనములో
గ్రామంబులో భూములో
ధరణీఖండమో కాక యేమడిగెదో
ధాత్రీసురేంద్రోత్తమా!

అన్న దాతకు,

ఒంటివాఁడ నాకు నొకటి రెండడుగుల
మేర యిమ్ము, సొమ్ము మేఁగ నొల్లఁ
గోర్కెదీర బ్రహ్మకూఁకటి ముట్టెద
దానకుతుకసాంద్ర! దానవేంద్ర!

అనిన కపట వటువునకు

అన్నమాటలెల్ల నొప్పును విప్రఘంద
సత్యగతులు వృద్ధ సమ్మతంబు
లడుగఁదలఁచి కొంచెమడిగితివో చెల్ల
దాత పెంపు సొంపుఁ దలఁపవలదె?

అనిన, గృహమేధికి, చిఱునగవు మొలకెత్త నిట్లనియె.

గొడుగో జన్నిదమో కమండలువొ
నాకున్ ముంజియో దండమో
వడుగే నెక్కడ భూము లెక్కడ
కరుల్ వామాక్షు లశ్వంబు లె
క్కడ నిత్యోచితకర్మ మెక్కడ
మదాకాంక్షా ఫలితంబైన మూఁ
డడుగుల్ మేరయ త్రోవ నిచ్చుటయె
బ్రహ్మాండంబు నా పాలికిన్.

అని అల్ప సంతోషిత్వము చూపించి మూడడుగులే చాలునంటివే.

మంత్రశ్లోకముల నడుగక మూడడుగు లడిగిన నీ మాటలు విని దేవత లెంత నిరాశులై పోయిరో గదా! నీ తత్త్వము వారి కేమి దెలుసు!

శిష్య సౌభాగ్య మాసించిన శుక్రాచార్యులకే గాని ఇతరుల కర్థమైనదా!

"దనుజేంద్ర! యీతఁడు ధరణీసురుఁడు గాఁడు
దేవకార్యంబు సాధించు కొఱకు
హరి విష్ణుఁ డవ్యయుం డదితిగర్భంబునఁ
గశ్యపసూనుఁడై గలిగె నకట!
యెఱుఁగక కీతని కోర్కి నిచ్చెద నంటివి
దైత్యసంతతి కుపద్రవము వచ్చు
నీ లక్ష్మితేజంబు నెలవు నైశ్వర్యంబు
వంచించి యిచ్చు దా వాసవునకు

మొనసి జగములెల్ల మూఁడుపాదంబుల
నఖిల కాయుఁడగుచు నాక్రమించు
సర్వధనము విష్ణుసంసర్పనము చేసి
బడుగు వడిగి యెట్లు బ్రదికెదీవు?

దేవకార్యార్థమైవచ్చిన విష్ణువేగాని యన్యుడుగాడు. నిన్ను బికారి సేయును. ఈ దాన మీవలదు. ఇది ధర్మవిరుద్ధము అని చెప్పిన శుక్రాచార్యుల హితోపదేశంబు ననుమతింపక,

నిరయంబైన నిబంధమైన
ధరణీ నిర్మూలనంబైన దు
ర్మరణంబైనఁ గులాంతమైన
నిజమున్ రానిమ్ము కానిమ్ము పో

హరుఁడైన హరియైన నీరజ
　　భవుం డభ్యాగతుండైన నౌఁ
దిరుగన్నేరదు నాదు జిహ్వ
　　వినుమా ధీవర్య! వేయేటికిన్.

మేరువు తలక్రిందైనను
బారావారంబు లింకఁ బాఱిన లోలో
ధారుణి రజమై పోయినఁ
దారాధ్వము బద్ధమైనఁ దప్పక యిత్తున్.

అన్న సత్యసంధుడగు బలివంటి దాత లేడు.

ఆశ్రితరక్షాదక్షుడై శరీరము పెంచి అధోలోకమును ఊర్ధ్వలోకమును రెండడుగుల గొలిచి పుచ్చుకొన్న నీవంటి ప్రతిగృహీతయు న భూతో న భవిష్యతి.

అట్టి దీనశరణ్యా! ఈ దీనులకోర్కె మన్నింప నిద్ర లెమ్ము.

చిన్నవాడు మేల్కొన్న, అతనికి వయసున పెద్దవాడవు—

నివాస శయ్యాసన పాదుకాంశుకో
పధాన వర్షాతపవారణాదిభిః,
శరీరభేదైస్తవ శేషతాంగతైః
యథోచితం శేష ఇతీర్యతే జనైః.

(స్తోత్రరత్నము)

వాసపాదుక వసన శయ్యాసనోప
బర్హ పర్యంక వర్షాత పత్రములుగ
నుపకరించుచు నీకు యథోచితముగ
కొలువు సలిపెడి యా వేయితలల తేడు.

(నా యతిరాజీయము)

అన్నల్లాతనికి శేషభూతుడవైన బలదేవా! సాక్షాత్ బలదేవుడవే! నీ నాగటితో హస్తినానగరమునే యమునతో గలువ పెల్లగించితివే! నీ బలమింతటిదని.

"శెమ్బొఱ్కళ ణడిచ్చెల్వా" నీ కాలి బంగారు గండపెండేరమే తెల్పుచున్నది. అట్టి నీవు నిద్రింతువా! నీవునూ లెమ్ము. అర్థమైన కార్యములలో తమ్మునికి తోడుగా నుండవలదా! అని లేపుచున్నారు.

అనువాదము :—

కడుపున కన్నంబు, మడువులు గట్టను,
 త్రావ నీరము నిచ్చు దానశౌండ!
మా రాజ! నిదుర లెమ్మా నందగోపాల
 కోమలాంగులలోన, గొమిరెమిన్న!
మా కులదీపమా మా స్వామి నీ యశో
 దా దేవి! సుప్రభాతమ్ము లెమ్ము
నింగదూసుచు పొంగ నంగమ్ము పెంచి లో
 కాలు గొల్చిన వగకాడ! మింటి

త్రిమ్మరీడుల యొకిమీడ! దేవకీ కు
మార! మేల్కొనుమయ్యా! బంగారుగండ
పెండెరము కాలవాడ! తమ్ముండు నీవు
మేలుకొనుమయ్యా! బలదేవ! మేలుకొనుము.

## 18 వ పాశురము

అవ:— "నీళాతుంగ స్తనగిరితటీ సుప్తం" అన్నట్లు, నీలాదేవి కౌగిట సుఖనిద్ర జెందిన కృష్ణస్వామికిని, అప్పిన్నపిరాట్టి పురుష కారము లేనిదే ప్రబోధింప సాధ్యముగాదని యామెను లేపుచున్నారు.

ఉన్దుమదకళిట్రి నోడాదతోళ్వలియణ్
నన్దగోపణ్ మరుమగళే నప్పిన్నాయ్.
కన్దమ్ కమషుం కుషలీ కదై తిరవాయ్
వన్దెఙ్గుమ్‌కోళి అళైత్తనకాణ్ మాతవి
ప్పన్దల్ మేల్ పల్‌కాల్ కుయిలినఙ్గళ్‌కూవిన కాణ్
పన్దార్ విరలి ఉణ్ మైత్తునణ్ పేర్పాడ
శెన్దామరై క్కైయాల్ శీరార్ వళై యొలిప్ప
వన్దు తిరవాయ్ మహిషిం దేలో రెమ్బావాయ్.

అర్థము :– ఉన్దు–త్రోసివేయబడిన, మద–మదముగల, కళిట్రన్–కరులవంటి, ఓడాద–వెనక్కుపారని, (జంకని) తోళ్–భుజములయొక్క, వలియణ్–బలముగల; నన్దగోపణ్–నన్దగోపుని, మరుమగళే=మేన కోడలా! కన్దమ్–గంధము (సువాసన), కమషుమ్–ప్రసరింపచేయు, కుషలి–కురులదానా! నప్పిన్నాయ్–నిలాదేవీ, వన్దు–వచ్చి, ఎఙ్గుమ్–అంతట, కోళి–కోడి, అళైత్తన–అరచుచున్నది. మాతవి+పన్దల్ మేల్+గురివింద పందిరిమీద, కుయిల్+ఇనఙ్గల్–కోకిల గుంపులు, పల్+కాల్=వలుకాలములు, కూవిన–కూయుచున్నవి. కాణ్–కనుము. పన్దార్–బంతిగల, విరలి=వేళ్ళదానా! ఉణ్+మైత్తునణ్=నీ మేనమామ కొడుకుయొక్క, పేర్=పేరు, పాడ–కీర్తించుటకు, మహిషిన్దు–వంత సించి, వన్దు–వచ్చి, శెణ్+తామరై+కై యాల్–కెందామరల వంటి చేతులతో, శీరార్–అందమైన, వళై–గాజులు, ఒలిప్ప=ఒలియగా (శబ్దింపగా), తిరవాయ్=(తలుపు) తెరువుము.

తాత్పర్యము :— నీళాదేవి కృష్ణుని మేనమామ కూతురు. పోత రించిన కుర్రలను నిగ్రహించి, వీర్యశుల్కముగా, ఈ చిన్నపిరాట్టిని వివాహమాడినాడు కృష్ణుడు. ఆమె బాహుపరిరంభమున సుఖనిద్ర జెందిన కృష్ణుని వెలికి రప్పింపవలయుననిన, తొలుత నామె బాహు బంధములనుండి విడిపించవలయును. అది పెరవారికి సాధ్యమా! ఆమె దయదలచినగాని యీ కార్యము నెరవేరదు కావున నామెను లేపు చున్నారు.

మదపుటెద్దుల జయింపగల బాహుబలశాలియగు నందగోపుని కోడలా! తండ్రిసొత్తు కొమరునికి సంక్రమించుట సహజము. అతని భుజబలము కుమారునికి వచ్చినది. చిన్నతనముననే ఎవ్వరి యదుపునకు లొంగని క్రొవ్వెక్కి విచ్చలవిడి దిరుగుచు వీధిని బోవువారికి భయము గొలుప కోడెలను పట్టి, నిలబెట్టి, దానికి పందెముగ నీళను గ్రహించినాడు.

అట్టి జగజెట్టినిగూడ తామరకాడలవంటి బాహువులతోనే బంధించిన దానా! మాపై నీ దయదలచి ని బాహుబంధవమును సడలించి ప్రియుని నిద్రనుండి లేవవమ్మా! అని హెచ్చరించినారు. అందుకునూ ఆమె పలుకలేదు చలించుటవల్ల గాటోలు పూలుముడిచిన కొప్పు కమ్మతావులు వెలికి ప్రసరించినవి.

"కందం కమషుం కుషలీ కద్రై తిరవాయ్"

అమ్మా నప్పిన్నపిరాట్టి! నీవు పలుక కున్న, నీవులేవని తలంతు రని యనుకొంటి వేమో, నీ కబరీభర పరిమళములు గదిపట్టజాలక కిటికీల గుండావెలికి ప్రసరించుచు నీ మేలుకువను దెలుపుచున్నవి, లెమ్ము. ఎంతవరకు నీ ఏకాంత భాగ్యానుభూతి.

ఒక్కటిగాదు. ఒక్కచోటగాదు. ఎఙ్గుమ్‌కాణ్ – ఎల్లెడల చూచినా కోళ్ళు కూయుచున్నవి. నీవు పెంచిన కోయిలలు గూడ అప్పుడేలేచి నీ రాక కేకారుచు, రొదసేయుచున్నవి. గురివిందపందిరిపై నెక్కి, కుహూగానముల నాహ్వానించుచున్నవి. ఎంత ప్రొద్దెక్కినది! ఇది నిద్ర సమయము గాదు. ప్రియునితోబాటు జెండాడి అలసి నిద్రించితివేమో.

ఇప్పటికైనా లేచివచ్చి నీ కెందామరలవంటి చేతులతో గాజులు గలగల మన తలుపుదీయవమ్మా, నీ ప్రియుని కీర్తింప వచ్చిన కన్నెలపై దయజూపవమ్మా యని అర్థించినారు.

విశేషార్థము:— పిరాట్టిని మున్నిడుకొనియే స్వామిని దరియ వలయును. సీతమ దప్పుచేసికొన్న చుప్పనాతి కేవల రాముని దయకు పాత్రము గాలేదు. సీత కాళ్ళపై బడిన కాకాసురుడు ద్రోహియైనను రక్షితుడయ్యెను. కాన భగవంతు నొక్కనినే ఆశ్రయింపక భగవతీ సహితునే ఆశ్రయింపవలెను.

ఒక్క సీతనే గ్రహించిన రావణుడు శ్రీ రామచంద్రునిపై ద్వేషబుద్ధి గలవాడు గాన, నారాయణాభిమతానురూప స్వరూప గుణవిభవైశ్వర్య శీల గమక, సీత వానిని కరుణించనందున నశించినాడు.

ఉభయులయెడ గౌరవాదరములు గల విభీషణుడు సమస్తసంప దల బొందగల్గినాడు.

కావుననే శరణాగతి గద్యయందు భాష్యకారులు తొలుదొల్త భగవతి శ్రీదేవిని నిఖిలజగన్మాతను శరణుజొచ్చి తత్పురస్కారముతో భగవదనుగ్రహమునకు పాత్రులైనారు.

జీవులును ఆ విధముగ శ్రీమన్నారాయణచరణములను శరణు జొచ్చి ఆనన్దానన్దమును బొందవలయును.

అనువాదము:—

మదపుటేన్గుల గముల్ మర్దింపఁజాలిన
అర్గళ దీర్ఘబాహా విలాసు
శ్రీ నన్దగోపుని మేనగోడల సోగ
నిగుల వలపుల నెఱులదాన
నీలాసతీదేవిః కోలాహలముసేయు
కొక్కురోకో యంచు కోళ్ళగుంపు
గురివిందపందిరి కొననెక్కి కుహుకుహూ
కుహూయంచు కోయిలల్ గూయఁదొడఁగె

కందుకమునాడి యలసిన కన్నెమిన్న
నిదుర లేలెమ్ము కీర్తింప నీదుప్రియుని
తలుపుదీయుము కెందామరలను బోలు
కరతలమ్ముల నులియంగఁ గంకణములు.

## 19 వ పాశురము

అవ:— నీలాకృష్ణుల నిద్దరినీ నిద్రలేపు చున్నారు.

కుత్తువిళక్కెరియ క్కోట్టుక్కాల్ కట్టిల్ మేల్
మెత్తెన్ఱపఞ్చశయనత్తిన్ మేలేరి
కొత్తలర్ పూఙ్గుఴల్ నప్పిన్నై కొంగై మేల్
వైత్తుక్కిడన్ద మలర్ మార్పా నీ వాయ్ తిఱవాయ్
మైత్తడంకణ్ణినాయ్ నీయున్ మణాళనై
ఎత్తనై పోదుమ్ తుయిలెఴవొట్టాయ్‌కాణ్
ఎత్తనై యేలుమ్ పిరివాత్రి హిల్లాయాల్
తత్తువమన్ఱు తగవేలో రెమ్బావాయ్.

అర్థము:— కుత్తువిళక్కు= స్తంభదీపములు, ఎరియ=వెలుగగా; కొట్టుకాల్=దంతపుకాళ్ళుగల, కట్టిల్ మేల్=మంచముపైన, మెత్తెన్ఱ= మెత్తని, పంచశయనత్తిన్=ఐదుగుణములు (అందము, మార్దవము, పరిమళము, శైత్యము, శుభ్రత)గల పరుపుపైన, ఏరి=ఎక్కి, కొత్తు+అలర్=గుత్తులైన, వికసించిన, పూ=పూలుగల, కుఴల్=కురులు గల, నప్పిన్నై+కొంగై+మేల్=నీలా స్తనములపైన, వైత్తు=వైచి, కిడంద=పండిన, మలర్=విశాలమైన, మార్పా=వక్షస్థ్సలమువాడా! వాయ్=నోరు, తిఱవాయ్=తెరువుము (మాటాడుము).

మై+త్తడం=కాటుక తడవిన, కణ్ణినాయ్=కన్నులదానా! నీ= నీవు, ఉన్+మణాళనై=నీ భర్తను, ఎత్తనై+పోదుమ్=ఎంత ప్రొద్దు, తుయిల్=నిద్దుర, ఎఴవొట్టాయ్=లేపుటను ఒప్పవు, ఎత్తనై యేలుమ్= ఎంత క్షణకాలమైనను, పిరివు=ఎడబాటును, ఆత్రహిల్లాయ్=సైపజాలవు. ఆల్=అహా, తత్తువం=నిజము, తహవు=తగవు, అన్ఱు=కాదు.

తాత్పర్యము:— దీప స్తంభములు ప్రకాశించుచుండగా నేన్గు దంతముల కోళ్ళ మంచముపై, మెత్తదనము చల్లదనముచే స్పర్శ సుఖమై నిర్మలతా సౌందర్యములచే, కంటికింపై, సువాసనలచే, ఘాణ

తృప్తికరమైన పాన్పుపై నెక్కి, కమ్మవిరిశావుల వెదజల్లు, నెరినొగ కురులుగల నీలాదేవి పీవర స్తనకుంభములంపైన విశాలవక్షస్థ్సలము మోప వవ్వళించిన సామీ! మా మొరాలించి మాటాడరాదా?

అని యా స్వామిని హెచ్చరించియు, నప్పిన్నపిరాట్టి యనుమతింవనిదే స్వామి బదులాడడని, యామెను లేపు చున్నారు. తల్లీ కాటుక కంటి నీలాసతీ, ప్రియుని బిగి కౌగిలించుకొని వదలకున్నావు. వడకవీడి వెలికి ప్రియుడేగిన క్షణమైనను విరహము భరింపలేవా? ఇది నీకు తగదు. నీ వలెనే భగవానుని యనుభూతికి నెందరో వేచియున్నారు. వారికిని కొంత భగవత్సంభాషణామోదమును సేవాసౌభాగ్యమును గల్గనిమ్ము. బిగికౌగిలి కొంత సడలించి యాతని వెలికి రానిమ్ము.

విశేషార్థము:—"భగవంతుని అంతరంగికుల పురుషకారము లేనిదే స్వామి సన్నిధి లభించుట కష్టము" అని నీళాసతిని ఆవర్ణముగ గ్రహించి జీవకోటి వైకుంఠమున సౌకుమార్య సౌగంధ్య సుఖస్పర్శములు గల శేషతల్పముపై పవళించిన భగవానుని సేవాసౌభాగ్యమును పొందుట యను సాయుజ్యముక్తిని పొందుటే మానవజన్మ ప్రయోజనము అని.

భగవంతునితో ఎడబాటు క్షణికమైనను సహింపలేనంతటి పరమ భక్తి సాధింపవలయుననియు గ్రహింపవలయును.

ఆనందానుభూతితో పంచి కుడుచుట—అనగా నలుగురితో కలసి అనుభవించుట—మధురతరమనియు అవగతమగుచున్నది.

అదియునుగాక, భక్తుడనన్యాపేక్షుడై భగవచ్చరణారవిందైక శరణ్యుడై ప్రసన్నుడై భగవదనుకూలకార్యములే యొనర్చుచు తా జేయు కార్యమేదైనను—

"యత్కరోషి యదశ్నాసి
యజ్జుహోషి దదాసి యత్,
యత్తపస్యసి కౌన్తేయ
తత్కురుష్వ మదర్పణమ్." గీత

అన్నట్లు చేయుపని, తినుతిండి, హెూతముచేయు హవిస్సు, తపించు తపము, సర్వము భగవత్ప్రీతిగా చేయవలయును. చేసిన కర్మఫలము నిస్సంగుడై భగవదర్పణమని ధారవోయవలయును. అట్లు చేసిన:—

"స్వేస్వే కర్మణ్యభిరత
స్సంసిద్ధిం లభతే పరామ్"- గీత

భగవంతునిచే వేదశాస్త్రమూలముగా విహితమైన వ్యకులాశ్రమానుగుణమైన యే పనియైనను, భగవదారాధన యను బుద్ధితో చేసిన,

"స్వకర్మణా తమభ్యర్చ్య
సిద్ధిం విందతి మానవః". గీత

అన్నట్లు దానిలోనే కర్మబంధములు తొలగి ముక్తిని బడయగలడు.

ఆ స్వకర్మము దోషభూయిష్ఠమైనను దానిని వదలరాదు. దోషశూన్యమని పరకర్మకు పోరాదు.

శ్రేయాన్ స్వధర్మో విగుణః
పరధర్మా త్స్వనుష్ఠితాత్,
స్వభావనియతం కర్మ
కుర్వన్నాప్నోతి కిల్బిషమ్.
సహజం కర్మ కౌన్తేయ
సదోషమపి న త్యజేత్. గీత

పరులకు విధింపబడిన కార్యము దోషరహితమైనను దానికన్న దోషభూష్ఠమయినను స్వకర్మమే ఉత్తమము, ఏలన,

"సర్వారంభా హి దోషేణ
ధూమేనాగ్ని రివావృతాః".

ప్రతికార్యమునందు అంతో ఇంతో దోసముండకపోదు. కాన వ్యకులాశ్రమరూపకార్యము భగవదాజ్ఞ యనీ అదిచేసిన భగవంతుడు ప్రసన్నుడగుననీ ఫలాపేక్ష లేక ఒనర్పవలయును.

అట్లీకళామడై భగవంతుని భజించిన ఆ భగవానుడు శ్రీకాంతా కేళీలోలుడై యున్నను, భక్తుని కాపాడుటకు వెనుదీయక హుటాహుటి పరతెంచును. అందుకు గజేంద్రమోక్షణమే నిదర్శనము అనియు గ్రహింపవలయును.

అనువాదము:—

కంబాల దీపాలు కాంతులీనగ దంత
　　పల్యంకమున మేలి పాన్పుమీఁద
నిర్హారిగంధవన్నిత్య నూతన సుమ
　　గుచ్ఛశోభిత నీలకుంత లాఢ్య
పీవరోరోజ నప్పిన్నపిరాట్టి కు
　　చ ద్వయీలీన విశాలవక్షః
నీవేని పల్కరాదా వాయి యురవిచ్చి ?
　　కాటుకదిద్దిన కంటిదానః

వల్లభుని నొక్కక్షణమైన వడక విడచి
వెడల నీయవె? విగడియ విరహమేని
తాళలే వింత స్వార్థము తగునె? పూరు
షోత్తముని నీ వొకర్తుక గుత్తగొంటె!

## 20 వ పాశురము

అవ:— ఈ పాశురమునను నీలా కృష్ణుల నిరువురిని మేల్కొల్పు చున్నారు.

ముప్పత్తు మూవరమరర్కుమున్ శెన్ఱు
కప్పం తవిర్కుం కలియే తుయి లెళాయ్
శెప్పముడై యాయ్ తిఱలుడై యాయ్ శత్రార్కు
వెప్పమ్‌కొడుక్కుమ్ విమలా తుయిలెళాయ్

శెప్పన్న మెన్ముల్తై చ్చెవ్వాయ్ చ్చిరుమరుజ్గుళ్
నప్పిన్నైనజ్గాయ్ తిరువే తుయిలెళాయ్
ఉక్కముమ్ తట్టొళియుమ్ తన్దున్ మణాళనై
ఇప్పోదే యెమ్మై నీరాట్టేలో రెమ్బావాయ్.

అర్థము:— ముప్పత్తు మూవర్-ముప్పదిమూడు (కోట్ల) అమర ర్కుమ్-దేవతలకు, కప్పం-కంపమును, తవిర్క్కుమ్-తొలగించుటకు, కలియే-సమర్థుడా, తుయిల్+ఎళాయ్-నిద్రలెమ్ము, శెప్పమ్-ఆర్జవము, ఉడైయాయ్-కలవాడా!, తిరల్-బలము, ఉడైయాయ్-ఒదవినవాడా! శత్రొర్క్కు-శత్రువులకు, వెప్పమ్-భయమును, కొడుక్కుం-ఇచ్చుటకు, విమలా-పరిశుద్ధుడా!, తుయిలెళాయ్-నిద్రలెమ్ము, శెప్పు+అన్న-కడవలవంటి, మెన్=మృదువైన, ముల్తై-స్తనములను, శెమ్+వాయ్=ఎఱ్ఱనిమోవి, శిరు+మరుజ్గుళ్=చిన్న నడుముగల, నప్పిన్నై-నప్పిన్న అనుపేరుగల. నజ్గాయ్+తిరువే=పరిపూర్ణురాలగు, శ్రీ సమానురాలా, తుయిలెళాయ్-నిద్రలెమ్ము, ఉక్కముమ్=ఆలవట్టము, తట్టొళియుమ్-కంచుటద్దము, తన్దు=తెచ్చి, ఉన్+మణాళనై-నీ భర్తను, ఎమ్మై-మమ్ములను, ఇప్పోదే-ఇప్పుడే, నీ+రాట్టు=స్నానమాడింపుము.

తాత్పర్యము!— స్వామీ! మహానుభావా! నీకు సుప్రభాతము. ఆశ్రితరక్షా దీక్షితుడ వీవు. సాధుసంరక్షణకు బద్ధకంకణుడవు. దుర్మార్గులైన రాక్షసులు దేవతలను బాధించుచుండ, ఆ ముప్పదిమూడు తెగల దేవతలను రక్షించుటకు అడుగకముందే పోయి, శత్రువులు గడగడలాడి తల్లడిల్లజేయు బలసంపన్నుడవు నీవు. రక్షింతునని మాటయిచ్చి, యిచ్చినమాట తప్పని ఋజువర్తనముగల మహానుభావుడవు. మీ కోర్కె దీర్తునని నిన్ననే మాకు మాటయిచ్చితివి గదా! నీ మాటనమ్మి వేకువనే చలి యనక స్నానమాడ వచ్చితిమి. నిన్ను పిలిచినా పలుకకున్నావు. నీ కిది భావ్యమా!

తల్లీ నప్పిన్నపిరాట్టీ! "శెప్పన్నముల్తై, చ్చెవ్వాయ్, శిరు మరుంగుళ్" కనకకుంభనిభంబగు స్తనయుగంబుతో పగడంబు డంబు విడంబించు కెమ్మోవితో, దృశాదృశ్య మధ్యంబుతో నందంబు రూపుగటి

నట్లున్న కాంతామతల్లి నైజసౌందర్యమునకు తోడు హావభావ విలాసము లతో నందనందనుని వశమొనర్చుకొని, వెలికి రానీక గాఢపరిరంభ మున భుజలతానియంత్రితుని జేసికొనియున్నావు. మాపై కరుణించి భుజబంధంబు సడలించి పతిని మేలుకొలుపుము.

ఆలవట్టము మించుటద్దము మొదలగు మంగళద్రవ్యములు ముందుంచి, నీ పతిని మేలుకొలుపుము. మమ్ము దయజూపుము. మా నోము సఫలమగు నట్లనుగ్రహింపుము.

విశేషార్థము:- దేవతలు ఒక్కరు గాదు. ముప్పదిమూడు కోట్లు. అంతమందిని రక్షింపజాలిన నీకు పరిమిత సంఖ్యగల మమ్ము రక్షింప భారమా? వారు దివ్యతేజశ్శాలులు. స్వయంశక్తిమంతులు. మగవారు. దిక్పాలనాధికారము గలవారు. అట్టివారినే రక్షింప పొట్టి బావడవుగా నవత రించితివే. నీ దివ్యవిభూతిలోని వైకుంఠనగరము వీడి వచ్చితివే.

స్త్రీలము బాలికలము నిన్నే నమ్మిన స్వయం శక్తిలేనివారము గదా! అనన్యగతికల మైన మమ్ము దయజూడ లేవా? దుష్ట సంహారా ర్థమై నీకై నీవు వైకుంఠము వీడి వచ్చితివి గదా! నందగోపు నింటివారి పూర్వ సుకృతఫలముగా నవతరించినవాడవు. ప్రాసంగికముగా మా కోరికల దీర్చి మమ్ము రక్షింప లేవా? దేవత లర్థింపక మున్న మున్నే రక్షింప నాతురపడువాడవే? నీ యింటి ముంగిట గంటల కొలది నిలిచి ప్రాధేయపడుతున్న మమ్ముల కనికరింప జాలవా? చెప్పినమాట తప్పని ఋజువర్తనుడవు గదా!

"మామేకం శరణం వ్రజ! అహం త్వా
సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః".

అని ప్రతిన బూనితివి గదా! నీలాసతీగాఢపరిరంభమున నది మరచితివా? ఇంతగా అర్థించినను నోరు తెరువవు! కడగంటి చూపుల నేని పరపవు! చిరునవ్వునేని చిందవు!

లేక యామె కౌగిటచిక్కి విడివడ లేక అచ్చట మండలేక ఆందోళన పడుచుంటివా?

"చిక్కఁ   ని కౌఁగిటిలో
చిక్కఁడు సనకాదియోగి చిత్తాబ్జములో
చిక్కఁడు శ్రుతిలతికావలి" (పోతన)

అని యెట్టి బంధములకును తగుల్కొనని నీవు, నప్పిన్నపిరాట్టి కౌగిట చిక్కుట వమట నవ్వులాట గాదా!

"మరి మీరు పిలిచినంతనే మీ మాటకు లోగి రావలయునా అందువా? భక్తుల వశంవదుడవు గదా! నీవు దేనికినీ చిక్కకున్నను,

"చిక్కునతడు రోలఁ దల్లిచేతఁ లీలన్" అని రోటికే తల్లిచే బంధింపబడుట ఆశ్రితపక్షపాతముచేతనే గదా? అట్టివాడవు. "త్వాం మోక్షయిష్యామి" అని శరణొందిన నిన్ను రక్షింతునన్న, నీ "శెప్పము డైయాయ్" అన్న ఆర్జన మెచ్చట నిలుచును?

నీవు మాయా మనుష్యుడవు, ప్రకృతి కతీతుడవు గదా! కాంత కౌగిలి నిన్ను బంధింపగలదా?

మే మితరదేవతల నాశ్రయింపలేదే. వారెంత? వారిచ్చు కోరిక లెంత? ఇచ్చుటకు వారికి స్వయంశక్తి యెక్కడిది?

కామైస్తైస్తైః హృతజ్ఞానాః
ప్రపద్యన్తే౽న్యదేవతాః,
లభతే చ తతః కామాన్
మయైవ విహితాన్ హితాన్". గీత.

అని వారికినీ దానశక్తి నీ విచ్చినదే గదా! కావ ఇతరులను మేము వేడబోము.

నిన్నే నే శరణంటి నాదుభవమున్
నీ భారమే యంటి య
న్య న్నేవేడను; నీకె సేవకుఁడ;
నన్నున్ బాలలో ముంచినా

మున్నీటన్ బడద్రోసినా యది
యశమ్మో నిందయో నీకె యా
పన్నానీకశరణ్య కీర్తికిఁ దగన్
వర్తింపుమో కేశవా!

(నా కేశవప్రవత్తి)

"మేము దేవతలము. మాకును కొన్ని శక్తులున్నవి. శత్రువు లను బలముతో జయించగలము. వారిని వలలో వేసికొనుటకు భ్రమింప జేయుటకు అచ్చర లనే అమోఘాస్త్రములు మాకడ నున్నవి" అను స్వరక్ష ణకు అకించనులుగాని దేవతలనే రక్షింపబూనుకొన్న నీవు అన్యథా గతిలేని మమ్ముల రక్షింప వలదా? మా మొరాలింప వలదా?

గజేంద్రుడు ప్రార్థించినంతనే "శ్రీకుచోపరిచేలాంచలమైన పీడక" పరువెత్తి వచ్చిన నీకు నీ యార్తరక్షణా పరాయణత మా యెడనే సంకుంచింపవలెనా?

అట్లు భగవానుని లేపి, అది కార్యకారి గాదని పురుషకారమునకై పిరాట్టిని లేపుచున్నారు.

అమ్మా తల్లీ! నీ సౌన్దర్య మపూర్వమైనది. 'చైతన్యస్తన్య దాయినీం' అని ఇందిరాదేవిని కీర్తించినట్లు నీవును జీవలోకమునకు ఉత్తేజకరమైన చైతన్య మనే స్తన్యమును కుచకలశముల ధరించిన దానవు. భగవత్సంశ్లేషముచేత ఆ స్తన్యమునందు భగవదనుగ్రహ రసము సమ్మిశ్రితమై పవిత్రమైనది. నీ సౌందర్యముతో భగవానుని వశపరచుకొని, తదంగాలింగన పవిత్రతను స్తన్యముతో లోకోజ్జీవనము నేగాక, భగవదనుగ్రహమును గూడ పిండిపోసిన మహాతల్లీ! ని పురుషకారము లేనిదే భగవాముని దరియలే మమ్మా!

త్వత్సంప్రీత్యై విరహతి
హరౌ సమ్ముఖీనాం శ్రుతీనాం
భావారూఢౌ భగవతి యువాం
దంపతీ దైవతం నః."

(శ్రీస్తుతి— వేదాంతదేశికులు)

అన్నట్లు నీ ప్రీతికై భగవంతుడు జగల్లీలావిలాసములు నెరపు చున్నాడు. మీ రిద్దరూ కలిసి మాకు దైవము. నిన్ను వీడిన పరమాత్మ మా కనారాధ్యుడు. శ్రీమన్నారాయణ చరణకమలములే మాకు శరణ్యములు. తొలుత శ్రీ పూర్వకముగనే అతని సేవించుచున్నాము. నీళా దేవీ! నీవే మా కిప్పటికి శ్రీ కాంతవు. నీవు నిద్రలెమ్ము.

భగవంతుని నిద్రలేపి, భగవత్పూజోపకరణములు దెచ్చి దానితో బాటు మా వ్రతపూర్తికి భగవానుని ప్రోత్సహించి పంపవమ్మా! మా యజ్ఞమున కాయనయే దేవత. అంతియ గాదు—

అహం క్రతు రహం యజ్ఞః
స్వధాహమహమౌషధమ్,
మంత్రోఽహ మహమేవాజ్య
మహమగ్ని రహం హుతమ్." గీత.

యజ్ఞము యజ్ఞీయ ద్రవ్యము స్వధా ఆజ్యము మంత్రము అన్నీ ఆయనయే అన్నప్పుడు ఆయనను వదలి మేము చేయున దేమున్నది? తల్లీ కరుణించి ఆతని లేపి పంపవమ్మా అని అర్థించినారు.

'తల్లీ అతనిని కరుణించి లేపవమ్మా. (అనంతరం)

భగవంతునికి మాకును సంధానకారిణివి నీవే. మీరు కోరు తట్టొళియుం—మించుటద్దము, ఉక్కముమ్—ఆలవట్టము, భౌతికవస్తువులుగావు. మేముకోరు అద్దము అష్టాక్షరి. ఆలవట్టము ద్వయము.

అద్దము ఎదుటగల పదార్థములను రమణీయముగ ప్రదర్శించును. అష్టాక్షరి ఉన్ననిత్య సత్పదార్థముల నన్నింటినీ వివరించి చూపును. లోకములోని పదార్థము చిదచిత్పరమాత్రలు. నిత్య సత్పదార్థములు నారాయణ పదములోని నారపదము. నశించని పదార్థసమూహమును బోధించును.

రిష్—క్షయే, అను ధాతుజన్య "రః" పదమునకు క్షయించనిదని అర్థము. అదియేది? అనిని, "అజామేకాం లోహితశుక్లకృష్ణాం" అన్న జన్మలేని త్రిగుణాత్మక ప్రకృతి. 24 తత్త్వములుగా, లేక "మే ప్రకృతి

రష్టధా" అన్న గీతానుసారము 8 తెగలైన భిన్నజడప్రకృతి" "అజో హ్యేకోజుషమాణోఽనుశేతే" అన్న జీవ[illegible] "అపరేయమిత స్త్వన్యాం ప్రకృతిం విద్ధి మే పరాం జీవభూతా" మని పేర్కొనబడిన, నిత్య బద్ధముక్త రూపముగా త్రిధావిభక్తము "జహాత్యేనాం భుక్తభోగామ జోఽన్యః" జీవులచే కర్మానుసార మనుభవింపబడు అచిత్తును అనుభవించక సాక్షిభూతుడుగా జీవులను భోక్తలనుగా ప్రేరేపించు పరమాత్మ, ఈ చిద చిత్పరమాత్మ సముదాయము నశించనిది. అదే నారపద వాచ్యము.

నారమునకు "ఆయనము-గతి" అని ఆయన పదమ్ముతో తెలియు పరమాత్మను నారమునుండి తొలగించవలె, "పరమాత్మను తొలగించిన, అతనితో అవినాభావయగు లక్ష్మిని తొలగించిన", చిదచిత్తులు రెండే నారపద వాచ్యములు.

నారాయణ పదార్థమే మొదటి ప్రణవమందలి 'అ' 'మ' లతో పేర్కొనబడినది. "అకారార్థో విష్ణుః-మకారార్థో జీవః" అని అష్టశ్లోకి. నమః పదము జీవులకైంకర్యము అకారవాచ్య నారాయణునకే అని జీవపరమాత్మల స్వరూప స్వభావముల వెల్లడించు మూలమంత్రమే చేతనులు కోరవలసిన మించుటద్దము.

ఇక ఆలవట్టము-వీవన తాపమును హరించును కాని, చేతనులకు గల సాంసారికతాపమును ప్రాకృతమైన వీవన హరింపలేదు. భగవచ్చ రణ శరణాగతిచే గాని అది తొలగదు.

శరణాగత్యనుష్ఠానరూపమై, ఉపాయోపేయముల రెండింటినీ ప్రదర్శించు ద్వయమే బద్ధజీవుల పాలిటి ఉక్కముమ్-ఆలవట్టము. వాటినే ఇచ్చట, "ఉక్కముం తట్టొళియుం తందున్" అని అర్థించు చున్నారు గోపికావ్యాజమున–

అనువాదము:—

ముమ్మగా వేంచేసి ముప్పదిమూఁడు కో
    టుల యమరుల భీతి తొలఁగఁద్రోయఁ
జాలింప దీనులఁ జాలిన యౌదార్య
    బలములు గలిగిన భద్రమూర్తి!

పరిపంథులను భయం బరచు తేజశ్శాలి
మేలుకోవయ్య మమ్మేలు కొనుము
బంగారు కుండల రంగారు వక్షోజ
ములను నెన్నడుము తిమ్మోవి దాస
నిదుర లేవమ్మ సీమంతినీమతల్లి
ఆలవట్టము దెమ్ము నీలాపురంధ్రి
దర్పణము నిమ్ము నందనుని మమ్ము
చెలగి యిప్పుడు నీరాడఁ జేయు మమ్మ.

## 21 వ పాశురము

అవతారిక:— కృష్ణస్వామిని లేపుచున్నారు.

ఏత్ర కలఙ్గ ళెదిరొ్పంగి మీదళిప్ప
మాత్రాదే పాల్ శొరియుమ్ వళ్ళల్ పెరుమ్పశుక్కల్
ఆత్రపడై త్తాన్ మహనే యరివురాయ్
ఊత్రముడై యాయ్ పెరియాయులహినిల్
తోత్రమాయ్ నిన్రశుడరే తుయిలెళాయ్
మాత్రారునక్కు వలితొలైన్దున్ వా శల్కణ్
ఆత్రాదు వన్దున్నడి పణియుమా పోలె
పోత్రియామ్ వన్దోమ్ పుహషన్దేలో రెమ్పావాయ్.

అర్థము:- ఏత్ర=తగిన, కలంగళ్=కలశములు, ఎదిర్+పొంగి=పైకి పొంగి, మీదు+అళిప్ప=పై పైకి పొరలిరాగా, మాత్రాదే=అడ్డులేక, పాల్ + శొరియుమ్=పాలు గురియునట్టి, వళ్ళల్=సాధువులైన, పెరుమ్+పశుక్కళ్=పెద్దయావులు, ఆత్ర=అధికముగా, పడైత్తాన్=పడసిన, (గోపుని) యొక్క, మహనే=కుమారుడా! అరివురాయ్=లెమ్ము.

ఊట్రమ్-(రక్షణయందు) ఆసక్తి, ఉడై యాయ్-కలవాడా! పెరియాయ్-గొప్పవాడా! ఉలహినిల్=లోకమున, తోట్రుమాయ్-ప్రత్యక్షమై, నిన్ఱ-నిలచిన, శుడరే-తేజమా! తుయిలెళాయ్-నిద్ర లెమ్ము.

మాట్రార్-మార్తురు (శత్రువులు) ఉనక్కు-నీకు, వలి+తులైన్దు-బలము వీగి, ఉన్-నీ, వాశల్+కణ్-వాకిలిపట్టున, ఆట్రాదు-ఎదిరింప (తాళ) లేక, వన్దు-వచ్చి, ఉన్+అడి+పణియుమా+పోలె-నీ యడుగుల పడినహరా అన్నట్లు, యామ్=మేము, పోహిళిన్దు-పొగడి, పోట్రి=మంగళాశాసనము చేయ, వన్దోమ్-వచ్చితిమి.

తాత్పర్యము:— ఓ నన్దకుమారుడా నిద్ర లెమ్ము. మీ తండ్రి మహైశ్వర్య సంపన్నుడు. తెచ్చిపెట్టు పాత్రలన్నీ నిండి పొంగి పొరలి పారునట్లు క్షీరధారల నెడతెగక గురియు సాధువులైన పెద్దయాల మందలు గలవాడు - అతని కొమారుడ వీవు.

నీవు వేదాంతములకును అంతు తెలియని మహిమోన్నతుడవు.

నీ తేజస్సు సహస్రకోటి సూర్యప్రకాశము. అట్టి నీవు లోకరక్షణార్థము నీ తేజస్సును కుంచించుకొని, మా కన్నులు చూడవీలగునట్లు విభవావతారుడై అవతరించినావు. మమ్మనుగ్రహింపవచ్చిన వరమూర్తియే నీవు. మహామహావా! నీకు సుప్రభాతము.

శత్రువులు నీ ముందు బలహీనులై నిలుపలేక, వేరుచోట తల దాచుకొని బ్రతుకలేక, నీ యడుగు దమ్ములకు దాసులై పడియుండునట్లు, మేము నీ సౌన్దర్య గాంభీర్య సౌశీల్యములకు వశలమై నిన్ను నుతించి మంగళాశాసనముచేయ వచ్చియున్నాము. నీ నిద్ర చాలించి వచ్చి మమ్మనుగ్రహింపుము.

విశేషార్థము:—నందనందనా! ఎన్ని మారులు నిద్ర లేపుదుము. పిలిచినను, పలుకకున్నావు. ఆడపిల్లలే, పరతంత్రలే, రెండుమారులు లేపిన లేచిరే. నీవు రాకుమారుడవు. రక్షణభారమును మోయవలసిన వాడవు. ఇట్లు నీ నిద్రపోతుతనము పెంచుకొనవచ్చునా?

"గోధనమే అధికముగాగల నందగోపుని పుత్రుడని, రాజసము పూని" ఈ పల్లెపిల్లలతో నేమని, మౌన మూనితివేమో? మే మన్యులము గాము. నందగోపుని బంధుబలగములోని వారమే.

వైకుంఠవాసివైన నిన్ను క్షీరాబ్ధిశాయిని నిద్రలేపి భూమి కవత రించుమని గజేంద్రునివలె దేవతలవలె ఆయాస పెట్టలేదు. విభవావ తారుడుగా అవతరించిన నిన్ను మా పల్లెలో నుండి మాతోబాటు చిన్న నాటి నుండి ఆడిపాడుట ఒద్దిక గలవారమై లేపనంత చనువుతో వచ్చి తిమి. ఆ స్వాతంత్ర్యము మాకు లేదా? లేచు ఆదరము నీకు లేదా?

తత్త్వమరసిన, మేమెవ్వరము? నీ వెవ్వడవు? నీవు స్వామివి. మేము నీ సొమ్ము. నీవు శేషివి. మేము శేషభూతులము.

"మమైవాంశో జీవలోకే జీవభూత స్సనాతనః"

అని నీవే చెప్పితివి గదా! మేము నీ యంశములమైన, నీ సొమ్మును రక్షించుకొనుమని నీకు ఒక్కరు చెప్పవలెనా? తమ సొత్తు తాము రక్షించుకొనక పాడుచేసిన ఎవ్వరికి లోటు?

"ఊత్రటము డై యాయ్ పెరియాయ్ ఉలహినిల్
తోత్రటమాయ్ నిన్ఱ శుడరే తుయిలెళాయె"

నీవు గొప్పవాడవు, నీ గొప్పతన మింతని వాకొనరానిది. అవా ఙ్మానసగోచరుడవు. మేమెంతవారము.

"తత్త్వేన యస్య మహిమార్ణవ శీకరాణుః
శక్యో సమాతుమపీ శర్వపితామహాద్యైః,
కర్తుం తదీయమహిమస్తుతి ముద్యతాయ
మహ్యన్నమోఽస్తు కవయే నిరపత్రపాయ."
(శ్రీ యామునాచార్యులు)

వేదములు, బ్రహ్మరుద్ర సనకసనందాదులును నుతింపలేని నిన్ను మేము నుతించువారము?

నీవు ధర్మోద్ధరణకు సాధురక్షణకు అవతరించితివి. అవతరించితివిపో నీ నైజతేజమెవ్వడు సైపజాలును?

"దివి సూర్యసహస్రస్య
భవేద్యుగపదుత్థితా
యది భాః సదృశీ సా స్యాత్
భాసస్తస్య మహాత్మనః". గీత

సహస్రభాను భా భాస్యమానమైన నిన్నెవ్వడు చూడజాలెడిని. సూర్య చంద్రాదులు నీ ముందు దిగదుడుపు.

"భీషాస్మాద్వాతః పవతే, భీషోదేతి సూర్యః" శ్రుతి.

అని సూర్యచంద్రాదులు నీకు జడిసియే తమ విధ్యుక్త కార్యముల నేమరక సల్పుచున్నారు. అట్టి నీ తేజమును ఈ మానవులు సైపలేరని సామాన్యమానవునివలె లోకరక్షణకు నీ తేజమును ఉంచించుకొని అవతరించితివి. అందువల్లనే—

"అవజానంతి మాం మూఢా మానుషీం తను మాశ్రితమ్"

అని అజ్ఞులు నిన్ను అవమానింతురు. నీ తత్త్వము భక్తులకుగాక ఆసుర ప్రకృతులకు తెలియ శక్యమా?

త్వాం శీలరూపచరితైః పరమప్రకృష్టైః
సత్త్వేన సాత్త్వికతయా ప్రబలైశ్చ శాస్త్రైః,
ప్రఖ్యాత దైవపరమార్థవిదాం మతైశ్చ
నైవాసురప్రకృతయః ప్రభవంతి బోద్ధుమ్.
(శ్రీ యామునాచార్యులు)

ఎన్ని విద్యలు శాస్త్రాలు వేదాలు చదివినా, ఎందరు మహానుభావులు ప్రబోధించినా, తామసప్రకృతులు పరతత్త్వమును కనుగొనజాలరు.

మహాత్ములుగూడ పరతత్త్వ స్వరూప నిర్ణయము చేయలేక నేతి నేతి పరపర్యుదానము చేతనే శాఖానిర్దేశముగా కొంతకు కొంత యూహించుకొనుచున్నారు గాని ఇదమిత్థమని తత్త్వ మెరుంగలేక అతని శివుడని, శక్తియని, పలు పలు విధముల అంధకారమునందు

వలె తారాడుచున్నారు. నీ మాయ నీ దయ లేకున్న దాటశక్యమా? రమాదేవీ కటాక్షములు పొరకున్న సాధ్యమా?

"హ్రీశ్చ తే లక్ష్మీశ్చ పత్న్యౌ" అని లక్ష్మీపతి యెవ్వరో ఆతడే పరమపూరుషుడని, పరమాత్మయని, లక్ష్మీపతిత్వముతో నిన్ను నిర్ణయింప గల్గుచున్నారు.

అట్టి నీవు లోకరక్షణార్థమై విభవావతారుడై యవతరించితివి. మా సుకృతము కొలది మా కందరికి గోచరమైతివి. మహానుభావా! అట్టి నిన్ను మేమా లేపువారము? నీవా నిద్రించువాడవు? నీది యోగ నిద్ర గాని తామస నిద్ర గాదు గదా!

"కౌసల్యాసుప్రజా రామ పూర్వా సంధ్యా ప్రవర్తతే,
ఉత్తిష్ఠ నరశార్దూల కర్తవ్యం దైవమాహ్నికమ్."
(రామాయణము)

అని విశ్వామిత్రులు ప్రబోధించెనే,

శ్రీరామచంద్రుని నేనెరుగుదును "అహం వేద్మి మహాత్మానం" అని ఎద దట్టి చెప్పిన విశ్వామిత్రుడు దైవ మాహ్నికముచేయ లెమ్మన్నాడు. ఆహ్నికము చేయు వారెవ్వరు? రాముడే పరమాత్మ అన్న తత్త్వ మెరింగిన ఋషి సంధ్యవార్చ లెమ్మని రాముని లేపునా? సంధ్యావందనము చేతువు లెమ్మని లేపిన నాతడు తత్త్వవేత్త యగునా?

తాను సంధ్య వార్చవలెను. అందు గాయత్రీమంత్ర ప్రతిపాద్యుడు మానవుల బుద్ధిని ప్రబోధించు తేజోరూపుడునగు దేవుడు పరమాత్మ. అతడు తన కన్నుల ముందు నటనకై కనుదమ్ములు మూసి పవళించి యుండ, ఆతని సున్ముఖుని చేసుకొని గదా తత్ప్రీతముగ సంధ్యవార్చ వలయును? కాన, నేను ఆహ్నిక మొనర్తుమ నీవు ప్రసన్నుడవై లెమ్మనుచున్నాడు. "ఉత్తిష్ఠ నరశార్దూల" అని,

అటులనే నిద్రించు వానివలె ముకుళిత నేత్రుడవైన నిన్ను అస్మదభిముఖుని జేసుకొనుటకు సుప్రభాతము పాడ నీ పాదసేవికలమైన మేము వచ్చివడియున్నాము.

నిన్నెదిర్చిన శత్రువులు బలము తరిగి నీ వాకిట పడియున్నట్లు మేము నీ యెడ ననురక్తులమై నీ యడుగుఁబడి యున్నాము.

శత్రువులు నీకు లోగి వేరుచోట నిలువలేక నిన్నెదిరించలేక విధిలేక నీ వాకిట వచ్చిపడియున్నారు. వారినిగూడ కనికరించు స్వభావము గల నీవు మాయెడ నవ్యాజామరాగముతో, అనన్య శరణ్యులమై నీ పాదారవిందములే ధారకములు పోషకములు అని నమ్మియున్న మాయెడ కనికరింపవా ? అని జీవు లాక్రోశించుచున్నారు. అట్టి వారిని భగవానుడు తప్పక అనుగ్రహించును.

జీవులు భగవచ్ఛేషభూతులు. మహాతేజశ్శాలియైన పరమాత్మ లోకావనోత్సాహియై తన తేజస్సును సంకుచించుకొని, జీవులవలె కర్మ బద్ధుడుగాక స్వసంకల్పముతోనే అవతరించినాడు.

"అజోఽపి సన్నవ్యయాత్మా
భూతానామీశ్వరోఽపి సన్,
ప్రకృతిం స్వామధిష్ఠాయ
సంభవామ్యాత్మమాయయా." గీత

అట్టి సర్వశేషిని అహంకార మమకార శూన్యులై సర్వాత్మనా అనన్యగతికులై శరణుబొందుట జీవులకు మోక్షప్రాప్తి సాధనము.

అనువాదము:—

అఁకయొకింతయులేక పట్టిన యన్ని
పాత్రలు నిండారి పైన పొరలి
పొరునట్టుల పాలవర్షించు నావులు
గలవాని కొమరుఁడా కన్నుదెరుము
రక్షింపభక్తుల శిక్షింప వైరుల
తేరిచూడగరాని తేజుపుడమి
రూపుగట్టిన యట్టులేపు సూపిన దేవ
మేలుకోవయ్య మమ్మేలుకొనుము

ఎదురుకొనలేక భుజబలమేది నీదు
వగఱు నీయింటి వాకిటి వంచఁబడిన
వడుపునఁగా మిమ్ము సామి నీ యడుగుదామ
రలను పొగడెడి శరణాగతులను గనుము.

## 22 వ పాశురము

**అవతారిక :**— కృష్ణావతారుని కరుణాకటాక్షవిన్యాసము నర్థించుచున్నారు.

అఙ్గణ్ మాఞాలత్తరశరభిమాన
వఙ్గమాయ్ వన్దు నిన్ఱాపళ్ళికట్టిల్ కీళే
శఙ్గమిరుప్పార్పోల్ వన్దు తలైప్పెయ్‌దోమ్
కిఙ్గిణి వాయ్‌చ్చెయ్ద తామరైప్పూప్పోలే
శఙ్గణ్ శిఱుచ్చిరిదే యేమ్మేల్ విళియావో
తిఙ్గళు మాదిత్తియనుమెళు న్దార్పోల్
అఙ్గణ్ణిరణ్డు కొణ్డెఙ్గళ్ మేల్ నోక్కుదియేల్
ఎఙ్గళ్ మేల్ శాబమిళిన్దేలో రెమ్బావాయ్.

**అర్థము :**— అమ్+కణ్—అందమైన పట్టులుగల, మా+ఞాలత్తు—విశాలమైన నేలయొక్క, అరశర్—అరసులు (రాజులు), అభిమాన వఙ్గమాయ్—అభిమాన భంగముయి, వన్దు—వచ్చి, నిన్ఱా—నీ యొక్క, పళ్ళి—పడుకొను, కట్టిల్—మంచముయొక్క, కీళే—క్రింద, శఙ్గ+మిరుప్పార్+పోల్—సంఘమై యున్నవారివలె, వన్దు—వచ్చి, తలై పెయ్‌దోమ్—గుంపుగూడి యున్నాము.

కిఙ్గిణి—చిరుమువ్వలు, వాయ్ చెయ్ద—నోరు విచ్చిన, తామరై+పూ+పోలె—తామర పూవులు వలె, శెమ్—ఎఱ్ఱని, కణ్—కన్నులు, శిరుచ్చిరిదే—కొద్దికొద్దిగ, యమ్+మేల్—మాపై, విళియావో—ప్రసరింపజేయుమా !

తిఙ్గళుమ్—చంద్రుడును, అదిత్తియనుమ్—సూర్యుడు, ఎళున్దార్+పోల్—ఉదయించినట్లు, అమ్‌కణ్—అందమైన కన్నులు, ఇరణ్డు+కొణ్డు—

రెండింటిని కొని, ఎజ్గళ్ మేల్-మాపై, నోక్కుదియేల్-(చూపు) ప్రస రింపజేసిన, ఎజ్గళ్ మేల్-మాపైనున్న, శాబమ్-శాపములు, ఇళున్దు-తొలగును.

తాత్పర్యము:—సస్యశ్యామల సుందరమైన విశాల భూభాగము లకు రాజులన్నవారు స్వాతిశయము డింద, ఆత్మాభిమాన ముడిగి, నీ దయకు కాచుకొన్నట్లు, విశ్వ విశ్వంభరాధీశ్వరుడగు నీవు శయనించు చోట గుంపుగూడి దేహాభిమానము, ఆత్మాభిమానము అహంకార మమ కారములు వదలి నీ యడుగుదమ్ముల కడజేరితిమి.

దరవికసితములగు నీ కనుదమ్ములు మాపై ప్రసరింపజేయుము. చంద్ర సూర్యప్రకాశముగల నీ పవిత్ర దృక్ప్రసారముచేత మా పాపము లన్నియు నశించును. మేము పవిత్రుల మగుదుము.

విశేషార్థము:— భూమిలో రాజులన్నవారు పూర్వజన్మకృత సుకృత విశేషముచేత విశాల సుందర భూమండలముల కాధిపత్యము వహించినారు. దానివలన సంపదలు కన్నుగప్పుటచేత "నన్ను మించిన వారు లేరని, నా పరాక్రమముచేతనే యీ భూమండలము నార్జించితినని నన్నెదుర్పు వాడెవ్వ"డని గురహంకారము, దుర్మమకారము మద మాత్సర్యములు ఆవేశింప, హిరణ్యాక్ష హిరణ్యకశిపులవలె పరులను ఎంత వారినేని సరకు గొనక, మిడిసిపడు చుందురు.

"తాడితన్నువాని తలదన్ను వాడుండు"నన్నట్లు వారి మిడిసిపా టెంత వరకు? వాని మించినవాడు తారసిల్లువరకే. తారసిల్లిన వాని ధాటి కోర్వజాలక, బడలి పడలి అహంకార మడుగంటి దాసోహ మనవలసినదేగదా!

తత్త్వమరసిన, పుట్టినప్పు డెవ్వడును జేనెడు భూమిని వెంటకొని రాలేదు. నాలుగు పైసలు పట్టుకురాలేదు. పోవుతరి దేనినీ కొనిపోవుట లేదు. తినగానక కుడువగానక కష్టపడి కూడబెట్టినదంతయు బాంధవా భాసులకు వదలి, వట్టిచేతులతో పోవుచున్నారు.

"కారే రాజులు? రాజ్యముల్ గలుగవే? గర్వోన్నతిన్ బొందరే? వారేరీ? సిరిమూటగట్టుకొని పోవంజాలిరే? భూమిపై పేరైనన్‌గలదే?"

అట్టిచో నేల ఈ దురహంకారము. ఇది నాది అని అనుకొనుచునే, దీని నిచ్చటనే వదలివేసి, గడువు తీరగనే వెళ్ళిపోవుచున్నారు.

"వెంటవచ్చిన దేహ మిదె శాశ్వతముగాదు
అసువు లెడసిన పిదప పుడమి నిలబడబోదు
అపుడొ ఇపుడో దీనిగడువు తెలియగరాదు
ఆ పైన వగపు ని కావంత కొరగాదు."

విశ్వవిశ్వంభరాధీశ్వరుడు దీని నంతటినీ సృష్టించినవాడు శ్రీమన్నారాయణుడు, ప్రళయమున తన కుక్షిలోనికి సమస్త సృష్టినీ లయింప జేసికొనును.

నారాయణాదేవ సముత్పద్యంతే
నారాయణాత్ప్రవర్తంతే నారాయణే ప్రలీయన్తే.
(మహోపనిషత్)

అహం కృత్స్నస్య జగతః
ప్రభవః ప్రళయస్తథా,
భూతగ్రామ స్స ఏవాయం
భూత్వా భూత్వా ప్రలీయతే
రాత్ర్యాగమేఽవశః, పార్థ!
ప్రభవత్యహరాగమే. (గీత)

కావున నీ సర్వమున కతడే యీశ్వరుడు స్వామి. ఇదియంతయు ఆతని సొత్తు. నాది నాది యని, తలంచుట వట్టి భ్రాంతి. నేనే సర్వమున కధిపతి నన్ను మించిన వాడు లేరని మిడిసిపడిన హిరణ్యాక్ష హిరణ్యకశిపుల మిడిసిపాటేమైనది?

అందువలన, అహంకార మమకారములు తగవు. జీవి భగవంతుని శేషభూతుడు. కాన అతని పాదారవిందముల నాశ్రయించి యుండ వలసినది జీవుల ధర్మము.

అట్లు తన్నాశ్రయించిన వారిపై దరదలదరవిందసుందరములైన యాతని కన్నులు దయారసము చిందుచు ప్రసరించును.

అతడు సూర్యాచంద్రమసలోచనుడు. శత్రువులపై సహింపరాని తేజస్సును మిత్రులపై ఆనందకరమైన వెన్నెలను ప్రసరింప జేయును.

ప్రసన్నులైన చేతములుగాన వీరి కవపరమైనవి చల్లని వెన్నెల వంటి దయాపాంగములు గాన తొలుత "శిజ్జళుమ్ పోల్" అని చంద్రుని పేర్కొన్నారు.

ఆ దృక్ప్రసారములచేత చేతనుల మోక్ష ప్రతిబంధకములైనవి గాన శాపములని పేర్కొనబడిన పాపములు నశించి, వీరు మోక్షార్హు లగు చున్నారు.

అతని పాదరేణువునకే అహల్యాశాప మోక్ష సామర్థ్య మున్నదన్న 'సర్వేంద్రియాణాం నయనం ప్రధాన'మన్నట్లు అతి ముఖ్యేంద్రియము లగు కన్నుల కెంత సామర్థ్యముండవలెను? అట్టి యపాంగప్రసార ములు పొరినవార పవిత్రత నెంతని కొనియాడదగును?

అంతకంటెను జీవులు కోరదగిన దేమున్నది? అది ప్రసరించెనా ఈ నశ్వరమైన యైశ్వర్య మేమి, శాశ్వతమైన అఖండ బ్రహ్మానందమే ముంగొంగు వనండి. కావున అందుకై ఈ మానవజన్మమును విని యోగించుకొని సార్థకపరచుకొనవలయునుగాని క్షణిక, లౌకిక సౌఖ్య సమార్జనకు రిత్తపుచ్చుకొనరాదు.

అనువాదము:—

విపులావనీనాథు లవగతగర్వులై
        గుమిగూడి నీదు కంకటిక క్రింద
మూఁగినట్లుల; మేము ముదిత లెల్లరు చేరి
        నీ పాద సన్నిధి నిలిచినాము
చిఱుతగజ్జలువోలె చెన్నొందు కెంపుదా
        మరలునా దరవికస్వరవిలోచ
నాంచలమ్ముల కాంతు లించుక మావయి
        ప్రసరింపఁ జేయుమా పంకజాక్ష!

వేడి వెలుఁగుసు జల్లని వెలుఁగుఁబోలు
రెండు కన్నుల నెండ రేయెండ గురిసి
మమ్ముఁ గరుణించితేని యస్మత్సమస్త
పాపసంచయములు పటాపంచ లగును.

## 23 వ పాశురము

అవతారిక:— నందకుమారుడు తన పడకపై నుండియే కనులు విచ్చి మీ కేమి కావలయుననని యడుగ నా కన్నె లిట్లను చున్నారు.

పాశురము:—

మారి మలై ముషఞ్జిల్ మన్ని క్కిడన్దుఱఙ్గుమ్
శీరియ శిఙ్గమఱివుత్తు తీ విషిత్తు
వేరి మయిర్పొఙ్గ వెప్పాడుమ్ పేర్న్దుదఱి
మూరి నిమిర్న్దు ముషఙ్గి ప్పుఱప్పట్టు
పోదరుమా పోలే నీ పూవైప్పూ వణ్ణా! వున్
కోయిల్ నిన్ఱిఙ్గనే పోన్దరుళి క్కోప్పుడైయ
శీరియ శిఙ్గాసనత్తిరున్దు యామ్ వన్ద
కారియ మారాయ్న్దరుళేలో రెమ్బావాయ్.

అర్థము:— మారి=వానయందు, మలై=కొండయొక్క, ముషఞ్జిల్-గుహయందు, మన్ని-స్థిరపడి, కిడన్దు-పరుండి, ఉఱఙ్గుమ్-నిద్రించు, శీరియ+శిఙ్గమ్-శ్రేష్ఠమైన సింహము, అఱివుత్తు-మేల్కొని, తీ-నిప్పువంటి, విషిత్తు-చూపుచూచి, వేరి-పరిమళించు, మయిర్-జూలు, పొంగ-నిగుడగ, ఎప్పాడుమ్-అన్నివైపుల, పేర్న్దు-కదిలి, ఉదఱి-విదలించి, మూరి+నిమిర్న్దు-నిక్కి నీల్గి, ముషఙ్గి=గర్జించి, పుఱప్పట్టు=బయలుదేరి, పోదరుమాపోలె-వచ్చునట్లు, పూవై+పూ+వణ్ణా!-అవిసిపూవన్నెకాడా! నీ-నీవు, వున్+కోయిల్+నిన్ఱు=నీకోవెలమందియే, ఇఙ్గనే-ఇచ్చటికే, పోన్దరుళి=వేంచేయ కటాక్షించి, కోప్పు+ఉడై-గొప్పదనముగల, శీరియ-శ్రేష్ఠమైన, శిఙ్గాసనత్తు+ఇరున్దు-సింహాసనముపైనుండి, యామ్-మేము, వన్ద-వచ్చిన, కారియమ్-కార్యమును, ఆరాయ్న్దు-అరయవలయును.

తాత్పర్యము:— వానాకాలమున మృగరాజు కొండగుహలో జేరి, నిర్భయముగ నిదురించుచు మేఘగర్జనను సైపలేక నిదుర మేల్కొని నిప్పులు గ్రక్కు చూపులతో నిద్రాభంగహేతువును బయట కలయజూచి కానక, మెలకువ యైనందున జూలు విదలించి, విరుచుకొని, నిక్కి నీల్గి వేటకై వెలికి వెడలి, ఇతర ముక్కిడి మృగముల లెక్కసేయని రీతి బయలుదేరి. మహోన్నత గండోపల మధిష్ఠించి ఆసీనమైన వగిది.

నీళాదేవీ కుచగిరుల మధ్య శయనించిన నందకిశోరమా! లేచి, మజ్జుతొలగునట్లు ఒడలు విరుచుకొని, స్వభావముగా కెందామరల బోలిన కనుగవతో, రేయి కేళీవిలాసములతో మరింత కెంపులూరు చూపులను ప్రసరింప జేయుము. నీ సౌందర్యము సేవించు భాగ్యము నీళాదేవికే గాక మాకు గల్గనిమ్ము—

అని ప్రార్థింప వారి మనవి విని, "ఎప్పుడు పట్టిన అప్పుడు ఎచ్చటికన్న అచ్చటకు రావచ్చునా? వేళాపాళా లేదా? ఉచిత స్థానము లేదా?" అన్న—

స్వామీ కోపింపకుము, పిల్లల తప్పులు మన్నింపుడు. "న ఖలు నిజశిశూనాం సన్నిధిర్వ్రీడ హేతుః" (లక్ష్మీ సహస్రము.) తల్లి దండ్రు లున్న చోటికి వచ్చుటకు పిల్లలకు వేళయేమి? మీ కడ మాకేటి నియ మము? మా రాక మీ కేమి ప్రతిబంధకము? ఈ ప్రాకృత జనులమధ్య తగుల్కొని నీ విరహముతో భరింపలేక అటమటించు వారికి కాలమేమి? స్థలమేమి? నీ యెడబాటు సైపలేక సంసారమును రోసి వచ్చితిమనిరి.

"వచ్చితిరి సరే! ఐన నిద్రాభంగమయినది మీకేమి కావలయును?" అన్న—

స్వామీ అచ్చోటి నుండియే మా కోరిక వినుటెట్లు? సింహగమన మున విచ్చేసి, మీ గమనవిలాసమును మాకు సేవింపనిచ్చి సింహాసన మలంకరించి, మా కోరికల నవధరింపుడు.

ఒకవైపు ప్రియురాలి ముఖవిలాసములు మైమరపించుచుండ ఏకాగ్రముతో మా మొరాలింప సాధ్యమా? మీరు భద్రాసనమున కొలువు దీరిన, మీ సన్నిధానసౌభాగ్య మనుభవించుచు, అంతమాత్రముననే మా శారీరక మానసిక తాపోద్వేగము శాంతింప నెమ్మదిగ మా కోర్కులను మనవి సేయుదుము.

విశేషార్థము:—జీవులకు పరమాత్మ సన్నిధి జేరుటకు సమయాసమయములు లేవు. 'తదేవ లగ్నం సుదినం తదేవ' సంసారవిరక్తి కల్గినప్పుడే సంన్యసింపనలయును. "యదహని విరజ్యతే తదహని ప్రవ్రజేత్" అందురు.

అతడు పురుషోత్తముడు, జగన్నిర్మాణ రక్షాలయముల ననుష్ఠించువాడు. రక్షాకార్యమున దుష్టశిక్షణము వీడరానిది. కావున సహజవాత్సల్య సౌశీల్య సౌకుమార్య గుణములు కలవాడైనను కోప తాపముల నారోపించుకొని ధర్మధ్వంసకులయెడ తీక్ష్ణదృక్కులు పరపుచుండును. అప్పుడాతని మోము "ఆదిత్తియనుమ్ బోల్" సూర్యునివలె దుర్నిరీక్షముగ చూపు నిప్పువలె నుండును. అట్టి సమయమున నాతని దరియుట కష్టము.

హిరణ్యకశిపుడు పరచింత వదిలి ఐహికలాలసుడై "అహం బ్రహ్మాస్మి" నేనే పరబ్రహ్మమని, నన్ను మించిన వాడెవ్వడని కశిపుల యందే (అన్నవస్త్రములందే) తత్పరుడై యుండెను. బంగారుబువ్వ, బంగారువలువ గలవాడు హిరణ్యకశిపుడు. పరమాత్మదృష్టి లేనివారు లౌకికసుఖైకాసక్తులంసరు హిరణ్యకశిపులు, హిరణ్యాక్షులు. అట్టివారు యుక్తాయుక్తము నెరుగక అధర్మముల నాచరించుచుందురు. వారి వలన సాధువులకు బాధ గల్గును. వారిని హతమార్ప భగవంతుడు కోపము దెచ్చుకొని ఉగ్రస్వరూపము దాల్చును. అట్టి సమయమున దేవతలుగూడ నాతని దరియలేరు.

ఆ యుగ్రస్వరూపుని హిరణ్యకశిపు ఆంత్రమాలికాహారుని తద్రక్త రంజిత జటాధారుని గమనించి లచ్చియు ఎదుటబడ వెనుకంజవేసినదట. కాన సామాన్య చేతనులు దరియజాలుదురా? ప్రహ్లాద పురస్సరముగా పోయిరట.

అట్టి పురుషకార పూర్వకముగ స్వామి దరిజేరవలయును.

ఆతని యనుగ్రహమునకు పాత్రులైనవారికి అతని చూపులు వెన్నెలవలె చల్లగనుండును. జపాసన్నిధిని స్ఫటికము ఎర్రబారినట్లు దుష్టసన్నిధిలో ఆగంతుకమైన కోపము, అది తొలగినంతనే తొలగిపోయి సైజమైన సౌమనస్యము, మందహాసము, కన్నుదామరల దివ్యకాంతులు తేజరిల్లును.

సింహాసనాసీన దశయందు నొక ప్రాభవము ప్రకాశించును. అర్థుల కోర్కులు తీర్పవలయునను యౌదార్యము వెల్లివిరియును. తదనుగ్రహ ప్రాప్తియే చేతమలకు సర్వ శోభన సంపాదకము. నిశ్శ్రేయ సాపాదకము.

అనువాదము :—

వానల కాలాన పర్వతగుహలోన
నెమ్మది సింగంబు నిద్రగూరి
మేల్కని, కనువిచ్చిమిరుమిట్లుగొల్పు చూ
పుల నెల్ల దిక్కులఁ గలయఁజూచి
మెయి నిక్కఁగదలించి, మెడజూలు విదలించి
గర్జించి వెడలంగ గడగినట్లు
వడకటింటిని వీడి పంచాస్యగతితోడ
నరుదెంచి మేలి సింహాసనమున

అవిసిపూవన్నె తిరుమేనియందగాఁడ
కొలువుదీరుము; వచ్చిన గోపకన్ని
యల విచారించి కోరిక లవధరించి
నీవు కరుణింపు మమ్ము సింహావలగ్న.

## 24 వ పాశురము

అన్ఱివ్వులహ మళన్దాః యడి పోత్రి
శెన్ఱఙ్గుతెన్నిలఙ్గై శెత్రాయ్ తిరల్ పోత్రి
పొన్ఱచ్చగడ ముదైత్తాయ్ పుగళ్ పోత్రి
కన్ఱుకుడిలా వెఱిన్దాయ్ కళల్పోత్రి
కున్ఱుకుడైయా యెడుత్తాయ్ గుణమ్ పోత్రి
వెన్ఱుపగై కెడుమ్‌నిణా కైయిల్ వేల్ పోత్రి
ఎన్ఱెన్ఱుమ్ శేవహమే యేత్తిప్పఱైకొళ్వాణా
ఇన్ఱు యామ్ వన్దోమిరఙ్గేలో రెమ్బావాయ్.

అర్థము:—అన్ఱు=నాడు, ఇవ్వులహమ్=ఈ లోకమును, అళ న్దాయ్=కొలిచితివి, అడి=(అట్టినీ) అడుగులకు, పోట్రి=మంగళాశాసనము అజ్గ=అచ్చటకు శెన్ఱు=పోయి, తెన్+ఇలజ్గై=దక్షిణద్వీపమగులంకను, శెట్రాయ్=నాశనముచేసితివి; ఆరల్=(నీ)బలమునకు, పోట్రి=మంగళా శాసనము.

శగడం=శకటాసురుని, పోన్ఱ=నాశమగునట్లు, ఉదైత్తాయ్=తన్ని నావు, పుహళ్=నీ కీర్తికి, పోట్రి=మంగళాశాసనము కన్ఱు=దూడను, కుణిల్+ఆ=కఱ్ఱయా అనునట్లు, ఎఱిన్దాయ్=విసిరివేసితివి. కళల్= అడుగులకు, పోట్రి=మంగళము.

కున్ఱు=కొండ, కొడైయా=గొడుగా అన్నట్లు, ఎడుత్తాయ్=ఎత్తి తివి, కుణమ్+పోట్రి(నీ)గుణమునకు మంగళము.

వెన్ఱు=గెలిచి, పహై=పగ, కెడుమ్=నశింపజేసిన, నిన్+ కైయిల్=నీ చేతి, వేల్=బల్లెమునకు, పోట్రి=మంగళము.

ఉన్=నీ, శేవగమే=శౌర్యమే, ఏత్తి=పొగడి, యామ్=మేము, ఇన్ఱు=ఇప్పుడు, పఱై=దక్క(కోర్కె) కొళ్వార్=కొనువారమై, వన్దోమ్= వచ్చితిమి. ఇరజ్గు=దయజూడుము.

తాత్పర్యము:—దేవతల కార్యార్థము జన్మరహితుడైన నీవు స్వేచ్ఛచేతనే వామనావతారుడై, అదితికశ్యపుల తపఃఫలితముగ అవతరించితివి.

భక్తప్రహ్లాదుని మనుమడగు బలిచక్రవర్తిని, అహంకార మమకార దూషితుని, పునీతు నొనర్చుటకును దానవ్యాజమున మూడడుగుల తోడనే సర్వప్రపంచము నాక్రమించితివి. అట్టి నీ పాదారవిందములకు జయమంగళము.

కంసుని పంపుచేత పసిబాలురను పట్టుబెట్ట శకటరూపము దాల్చి వచ్చిన పోలసుదిండి బంధములు పడలి నుసి మసి యగునట్లు, జాడించి తన్నిన నీ పాదపట్టనకు శ్రీమంగళము.

అటులనే వత్సాకారుడైన, రక్కసుని కట్టెపుల్లవలె విసరివేసిన జగజెట్టికి నీకు దివ్యమంగళము.

తనకుచేయు యజ్ఞమును విడిచిపెట్టి కొండకు పండుగ చేయుటచే కోపోద్దండుడై యాఖండలుండు అఖండ కుంభవృష్టి గురిపింప, పిడుగుల వడగండ్ల బారికి చిక్కిన, దిక్కుదెలియక తపించుచున్న గోవత్స గోపీ గోపాలకుల సంరక్షింప నాత్తత్రాణపరాయణుడైన నందనందనుడవగు నీవు గొడుగువలె గోవర్ధన అహార్యమును ఎత్తితివి. అట్టి నీ దయాగుణమునకు సర్వమంగళము.

శత్రువుల నోడించి వారి తలబిరుసుతనము అహంకార మమకారములను తొలగించి, వారిని గూడ దాసులనుగా జేసికొన్న నీ వేలాయుధమునకు అఖండ మంగళము.

ఇట్లు నీదివ్యగుణ సంకీర్తన మొనర్చి నీ ఆదరాభిమానముల చూరగొని దయాపాంగ ప్రసార పరీవాహ ప్లవమానలమై మా కోరికలం దీర్చుకొన వచ్చిన గొల్లకన్నెలమగు మాపై కడగంటి వెన్నెలల సారించుము.

అనువాదము:—

జయమంగళము స్వామి! జగములం గొలిచిన
యానాటి నీదు పాదాబ్జములకు
శుభమంగళము లంక జొచ్చి యా పొలదిండి
దనుజులం జెండు దోర్దండములకు
శ్రీమంగళము బండిరేద్రిమ్మరిని మట్టు
వెట్టిన నీ పాదఘట్టనకును
దివ్యమంగళము దైతేయువత్సాకారు
కట్టినా విసరిన కెట్టిదునకు

మాటకందని నీమహిమల నుతించి
వాంఛితార్థము పడయుంగ వచ్చినాము
ఆతపత్రీకృతోన్నతాహార్య నీకు
మంగళము సర్వజేతకు మంగళమ్ము.

## 25 వ పాశురము

అవ:— కృష్ణుని పొగడుచున్నారు గోపికలు.

పాశురము:—

ఒరుత్తి మహనాయ్ పరందోరిరవిల్
ఒరుత్తి మహనా యొళిత్తు వళర
తరక్కిల్లా నాహిత్తాన్ తీజ్ఞనినైన్ద
కరుత్తై ప్పిళైప్పిత్తు కఞ్జన్ వయత్రిల్
నెరుప్పెన్న నిన్ద నెడుమాలే యున్నై
అరుత్తిత్తు వన్దోమ్ పరై తరుదియాహిల్
తిరుత్తక్క శెల్వమ్ శేవగముమ్ యాంపాడి
వరుత్తమ్ తీరున్దు మహిళ్ న్దేలో రెమ్బావాయ్.

అర్థము:— ఒరుత్తి=ఒకతెయొక్క, మగన్+ఆయ్=కుమారుడయి, పఱన్ద=పుట్టి, ఓర్+ఇరవిల్=ఒక రాత్రియందు, ఒరుత్తి+మగనాయ్=ఒకతె పుత్రుడయి, ఒళిత్తు=దాగి, వళర=పెరగగా, తరక్క=సహనము, ఇల్లాన్+ఆహి త్తాన్=లేనివాడయిన తాను, తీజ్ఞనినైన్ద=చెరుపుతలచిన, కరుత్తై=సంకల్పమును, పిళై ప్పిత్తు=వ్యర్థపరచి, కఞ్జన్=కంసునియొక్క, వయత్రిల్=కడుపున, నెరుప్పు+ఎన్న=నిప్పుఅన్నట్లు, నిన్ద=నిలచిన, నెడుమాలె=పరదైవమా! ఉన్నై=నిన్ను, అరుత్తిత్తు=అర్థించు, వన్దోమ్=వచ్చితిమి, పఱై=కాంక్షితము, తరుదియాహిల్=ఇచ్చెదవేని, తిరుత్తక్క=తగిన, శెల్వమ్=సంపదను, శేవగముమ్=శౌర్యమును, యామ్=మేము, పాడి=కీర్తించి, వరుత్తమ్=వియోగమును, తీరున్దు=తీరి, మహిళ్న్దు=సంతసింతుము.

తాత్పర్యము:— పుట్టుక లేనివాడయ్యును, పరమాత్మసంకల్పమాత్రమున దుష్టులను దండించి, శిష్టులకు క్షేమము కూర్చి, ధర్మోద్ధరణ చేయగలవాడయ్యును తనవంటి కొడుకును కోరిన, పృశ్ని సుతపులకు అట్టి వరమిచ్చి తన్ను బోలినవాడు, వేరొక్కడు లేనందున తానే కొడుకుగా వారికి అవతరించినవాడు. ఐన నేమి ఆ కొడుకు ముద్దుముచ్చటలు చూచి యానందించు భాగ్య మామెకు లేదు. కంసుని భీతికి జడిసి వసుదేవు డొక్క రాత్రికే కొడుకును రేపల్లెకు యశోద ప్రక్కకు చేర్చెను.

యశోద తపఃఫల మేమందుము? భగవానుని, బాల్యలీలావినోదముల ననుభవించి యానందించినది. యశోదానందుల కొడుకుగానే వర్ధిల్లినా డతడు.

కంసుని ఘాతుకచర్యలకు, బాలకృష్ణుని రక్కసిదాడులనుండి రక్షించుటకు విలువైన వస్తువులను పశ్యతోహరులనుండి దాచి రక్షించినట్లు "ఒళిత్తువళర" రహస్యముగా పెంచినారు.

క్షత్రియవంశ సంజాతుడైనను, వైదిక జాతకర్మాదులకు నోచుకోలేదు. పరమాత్మకేమి? జాతకర్మమేమి? సహస్రనామునకేమి? నామకరణమేమి?

అష్టమ గర్భంబు మారకమని, దేవకి యెప్పుడు ప్రసవించునోయని పుట్టిన వెంటనే శిశువు నసువుల గ్రోలదలచిన కంసునకు భగవన్మాయచేత రాత్రిజరిగిన సంగతి తెలియదు. కృష్ణ స్థానమున యశోదకూతురు మాయ చేరుట తెలియని కంసు డామెను బలిగొననెంచి కృతార్థుడు గాక, ఆమెవలన తనకు మారకుడు పెరుగుచున్నాడని విని వానిని రూపుమాపదలచి పూతనాది రక్కసులను పంపుచున్నాడు.

కృష్ణుని మరణము వినువరకు వానికి సహనము లేదు. నెమ్మది లేదు. ఆతడు దుష్టసంకల్పముచేత చేయు పను లన్నియు మాయగొల్లని మాయలకు మటుమాయములైనవి. అది యొక చిచ్చువలె కంసుని కడుపున సంకటము గలిగించుచున్నది. కృష్ణుడు కంసాదుల కెట్టి మనోవేదనాకరుడైనను, రేపల్లెవాడలకు నందనందనుని లీలావిలాసములు పరమానంద కందములు. ఐన నేమి? ప్రత్యక్ష సుఖజనకములైనను సజ్జన సమాగమములు పరోక్ష వేదనాకరములు గదా!

బాలకృష్ణుని లీలావినోదములకు తన్మయులైన గోపికలకు, ఆతని విరహము భరింపరానిదైనది. వారి సమాగమము నరికట్టిన పెద్దలు విధిలేక, అనావృష్టి దోషనివారణకు కృష్ణనాయకత్వమున వ్రతానుష్ఠానమునకు గొల్లవడుచుల కనుమతి యొసంగినారు. ఈ వ్యాజముతో కృష్ణుని సమీపించి ప్రబోధించి కామితములు దీర్చికొనబూనినారు గోపకన్యలు.

వారి కోరిక ప్రకారార్థమైన 'పఱై' అను వాద్యము అది వ్యాజ మాత్రము. "ఉనక్కే" "అరుత్తిత్తి వన్దోమ్" నిన్నే అర్థించి వచ్చినాము. నీవే మా కాంక్షితార్థము.

జీవుల యోగక్షేమముం నన్నింటిని యెఱయు పరమాత్మ ప్రత్యక్షముగ సన్నిహితుడై యుండ, చిల్లరవస్తువులు కోరికొనువా రవివేకులు గదా! సమస్తము నర్పించు తండ్రిని ఒక్క పైసా యిమ్మని యర్థించువా రజ్ఞానులు గాదా!

కావున జ్ఞానులు పరమాత్మను గొల్చి ప్రత్యక్షమైన యాతనిని లౌకికభోగముల నాశింపక సాయుజ్యమునే కోరవలయును.

గోపికలు వాద్యము నడుగుట పెద్దల కనుమూయుటకే, తమ కాంక్షితముల దీర్చునని యాతని, "తిరుత్తక్క శెల్వయుమ్ శేవగముమ్" పాడి, అఘటనఘటనా సామర్థ్యమును వీర్యమును బొగడి తన్మయులై "వరుత్తమ్ తీరున్దు" వియోగవ్యథను బాపికొని సుఖింతు మని కీర్తించినారు.

విశేషార్థము:— భగవంతుని ప్రాప్తికి ఇతర సాధ్యోపాయముల కన్న, అతడే సిద్ధోపాయము, ఆశ్రయింపదగినవాడు. అతని చరణ కమలములను శరణుజొచ్చి భవబంధ దుఃఖములను తొలగి దివ్య విభూతియందు తత్సేవా సౌభాగ్యానందము ననుభవించుటే జీవికి భద్రమైనది.

తనుహృద్భాషల సఖ్యమున్
శ్రవణమున్ దాసత్వమున్ వందనా
ర్చనముల్ సేవయు నాత్మలో
నెఱుకయున్ సంకీర్తనల్ చింతనం
బను నీ తొమ్మిది భక్తిమార్గముల
సర్వాత్మున్ హరిన్నమ్మి స
జ్జనుఁడై యుండుట భద్రమంచుఁ
దలఁతున్ సత్యంబు దైత్యోత్తమా. (పోతన)

అట్లు భక్తిమార్గమున భగవంతుని నమ్ముకొనియున్న యాతనికి ముక్తి కరతలామలకము.

ముక్తిస్వరూపమును పలువురు పలుతెగల వివరింతురు.

"కొందరు మిత్తి ముక్తియను
కొందు; రవిద్య తొలంగి పోవుటే
కొందరు ముక్తియందు; రిఁక
కొందరు జన్మవిముక్తి ముక్తిఁ జే
ర్కొందురు: వారదెట్టు లను
కొన్నను దివ్యవిభూతియందు గో
విందయొసంగుమయ్యా నిను పే
దితి నీ పరిచర్య కేశవా. (నా కేశవ ప్రపత్తి)

అన్నట్లు పరంధామమున పరమాత్మ సన్నిధానమున తత్సేవలొనర్చి అతని నానందపరచి తా మానందపడుట జీవులకు పరమానందము. అదియ ముక్తి. అది సాధించుటకు సాధ్యములైన ఇతరోపాయములకంటె సిద్ధమైన భగవచ్చరణారవిందయుగళమే సులభతరోపాయము.

అనువాదము:—

ఒక తల్లి తనయుఁడై యొదవి నీవొక రేయి
యొకతెకు బుడుతఁడై యొదిగి యొదిగి;
మనికి గిట్టని మామ మదిలోనఁ బొదలెడి
తలపుల నెల్లరిత్తల నొనర్చి
కలవరింతయు వంత కలతయు నులుకింత
యుడివోని కంసుని కడుపులోన
కడివోని బెడిదంపు కారుచిచ్చునుఁ బోలె
అదిరి నిల్చిన హాటకాంబరుండ
"దేహి" యని వచ్చినారము దేవ దేవ;
యీవు కరుణింప నుతియింతు మేము నీదు
భవ్యసౌభాగ్యసౌశీల్య వైభవముల;
నడగ, సంతాప, మానంద మావహిల్ల.

## 26 వ పాశురము

అవ:— తమకు వలసిన వ్రతపరికరముల గోరుచున్నారు.

పాశురము:—

మాలే మణివణ్ణా మార్గళి నీరాడువాన్
మేలై యార్ శెయ్‌వనగళ్ వేణ్డువన కేట్టియేల్
ఞాలత్తై యెల్లామ్ నడుఙ్గ మురల్వన
పాలన్న వణ్ణత్తు ఉన్ పాఞ్చశన్నియమే
పోల్వన శఙ్గఙ్గళ్ పోయ్‌ప్పాడుడై యనవే
శాల ప్పెరుమ్‌పఱైయే పల్లాణ్డిశైప్పారే
కోలవిళక్కే కొడియే విదానమే
ఆలి నిలైయాయ్ అరుళేలోరెమ్బావాయ్.

అర్థము:— మాలే-మాలిమిగలవాడా! మణివణ్ణా!=ఇంద్రనీల మణివంటి వన్నెగలవాడా! మార్గళి+నీ+రాడువాన్-మార్గశీర్ష స్నాన మాడునట్టి, మేలై యార్=ఉత్తములు, శెయ్‌వనగళ్-చేయుపనులు, వేణ్డువన-వలసినవియు, కేట్టియేల్-వింటివేని, ఞాలత్తైన్+ఎల్లామ్-నేలయంతయు, నడుఙ్గ-అదరునట్లు, మురల్వన-మొఱయునట్టి, పాలన్న+వణ్ణత్తు-పాలవన్నెగల, ఉన్-నీ, పాఞ్చశన్నియమే+పోల్వన-పాంచజన్యమును బోలిన, శఙ్గఙ్గళ్-శంఖములు, పోయ్‌పాడ్+ఉడై యనవే-అతివిస్తారతగలిగిన, శాల+పెరుమ్-చాల పెద్ద, పఱైయే-వాద్యమును, పల్లాణ్డు+ఇశైప్పారే-పల్లాండు చెప్పువారు, కోలవిళక్కే-దీప స్తంభములు, కొడియే-ధ్వజము, విదానమే-మేల్కట్టును, ఆలి+నిలై యాయ్-మఱ్ఱియాకు నిలయముగాగల, (ఓ వటపత్రశాయీ) అరుళ్-అనుగ్రహించుము.

తాత్పర్యము:— మహానుభావా! నీకు మాపై అనురాగము మెండు. కావుననే దర్శనమిచ్చి, వేకువనే లేచివచ్చి ఇచ్చట కొలువుదీరి మా కోర్కుల విన నవధరించితివి. ఇంద్రనీల కాంతిమంతమగు నీ సుకుమార సుందర శరీరమును మా నయన గోచరమొనర్చితివి. మా మధ్యకు

వచ్చితివి. ఇదియే మా భాగ్యము. ఇక వ్రతాచరణకు నీ పాంచజన్యము వంటి శంఖములు, వాద్యములు, గాయకులు, పల్లాండు పాడువారు దీప ధ్వజ వితానములు అనుగ్రహింప అర్థించుచున్నాము అని ప్రార్థించి నారు.

విశేషార్థములు:—

చేతనులు భగవదంశభూతులు. భగవన్మాయకు లోగి ఆతని సాన్నిధ్యము నుండి జారిపడి, సుఖభ్రాంతిచే నశ్వరములైన విషయ ములయం దాసక్తులై ఇంద్రియచాపల్యముచే క్షణికసుఖములకు పలువెతల బడును కర్మఫలానుభూతికి పలుజన్మల నెత్తుచున్నారు.

మానవత్వము వచ్చిన మీదట రాజస తామస గుణాతిశయముగల జన్మల నొంది, జ్ఞాతాజ్ఞాత సుకృతముచే సాత్త్వికాతిశయముగల జన్మ లభించి ఆచార్యముఖమున పరమపురుషప్రాప్తికి యత్నపడుచున్నారు.

"బహూనాం జన్మనామంతే జ్ఞానవాన్ మాం ప్రపద్యతే" గీత

ఎన్ని జన్మల యనంతరమో మోక్షవిషయక జ్ఞానముగల వార గుట. అట్టి జ్ఞానము గలుగుటయే అరుదు. కలిగినా, ఇతర చిల్లరదైవ ములు రక్షింతురని భ్రమతో వారి నాశ్రయించు వారే మెండు. అటుగాక ఏ యొక్కడో నారాయణు నాశ్రయించువాడు. ఇతర దైవము లకు భగవన్మాయను తరింపజేసి మోక్షమునిచ్చు శక్తి లేదు. మోక్షమే సంసారమున గుందు జీవులకు సరియగు రక్షణ. అద్దాని నొసంగజాలిన వాడు నారాయణుడే.

కళ్ళచ్చగడమ్ కలక్కషియక్కాలోచ్చి—శకటాసురుని మర్దించి, పేయేములైగ్గుడు—పూతన చనువిషముగ్రోలి, మావాయ్‌పిలిన్దానై— అశ్వాసురు హతమార్చి, మల్లరై మాట్టియ—చాణూర ముష్టికుల సంహ రించి, శివత్తినాల్—తెన్నిలజ్గైకోమానై చ్చట—లంకాధిపతిని రూపుమాపి

సాధువుల రక్షించుటకు ధర్మము నుద్ధరించుటకు ముందు పడువాడు. అంతియగాక దేవతలకుగూడ క్షేమము గలిగింప, "అమ్బర మూడరుత్తోజ్గి వులహళంద" అని వామనావతారుడై త్రివిక్రమమూర్తి యైనవాడు శ్రీమన్నారాయణుడే. ఆతడే మన యోగక్షేమముల నరయువాడు. "నారాయణనే నమక్కే పఱై తరువాన్" అని మహావిశ్వాసముచేత,

జీవు లతని శరణుజొరవలయును. తచ్చరణ శరణాగతులైన వీరు అతనిని "తూయోమాయ్ వన్దోమ్ తుయిలెషుప్పొదు వాఙ్" అని తత్ప్రపత్తి తప్ప వేరు జ్ఞానకర్మాది యోగములచేత తరింవగలమను ఆశాలేశము లేని అకించనులైన వీరు, "నెయ్యుణ్ణోమ్ పాలుణ్ణోమ్" అని, అతనికి ప్రతికూలాచరణము మానిన వీరు, మామాయన్ మాదవన్ వైకున్దన్ ఏన్ఱెణ్ణు నామమ్‌పలవుమ్ నవిణ్ఱు" అని అతనిని మనసార ధ్యానించుట యను అనుకూలాచరణముగలవారై "దేవాదిదేవనై చ్చెన్ఱునామ్ సేవిత్తాన్" అని ఆ దేవాధిదేవుని నిస్సమాభ్యధికుని సమీపించి తచ్చరణ కమలముల ప్రపత్తి యొనర్చుచున్నారు.

ఆతడు "మీ యోగక్షేమముల నేను గమనింతునని, "నెన్నె లేవాయ్ నేర్‌న్దాన్" "అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః" అని మాట యిచ్చినాడు కావున స్వచరణశరణాగతులకు ప్రతిబంధకముల బాపుట యను రక్షణ తప్పక కృపచేయును, తన సన్నిధికి చేర్చుకొనును,

ఆ విధముగ భవబంధములు తొలగి దివ్యధామము చేరినవారికి సాలోక్య ప్రాప్తి మాత్రముగాక, సారూప్యము అతని దివ్యాయుధాభరణములవంటి యాభరణములును లభించును. అదియే పాశురమున వర్ణితము. "పాలన్నవణ్ణత్తుమ్ పాఞ్చశన్నియమే పోల్వన్న శఙ్గఙ్గళ్" ఇత్యాదులచేత, అతని తాదాత్మ్యము గాక. 'పోల్వన'-పోలిన అనుట చేత తద్రూపము పోలినరూపము శంఖచక్రాద్యాభరణములు ముక్తచేతనులకు లభించు చున్నవని తెలియుచున్నది.

అట్టి వీరు "వల్లాందు శెప్పారే" అన్నట్లు భగవత్సేవాపరులైన దివ్యసూరులు పరివేష్టించియున్న స్వామిసన్నిధానమున సారూప్య ముక్తి పొందుదురని నిరూపితము.

అనువాదము:—

తమిళాంధ! హరిసుందరమదీయ! మార్గశీ
ర్షస్నాన జనతపాచార పరులు
శిష్టులొనర్చెడిచెయిదమ్ము లర్థమ్ము
లెవ్వినా, ఆలింపు మిందిరేశ!

వటపలాశ శయానః నటనావిచక్షణ
స్థిర దద్దరిల్లి శబ్దించునవియు
పాలవన్నెల నీదు పాంచజన్యముం బోలు
కమనీయములు శంఖములు మాకు

నీకు పల్లాండు పాడెడి నెలంతలకును
ననుగుణంబగు డక్కి, కేతనము కంబ
దివ్వియలు మేల్వితానము దివ్యమంగ
ళాంగః దయసేయుమాః కరుణాంతరంగ.

## 27 వ పాశురము

అవతారిక: — గోపిక లింకను తమకు కావలసిన సుమంగళద్రవ్యముల నీ పాశురమున గోరుచున్నారు.

పాశురము: —

కూడారై వెల్లుంశీర్ గోవిందాః వున్దన్నై
ప్పాడి పఱై కొణ్డుయామ్పెరు శమ్మానమ్
నాడుపుగఝమ్ పరిసినాల్ నన్ఱాహ
చ్చూడగమే తోళ్వళైయే తోడే శవిప్పూవే
ప్పాడగమే యెన్ఱనైయ పల్కలనుమ్ యామణివోమ్
ఆడైయుడుప్పో మదణా పిన్నే పాల్శోఱు
మూడ, నెయ్పెయ్దు ముఝఙ్గైవఝివార
క్కూడియిరున్దు కుళిర్న్దేలో రెమ్పావాయ్.

అర్థము: — కూడారై =కూడని వారిని, వెల్లుమ్-గెలుంగల, శీర్-గుణములుగల, గోవిందా-గోవిందుడా! ఉన్నైన్నై-నిన్ను, పాడ-కీర్తించి పఱై+కొండు-వాద్యముగొని. యామ్-మేము, పెరు+శమ్మానమ్-పొందు సన్మానము:

నాడు–దేశము, పుగష్+పరిసినాల్–పొగడువిధముగా, సన్మానం–చక్కగా, శూడగమే–గాజులు, తోళ్+వళైయే–దండ, కడియములు, తోడే–కమ్మలు, శెవి+పూవే=కర్ణావతంసములు, పాడగమే–అందెలు, ఎన్నసైయు=అనునట్టి, పల్కలనుమ్–పలునగలు, యామ్–మేము, అణివోమ్=అలంకరింతుము. ఆడై–ఉడుపులు, ఉడుప్పోమ్–ధరింతుము, అదై+పిన్నే=దాని తరువాత; పాల్+శోఱు–పాయసము, మూడ–మునుగునట్లు, నెయ్+పెయ్దు=నేయి కుమ్మరించి, ముషఙ్గై+వషి–ముంజేతివెంట, వార–కారగా, కుడి+ఇరున్దు–(నీతోపాటు) కలసియుండి, కుళిర్న్దు–సుఖించ (అనుభవించ) వలయును.

తాత్పర్యము! మహామభావా! కరుణార్ద్రహృదయా! నిన్ను కీర్తించి వాద్యము పొంది మా వ్రతానుష్ఠానమును మేము పొందు సన్మానము లోకులెల్ల పొగడునట్లుండవలెను. సుమంగళీ సౌభాగ్యకరములైన నగలు–చేతులకు గాజులు, రెట్టకడియములు, కర్ణావతంసములు, చెవికమ్మలు, కాలియందెలు, కట్టనందమైన యుడుపులు కావలయును.

మంగళస్నాన మాడి, నూతన వస్త్రములు దాల్చి, భజించి, అటుపై యజ్ఞామృతమైన క్షీరాన్నమును నేతమును ఆ నేయి, మోచేతివెంట కారుచుండ నీతోబాటు కలిసి భుజించి యానందింపవలయును.

విశేషార్థము:— చేతనులు భగవంతుని శరణుజొచ్చి తత్సాలోక్య సారూప్యమును పొందుట ముందుపాశురమున చెప్పబడినది.

ముక్తికి పరమ ప్రయోజనము–సేవలచేత భగవంతుని ఆనందింపజేసి తా మానందించుటయే.

ఏ విధముగ చేతను డుండిన భగవంతు డానందించునో గమనించి మెలగవలయును.

పురుషోత్తముడొక్కడే పురుషుడు. జీవులందరు స్త్రీప్రాయులు. అతని కిది యానందము, ఇది ఖేదమని యేమున్నది. స్థితప్రజ్ఞుడైన చేతనుడే—

సుఖదుఃఖే సమే కృత్వా లాభాలాభౌ జయాజయౌ" అని రెంట నిర్లిప్తుడుగా నుండవలయునన్న, పరమాత్మ ఇది మంచి, ఇది చెడు, ఇది విషము, ఇది అమృతము అని గలదా?

కాని భక్తుడు స్వానుభవముతో "ఇది మంచి" అని నిర్ణయించి, చెడును తొలగించి మంచి చేయుచుండవలెను.

శబరి తీయని పండ్ల నేరి శ్రీరామచంద్రున కర్పించినది గదా, తనకు తీపు చేదు అను వైషమ్యము లేకున్నను ! భగవంతుడు శ్రద్ధా భక్తులను పరికించును, వస్తువు విలువను గాదు.

"పత్రం పుష్పం ఫలం తోయం
యో మే భక్త్యా ప్రయచ్ఛతి." గీత.

పండో, పూవో, పత్రమో, జలమో, ఏదియైనను సరియే భక్తితో నర్పించుట అతని కవసరము. పూతన చనువిషము గ్రోలినవానికి చేదేమి? తీపేమి?

కావున లోకానుభవముతో జను లభిమానించువానిని మంగళకరము లని కాంక్షించినారు గోపచేతనులు. అదియు భగవానున కానైనతలు ఆనందము గలిగించునవియే. గాజులు, కమ్మలు, మేలియుడుపులు, మంగళకరములు.

"ఈ శరీరము నాది, దీనిని పన్నీట గడిగి రమ్యముగ నలంకరించి సెంటు పూసి నలుగురు మెచ్చునట్లు మేలియుడుపులతో సింగారింప వలయును. అందములుకునట్లు నానాభూషణములతో నలంకరింప వలయు నను భావముతో శరీరపోషణ అలంకరణ చేయరాదు. శరీరముపై వ్యామోహము మమకార ముండరాదు. బ్రతుకుటకు తిన వలయును. తినుటకే బ్రతుకరాదు.

అటుగాక "ఇది భగవంతుని సొత్తు, ఇందంతరాత్మ గలడు గాన ఈ శరీరము దేవాలయము. దీనిని కోవెల అలికి ముగ్గులు పెట్టి, తోరణ ములు కట్టి అలంకరించినట్లు, భగవత్ప్రీతికై సింగారింపవలెను అను దృష్టితో మేలియుడుపులు ధరించి ఆభరణములచే అలంకరించుట తప్పు గాదు. ఉద్దేశ్యమే ప్రధానము.

అట్లు మేలి ఉడుపులు నగలు ధరించి, భగవత్ప్రీతికరమైన ఘృత మిశ్రిత క్షీరాన్నమును కలసి భుజించుట సాయుజ్యము. క్షీరాన్న ముప లక్షణము. "సోఽశ్నుతే సర్వాన్ కామాన్ సహ బ్రహ్మణా విపశ్చితా" అని పరబ్రహ్మతో బాటు జీవునకు సకల కామానుభోగము శ్రుతి ప్రసిద్ధము.

ఆ ముక్తిని పొందుటకు ప్రయత్నించుటయే మానవజన్మ సార్థకత నాపాదించును. తత్సాధనకు ప్రతిచేతనుడు పాటుపడవలయును.

అనువాదము :—

కూడని పెరవారి నోడించు బలియుఁడా!
గోవింద! మేము నిన్ గొలిచి పాడి
కైకొని ధక్క, లోకము లెల్లఁ బొగడఁగఁ
బడయు సన్మానంబు నుడువనిమ్ము
కరకంకణమ్ము లంగదములు కమ్మలు
చెవిపూలు కాలి మంజీరములును
మొదలైన పలునగల్ మురిసి కైసేసికొని
వలిపంపు మేలిదువ్వలువ గట్టి

పాయసాన్నము మునుగంగ నేయివోసి
పిదప నయ్యది మోచేతివెంట గార
నించు రుచిపాకముల నెచ్చరించు కొనుచు
తింద మందరుగూడి యానందమొంద.

## 28 వ పాశురము

అవ!— మా తప్పులను మన్నించి మా సేవ లంగీకరింపు మని ప్రార్థించు చున్నారు.

కఱవైగళ్ పిన్ శెన్ఱు కానమ్ శేర్న్దుణ్బోమ్
అఱివొన్ఱుమిల్లాద వాయ్ కులత్తున్దన్నై
పిఱవి పెఱున్దనై ప్పుణ్ణియమ్ నాముడైయోమ్
కుఱైవొన్ఱు మిల్లాద గోవిందా వున్దన్నో

డఱవేల్ నమక్కిజ్గో షిక్క ఒషియాదు
అఱియాద పిళ్లైనాళోమమ్బినాలున్ఱన్నై
చ్చిఱుపేర ష్షైత్తనవుమ్ శీఱియరుళాదే
ఇఱైవా నీ తాఱాయ్ పఱై యేలో రెమ్బావాయ్.

అర్థము:— కఱ వైగళ్+పిన్నె=దూడల వెనుక, శెన్ఱు-పోయి, కానమ్-కాననము, శేర్న్దు-చేరి, ఉణ్బోమ్-జీవించుచున్నాము, అఱివు తెలివి, ఒన్ఱుమ్=కొంచమైనను, ఇల్లాద=లేని, ఆయ్+కులత్తు=గొల్లకుల మున, ఉన్ఱన్నై-నీ యొక్క, పిఱవి-పుట్టువు, పెఱున్దనై-వడసిన, పుణ్ణి యమ్-పున్నెము, నామ్+ఉడైయోమ్-మేము పొందితిమి, కుఱైవు= కొఱత, ఒన్ఱుమ్-కొంచమైన, ఇల్లాద-లేని, కోవిందా-గోవిందా!, ఉన్ఱ న్నోడు-నీ తోడ, ఉఱవేల్-దగులము, నమక్కు=మాకు, ఇఙ్గు=ఇక్కడ, ఒషిక్క-పోద్రోలుటకు, ఒషియాదు-సాధ్యము గాదు.

అఱియాద+పిళ్లైహళోమ్-తెలివిలేని పిల్లలము. అమ్బినాల్- ప్రేమతో, ఉన్ఱన్నై=నిన్ను, శిరు+పేర్-చిన్న పేరున, అష్షైత్తనవుమ్- పిలిచితిమి, శీఱి+అరుళాదే-కోపించుకొనకుము, ఇఱైవా-రాజా! పఱై- కోరికను, తారాయ్-ఇమ్ము.

తాత్పర్యము:- కృష్ణా! మే మావుదూడలను మేపుటకు అడవులకు తోలుకొనిపోయి, జీవితము గడుపుకొను గొల్ల పిల్లలము. ప్రపంచ వ్యవ హార జ్ఞానము నాగరకతలేని మా యీ గొల్ల కులమున నీవు అవతరించుట మా భాగ్యవిశేషము.

పొరపొచ్చములు లేక కలసి మెలసి తిరుగుచున్న మనయొక్క యీ బంధమును విడదీయుట కెవరికిని సాధ్యము గాదు.

ఓ రాజా! తెలివిమాలిన, తారతమ్య మెరుంగని, గోవులతో మెల గుట గోవులవంటి మేము నీ గొప్పదనము తెలియ లేక, కృష్ణా! యని సఖా! యని ఏరా! యని పిలిచి నిన్నగౌరవ పరచితిమి. అట్లని మాపై కోపమూనకుము. నిన్నర్థించు మా కోరిక లీడేర్చుము.

విశేషార్థము:— చేతనులు పరాత్పరుని వేడుకొనుచున్నారు.

మహానుభావా ! ప్రకృతిబంధమున దగుల్కొని, పశుప్రాయులమై, తత్త్వము తెలిసికోలేని యజ్ఞానులము. నీవు పరాత్పరుడవు. మమ్ము ద్ధరింప నీ నైజతేజము కుంచించుకొని దివ్యవిభూతిని వీడి ప్రాకృత మండలమున నూతనరూపమున విభవావతారుడుగ నవతరించితివి.

మాతో కలసి మెలసి తినుట మా భాగ్యవిశేషము. నీవు సమస్త మునకును రాజువు ప్రష్టవు లయకర్తవును.

అహం కృత్స్నస్య జగతః
ప్రభవః ప్రలయస్తథా,
మత్తః పరతరం నాన్య
త్కించి దస్తి ధనంజయ.
పితా౽హమస్య జగతః
మాతాధాతా పితామహః,
గతిర్భర్తా ప్రభు స్సాక్షి
నివాస శ్శరణం సుహృత్,
ప్రభవః ప్రళయః స్థానం
నిధానం బీజ మవ్యయమ్. గీత.

అని ఈ సమస్తమునకు సృష్టిలయకారకుడవు. ధారకుడవు. పోషకుడవు నీవే అని నీవే చెప్పికొంటివి. లేకున్న నీ ప్రాభవము తెలిసి కొన మే మెంతవారము ? మే మెవ్వరమో తెలిసికోలేని మూఢులకు "మమైవాంశో జీవలోకే జీవభూత స్సనాతనః" అని జీవకోటిలోని మమ్ము నీ యొక్క అంశలమని తెలియజెప్పితివి.

నీకును మాకును పితృపుత్ర, రక్ష్య రక్షక, శేష శేషి, భార్యా భర్తృ, జ్ఞాతృజ్ఞేయ, స్వస్వామ్య, అధారాధేయ శరీరాత్మ భోక్తృభోగ్య రూప నవవిధ సంబంధములు అనాదిసిద్ధములు. ఇట్టి ఈ సంబంధ బాంధవ్యమును తెగదెంచుట కెవ్వరికి సాధ్యము ? తెంచిన తెగు బంధమా యిది ?

తదహం త్వద్ఋతే న నాథవాన్
మద్ఋతే త్వం దయనీయవాన్న చ,
విధినిర్మిత మే తదన్వయం
భగవన్పాలయ మా స్మ జీహపః.

(శ్రీ యామునాచార్యులు)

కాన నో జగన్నాథా! నా స్వామీ!
నీకు నను వీడి మరి దయనీయుడొండు
లేడు నీకంటె దయఁజూచువాఁడు నాకు
దైవ నిర్ణీతమైన బాంధవ్య మిద్ది
దీని విడనాడఁజూడకో దేవదేవ!

(నా యతిరాజీయము)

మన కిద్దరికిగల సంబంధమును నీపై నీవు విడిపోజూడకుము. నీవు చేయి విడచిన ఆనాథ నగుదును. నిన్ను వినా నాకు రక్షకు డితరు డెవ్వడు గలడు?

అంతియుగాదు సుమా! నాకంటె నీ దయకు పాత్రుడు మరెవ్వ రున్నారు? నన్నుదాసీనుని జేసితివా? నీ దయ నిరుపయోగమై త్రుప్పు పట్టి మూలబడిపోవును. కాన నన్నుద్ధరింపుము.

గజేంద్రుడు శబరి మొదలగు దీనుల నుద్ధరించి దయామయుడన్న బిరుదు సంపాదించుకొన్నావు. సంపాదించుట కష్టము. పోగొట్టుకొనుట సులభము. వచ్చిన బిరుదమును నిలబెట్టుకొనవలయునన్న నన్ను రక్షింపుము. నన్నేగాదు, నిన్ను నీ బిరుదమును రక్షించుకొనుము.

ఇందు నిన్నింత దేబరించ పని యేమి? నీ మాట నీవు తప్పు వాడవు కావు. ఆ విశ్వాసము నా కున్నది. నిన్నే శరణన్నవారిని, వారి పాపములు తుడిచివేసి తప్పక రక్షింతునని మాట యిచ్చితివి గదా! కాన రక్షించి తీరెదవు.

నీ మహత్త్వము తెలిసికొనక, మానుషదేహమున నున్నందున అజ్ఞానముచే మాబోటి సామాన్య మానవుడవే అని యనుకొని చులకనగ జూచి అగౌరవముగా పిలిచితిమి.

సఖేతి మత్వా ప్రసభం యదుక్తం
హే కృష్ణ హే యాదవ హే సఖేతి,
అజానతా మహిమానం తవేదం
మయా ప్రమాదాత్ ప్రణయేన వాపి.
యచ్చావహాసార్థ మసత్కృతోఽసి
విహారశయ్యాసన భోజనేషు,
ఏకోఽథవాప్యచ్యుత తత్సమక్షం
తత్క్షామయే త్వామహమప్రమేయమ్. గీత.

నా తప్పిదముల మన్నింపగోరుచున్నాను, మహానుభావా! నా కేది మంచిదని నీకు తోచునో అది యనుగ్రహింపుము. ఇది మంచి ఇది చెడ్డ అని నేను నిర్ణయింప నేరనివాడను. ప్రకృతి బంధములకు జిక్కని యింద్రియములు బాహ్యమోహముచేత సరియైన నిర్ణయము చేయనేరవు. నీవు నా హితైషివి గాన నీవే నా మంచి గుర్తించి దాని చేర్పుము. ఇదియ నా కోరిక దాని ననుగ్రహింపుము. నీ కివే నా సాష్టాంగ ప్రణామములు నీ మనఃప్రీతికై నీ సేవజేయుట యొక్కటే మేలి తెరువుగా భావించుచున్నాను. దాని నంగీకరించి నీ సన్నిధి చేర్చికొనుము. ఇట్లు నీవాడను.

అనువాదము:—

ఆలదూడల వెన్క నడవికిఁబోవుటే
దేహయాత్రోపాధి దేవః మాకు
తెలివిమాలిన గొల్లకులమున దేవరః
పుట్టుట మా పూర్వపుణ్యఫలము;
కొఱత యింతయులేని గోవిందః మన కున్న
ఈ బంధమును బాప నెవరితరము?
తెలిసి తెలియక నిన్ను వలపుబలుపునజేసి
హే కృష్ణ హే గోపః హే సఖా, య

టంచుఁ బిలిచిన పలుకుల నెంచుకొనక
తెల్లదామర పూవులఁ దెగడు కనుల
సంజతెంజాయ సొరనీక సరస లోచ
నాంత కాంతులఁ బరపు మా పంతలడగ.

## 29వ పాశురము

అవతారిక:— తమ రాక కేవలము లౌకికమైన వాద్యములు గైకొనుటకు మాత్రమే గాదు. సదా భగవానుని కైంకర్య సౌభాగ్యమును ప్రార్థించుటకే యనుచున్నారు.

పాశురము:—

శిట్రం శిరుకాలే వన్దున్నైచ్చేవిత్తున్
పొత్తామరై యడియే పోట్రుమ్ పొరుళ్ కేళాయ్
పెట్రమ్ మేయ్ త్తుణ్ణుమ్ కులత్తిల్ పిఱన్ద నీ
కుట్రేవలెజ్గళై క్కొళ్ళామల్ పోహాదు
ఇట్రైప్పఱై క్కొళ్వానన్ఱుకాణ్ కోవిన్దా!
ఎట్రైక్కుమ్ ఏళేళ్ పిఱవిక్కుమ్ ఉన్దన్నో
డుట్రోమేయావోమ్ ఉనక్కే నామాట్చెయ్వోమ్
మట్రైనజ్గామజ్గళ్ మాట్రేలో రెమ్బావాయ్.

అర్థము:— కోవిన్దా!—గోవిందా!, శిట్రం శిరుకాలే—అతి వేకువనే, వన్దు—వచ్చి, ఉన్నై—నిన్ను, సేవిత్తు—సేవించి, ఉన్—నీ, పొత్తామరై—పొన్దామరలవంటి, అడియే—అడుగులను, పోట్రుమ్—పొగడుటకు, పొరుళ్—అభిప్రాయము, కేళాయ్—విను.

పెట్రమ్—మందను, మేయ్ త్తు—మేపి, ఉణ్ణుమ్—భుజించు (జీవించు), కులత్తిల్—కులమున, పిఱన్ద—పుట్టిన, నీ—నీవు, కుట్రేవల్—అంతరంగిక సేవలయందు, ఎజ్గళై—నన్ను, కొళ్ళామల్+పోహాదు—కైకొనక పోరాదు.

ఇట్రై—నేడు, పఱై—వాద్యమును (లౌకిక వస్తువులను) కొళ్వాక్కా—కై కొనువారము. అన్రు—కాము, కాణ్—కనుము, ఎత్తెక్కుమ్—ఎప్పటికైనా, ఏషేషు+పిఅవిక్కుమ్—ఏడేడు జన్మలకును, ఉన్దన్నోడుమ్—నీతోడనే, ఉత్తోమేయావోమ్—పొందగలవారము. ఉనక్కే—నీకు, నామ్—మేము, ఆళ్+శెయ్‌వోమ్—దాస్యమొనరించువారము.

మత్తై—వేఱైన, నమ్+కామఙ్గళ్—మా కోరికలను, మాట్రు—మట్టు పెట్టుము (తొలగొట్టుము).

తాత్పర్యము:— స్వామీ! గోవిందా! తెల్ల తెల్లవారక మునుపే ఈ చలిలో నీ సన్నిధానమునకు వచ్చితిమి.

బంగారు తామరల సౌకుమార్య సౌన్దర్యములు అడచు మీ అడుగుదోయి నాశ్రయించి నుతించితిమి.

మేము కల్ల కపట మెరుంగని గొల్లలము; మాయమర్మములు తెలియనివారము. లోనొకటుంచుకొని పైకొకటియాడు చాకచక్యము లేనివారము.

నీ యెనలేని సౌన్దర్యమునకు వశలమై నీకు సకలోపచారముల నతి సన్నిహితముగ నందించేయువలయుననియే మా కోరిక.

నాగరకతలేని మొరటు పసులకాపరులని మమ్ము దూరము సేయకుము. పశువుల కాపరి కొమారుడవుగా నవతరించిన నీకు మా సేవల నంగీకరింపకుంట తగవుగాదు.

శంఖము, గొడుగు, డక్క ఇత్యాదులేగదా మీ రడిగినదందువేమో ఈ గవ్వల పీడులకు తోలు తప్పెటలకు చలి యనక రేయనక నిడురచెడి ఇంతదూరము రాబనియేమి? అది వట్టి సాకు. మాకు కావలసినది, నేటికే గాదు జన్మ జన్మాలకూ యుగయుగాలకూ మీ తిరువడిగళ కైంకర్య సౌభాగ్యమే.

ఒకవేళ జితేంద్రియులుగాని మాకు ఇంద్రియచాపల్యముచేత లౌకికములైన ఇతర వస్తువులపైన కోరికలు పొడసూపినను వాని నన్నింటిని తలయెత్త నీయక అడుగుమాలునట్లు అనుగ్రహింపుము.

విశేషార్థము:— పరమాత్మా! ఏ సుకృతాతిశయముచేతనో లభించిన ఆచార్యానుగ్రహము వలన నీ పరత్వము తెలిసికొంటిమి. భవ బంధము బాపి పరమపద మనుగ్రహింపజాలిన దైవము నీవే యని నిశ్చయించి ఆర్తులమై అనన్యగతికలమై రమాపతియైన నీ పొందా మరల యందమును దిందుపరచు పదద్వంద్వమే పరమపదప్రాప్తికి సిద్ధోపాయమని మహావిశ్వాసముతో నాశ్రయించితిమి.

లౌకికములైన వాంఛలు జీవిని బంధముల తగుల్కొనజేయునని వాటిపై ఆస ఉడిగి నీ సేవాసౌభాగ్యమే జీవితప్రయోజన మని ఎద నమ్మి యాశ్రయించితిమి.

నీవు పరాత్పరుడవే! అనంతగరుడ విష్వక్సేనాది నిత్యసూరిజనుల సేవల నందికొనువాడవే! మేము ప్రకృతిబద్ధులమై రజస్తమోదూషితు లమే. అట్లని మా సేవ నిరాకరింపదగదు.

నీవునూ లీలామానుషుడవై అవతరించినవాడవే గదా! నీకి పైతొడుగులు ప్రధానములు గావు. అట్లుండిన, మత్స్య కూర్మ వరాహ నృసింహరూపముల దాల్పెదవా? కావున మా భక్తిని ఆర్తిని గమనించి మాకు నీ సేవాభాగ్య మనుగ్రహింపుము.

"సత్యం శపేవారణ శైలనాథ
వైకుంఠవాసేఽపి నమేఽభిలాషః" (వేదాంతదేశికులు)

అన్నట్టు నీ సేవాభాగ్యమే మా కాంక్షితముగాని, పరమపదము పొందవలయునను కోరికయు లేదు. భూలోకమందే యుండినా, ఎన్ని జన్మలు గలిగినా సరే "ఎట్రుటుక్కుమేషేషు పిఱవిక్కుమ్ ఉన్దన్నోడు ముత్రో మేయావోమునక్కే మట్రై చ్ఛవోమ్" అన్నట్టు నీ సేవ తొలగకుండునటు లనుగ్రహింపుము.

ఏతద్దేహావసానే మాం త్వత్పాదం ప్రాపయ స్వయం"

అని దేహాంతమున ముక్తిగోరుటయు నీ పాదసేవకే, అదియే జీవులకు అవశ్యకము. అది అక్కడకేగి చేసిన నేమి? ఇక్కడుండి చేసిన నేమి? అంతయు నొక్కటే గదా! అందులకే కులశేఖరులు—

భావే భావే హృదయభవనే
భావయేయం భవంతం
ఏతత్ప్రార్థ్యం మమ బహు
మతం జన్మ జన్మాంతరేఽపి
త్వత్పాదాంభోరుహయుగ
గతా నిశ్చలా భక్తిరస్తు.

అని ప్రార్థించినారు. ఆ భక్తియు సేవాస్వరూపమే గదా! ఏ జన్మలనైనా నీ సేవనే గోరువారము. "మత్తైనకామజ్జ్ మాట్రు" ఇతర కోర్కెల మీదమనీయకుము అని ప్రార్థించుచున్నారు వ: కాంతులు.

అనువాదము:

నెచ్చెలిపిండుతో వచ్చి వేగకమున్న
నిన్ను సంసేవించి నీ తిరువడి
పొందామరలదోయిఁ బొగడుటలో గల
భావంబు నాలింపు దేవదేవ!
పశులమేపి భుజించు వంశాన జనియించి
వారింపరాదు గోపాల! మాదు
కైంకర్యములను; దక్కంగొంటకై కాదు
సుమ్ము మా యీ రాక శోభనాంగ!
యూని యేడేడుజన్మాలకేని నీదు
పాదపంకేజ దాస్యతత్పరల: మన్య
చింతలేవియు మామదిఁజేర నీకు
పరమ పావన భవదీయపాద మాన.

## 30 వ పాశురము

అవతారిక:—ఫలశ్రుతి ప్రతిపాదించు నీ పాశురము.

పజ్గక్కడల్ కడైన్ద మాధవనై క్కేశవనై
త్తిజ్గళ్ తిరుముహత్తుచ్చేయి షైయిూర్ శెన్ఱిఱైఞ్జి
అజ్గప్పఱైకొణ్డు వాత్తైయణి పుదువై
పైజ్గమలత్తెరియల్ పట్టర్ పిరాన్ కోదైశొన్న
శజ్గత్తమిళ్ మాలై ముప్పదుమ్ తప్పామే
ఇజ్గిప్పరిశురైప్పారీరణ్డు మాల్వరై త్తోళ్
శెజ్గణ్ తిరుముహత్తు చ్చెల్వ త్తిరుమాలాల్
ఎజ్గుమ్ తిరువరుళ్ పెత్తిన్బురువ రెమ్బావాయ్.

అర్థము:- పజ్గక్కడల్ - అలలుగల కడలిని, కడైన్ద - మథించిన, మాధవనై లక్ష్మీపతియైన. కేశవనై - కేశవుని (క + ఈశ + హాళ్) (బ్రహ్మేశ్వరులకు కారణమైనవానిని) తిజ్గళ్ + తిరుముహత్తు - చందురుని వంటి ముఖము యొక్క, శే + ఇషయాల్ - కాంతియే ఆభరణముగా గలవాడు, (గొల్లెతల శెన్ఱి - పోయి, ఇఱైఞ్జి - స్తుతించి, అజ్గ - అచ్చట, అప్పఱై - ఆ దక్కని, (వాంఛితమును) కొణ్డు + వాత్తై - కొన్నవార్తను,

అణి + పుదువై - అందమైన పుత్తూరునందలి, పైయ్ - అందమైన, కమలమ్ - కమలములయొక్క, తణ్ - చల్లని, తెరియల్ - హారముగల, పట్టర్ - భట్టరు (విష్ణుచిత్తు), పిరాన్ - పెరియాళ్వారులయొక్క, కోదై - గోదాదేవి, శొన్న - చెప్పిన, శజమ్ + తమిళ్ - జనసామాన్య వ్యావహారిక తమిళము నందలి. మాలై - (పద్య)మాలను ముప్పదుమ్ - ముప్పదింటిని, తప్పామే - తప్పక, ఇజ్గ - ఇచ్చట. ఇప్పరశు - ఈ విధముగ, ఉరైప్పార్ - కీర్తించువారు.

ఈరు + ఇరణ్డు - నాల్గు, మాల్ - దీర్ఘములైనవి. వరై - కొండల వంటి, తోళ్ - భుజములు, శెమ్గణ్ - ఎఱ్ఱని కన్నులు, తిరుముహత్తు + శెల్వ - శ్రీముఖము అందముగల, తిరుమూరాల్ - శ్రీమహావిష్ణువుయొక్క, తిరు + అరుళ్ - శ్రీకృపను, ఎజ్గమ్ - అంతట, పెత్తు - పొంది, ఇమ్బ - ఆనందమును, ఉఋవర్ - పొందగలరు.

తాత్పర్యము:- భగవంతుడు జగత్సృష్టిస్థితిలయకారకుడు. అతని వలననే నమస్తజడాజడ ప్రపంచము జనించినది. "అతడెవ్వనివలన

జనించినవాడు" అని ప్రశ్నించిన, అతడు జననమరణములు లేని వాడం దురు. అటుగాక అతడును ఒక్కనికి జనించియే యుండవలయునన్న వా డెవ్వనికి పుట్టినాడను ప్రశ్న రాకమానదు. ఈ ప్రశ్న పరంపర కం తెక్కడ? కావున తనకు కారణము లేక అన్నింటికిని కారణమైనవాడే సృష్టికర్త.

వాడెవ్వడు? శివుడా? బ్రహ్మయా? విష్ణువా? శక్తియా? ప్రకృతియా? అని విచికిత్సాపరంపర సాగుచునే యున్నది. దీని కెవ్వరు సమాధాన మివ్వగలరు? మానవమాత్రులు స్వబుద్ధిచే వానిని తెలుసుకో లేరు గదా! దీని కేది సమాధానము.

శాస్త్రములు తెలియని విషయములు తెల్పగలవి. అవి వేద మున కంగములు, మానవ నిర్మితములు. కావున అపౌరుషేయములై పక్ష పాత భ్రమాదిశూన్యములైన వేదములనే శబ్దప్రమాణముగా గ్రహింప వలెను. "వేదైః పశ్యంతి పండితాః" ఆ పండితులు వేదములచేతనే విష యములు గ్రహింతురు.

కాని కొందరికి వేదము లప్రమాణములు. మతాభినివేశపరులైన వారు, తమ మతమే ప్రధానమని, తమ గురువు చెప్పినదే ప్రమాణమని భావింతురు. ఎంత గురువైనా మానవమాత్రుడే గదా! భ్రమ ప్రమాదము లెంత పండితునకైన తప్పవు గదా! మరి వారి పట్టుదల కేమి చేయుదము?

ఆపూర్వేదా సమాజం కతిచన,
కతిచారాజకం విశ్వమేతత్
రాజన్వత్కేచి దీశం గుణినమపి
గుణైస్తం దరిద్రాణమాహుః,
భిక్షాపన్యే సురాజం భవమితి చ
జడాస్తే శిలాతల్యకార్షుః
యే తే శ్రీరంగ హర్మ్యాంగణ
కనకలతేన క్షణం లక్ష్యమాసన్.

(శ్రీగుణరత్నప్రకాశము)

కొందరు ప్రపంచము తనంతకు తానే పుట్టినది. దానిని పుట్టించిన వాడు దాని కధిపతియైనవాడూ ఎవ్వడూ లేడందురు. కొందరు దానికి సృష్టికర్త, అధిపతి ఉన్నాడు అందురు కాని, వాడు గుణహీనుడు, నిష్క్రియుడందురు. కొంద రా యధిపతి భిక్షుకుడని (శివుని) వాదింతురు. శివుడే పరదైవమని చెప్పుదురని. అనగా ఓ లక్ష్మీదేవీ! నీ కటాక్షములు పొరని వారికి యీ జగడములు ముష్టియుద్ధములు.

"వేదాన్తాస్తత్త్వచిన్తాం మురభి
దురసి యత్పాదచిహ్నైః తరంతి"

ఎవ్వడు పరమాత్మయను విచారమున; తేలినది లక్ష్మీ పాదలాక్షా లక్షిత వక్షస్కుడే పురుషోత్తముడని.

పురుషసూక్తమున 'హ్రీశ్చ తే లక్ష్మీశ్చ పత్న్యౌ' అని యుండుట లక్ష్మీపతిత్వమే పరమపురుషత్వనిర్ణాయక ప్రమాణము–అని విశదమగుచున్నది.

ఆ మాధవుడే కేశవుడు. శివుడు విష్ణువుతో–

క ఇతి బ్రహ్మణో నామ ఈశోఽహం సర్వదేహినామ్,
ఆవాం తవాంగే సంభూతౌ తస్మాత్ కేశవనామభాక్.

అని కేశవపదమును వివరించెను.

కః అని బ్రహ్మపేరు. నేను ఈశ్వరుడు మేమిద్దరము మీనుండి జనించితిమి. మా కిరువురకు కారణభూతుడవు గాన నీవు కేశవుడవైతివి. అని–

సృష్టిలయకృత్యములు బ్రహ్మ రుద్రుల కప్పజెప్పుట వారు దేహులకు జననలయకర్తలుగా సంబంధించినవారు కాబట్టి. వారికి హేతువైన ఆ లక్ష్మీపతియే పరాత్పరుడని బ్రహ్మేశ్వరులే కీర్తించుచుండ గొల్లపిల్లలు కీర్తించు టేమి వింత!

ఆ కన్యలు పూర్ణచంద్రునివంటి కాంతివంతమైన మోములు గలవారు. ఆ కాంతియే వారి కెనలేని ఆభరణము. అట్టివారు పోయి ఆ గోవిందుని "మాధవనై కేశవనై" కీర్తించినారు.

అతనినే యేల కీర్తింప వలయుననన్న బ్రహ్మేశ్వరులు సృష్టి లయ కర్తలైన, శ్రీమన్నారాయణుడు రక్షణకర్త. కావున నాతని రక్షణార్థులు ఆశ్రయించి కీర్తింపవలయును.

అతడెవ్వరిని రక్షించినాడు అన్న,

"పజ్జక్కడల్ కడైన్ద మాధవన్" అలలుగల సముద్రాన్ని మథించినవాడు. దేవతలు రాక్షసులు చేయు యుద్ధములలో దేవతలు మృతి చెందుచున్నారు. రాక్షసులు చచ్చిన వారిని శుక్రాచార్యులు మృత సంజీవిని విద్యచే రక్షించును. కావున ఎంతకాలము దేవతలు వారితో పోరాడగలరు. పుండుపై కారముచల్లినట్లు దుర్వాసుని శాపముచే దేవతల లక్ష్మి అంతరించినది. వారు శ్రీమన్నారాయణుని శరణుజొచ్చినారు. వారిని రక్షింప నమృతసాధనకు దేవాసురులచే సాగరము మథింప జేసినాడు.

"దేవాసురులుగదా మథించిరి: నారాయణు డేమి చేసెః" నన్న మునిగి పోవు మందరమునకు కుదురుగా కూర్మావతారుడుగా నిలిచి భరించినవాడు. అమూల్యమైన జరామరణ నివారకమైన అమృతమును బలాత్కరించిన అసురులు హరింప తామసప్రకృతులైన రక్కసులు గ్రోలి అమరులై లోకపీడాకరులు గాకుండునటుల మోహినీకాంతారూపియై, వారినుండి లాగికొని దేవతలకు పంచి తన యాపన్న రక్షకతను నిరూపించుకొన్నాడు.

అట్టి శ్రియఃపతిని కృష్ణావతారుని కీర్తించి గొల్లకన్నెలు లౌకికా లౌకిక కాంక్షితముల బడసిన వృత్తాంతమును గోదాదేవి ముప్పది పాశురములుగా సామాన్యజనుల ద్రావిడభాషలో పామరజనులకునూ బోధపడవలయునని యనుగ్రహించినది.

ఆమె శ్రీవిల్లిపుత్తూరున భాగవతశేఖరుడు, అనవరత మాలికా కైంకర్యముచే నాయూరి వటపత్రశాయి నారాధించు మహానుభావుడు భగవదనుగ్రహముచేత రాజసభయందు విష్ణుపరత్వము స్థాపించి, ఆ సభావిజయవైభవమునకు దేవతాసంఘముతోడ సన్నిహితుడైన శ్రీమన్నారాయణమూర్తిని గరుడవాహనారూఢుని లక్ష్మీకాంతాలంకృతుని "పల్లాండు పల్లాండు" అని మంగళాశాసనము చేసినవాడు, తన కుమారిని రంగనాథునికి సమర్పించి భగవానునకు మామ యయి పెరియాళ్వారని వాసికెక్కినవాడు.

అతనికి తులసీవనమున లభించిన భూమ్యంశావతారిణి గోదాదేవి. ఆమె శ్రీపతినే వరించినది. అతనికి ప్రేమపాత్రురాలు. ఆమె ముడిచి విడిచిన మాలనే మహాప్రీతితో గ్రహించినాడా వటపత్రశాయి.

అట్టి యా గోదాదేవి రచించిన తిరుప్పావై యను గ్రంథము జన సామాన్య వ్యావహారికభాషయందు కూర్పబడినదిగాన పండితపామర రంజకమైనది. ఇందు ముప్పది పాశురములు గలవు. దీనిని నిత్య మను సంధించు మానవులను—

నిత్యవికాసము గలిగి కెందామరల మించిన కమదమ్ములును సదా పదునారుకళలతో విరాజిల్లు చంద్రబింబమును తిరస్కరించు తిరు ముఖ మండలమును గలిగిన దేదీవ్యమానుడును సుదర్శన పాంచజన్య కౌమోదకీ నందక పాదియు, ఆజానులంబి దీర్ఘభుజామండితుడును, భక్తాభయవరదుడును ఆర్తరక్షపరాయణుండునగు శ్రీమన్నారాయ ణుండు అనుగ్రహించును.

శ్రీమద్భాగవతార్చనం భగవతః
పూజావిధేరుత్తమం
శ్రీవిష్ణోరవమాననాద్గురు
తరం శ్రీవైష్ణవోల్లంఘనమ్,
తీర్థాదచ్యుత పాదజాద్గురుతరం
తీర్థం తదీయాంఘ్రిజం
తస్మాన్నిత్యమతంద్రితో భవ
సదా తేషాం సమారాధనే.

భగవానునకు తన్ను సేవించుటకంటె భాగవతులను స్తుతించి గౌరవించి సేవించుటలు ప్రీతిపాత్రములు. తన్ను నిందించుటకంటె భాగవతనింద తదగౌరవము తత్పీడనము, ఆగ్రహంబు గలిగించును. బిడ్డలపైన తల్లిదండ్రులకంటె చేతములపైనా జగజ్జనకునకు వాత్సల్యము అమితము కావున గోదాదేవిని, యామె గ్రంథములను అనుసంధానించుట ఆమెను గౌరవించుట భగవత్ప్రీతికరము.

భాగవతులారా! భగవంతుని యనుగ్రహము లేనిది భవసాగరము తరింపలేము. అతని యనుగ్రహమునకు పాత్రులుగావలయునన్న

తద్భక్త భక్త భక్తులను-వారియెడ ప్రకృతిధర్మమువలన నేని చే దోషములుగా మనకు కనిపించినను, వానిని మదినుంచక గుణములనే గ్రహించి సేవించవలయును. అట్లనియే శ్రుతియు మనకు బోధించు చున్నది.

"యాన్యనవద్యాని కర్మాణి తాని త్వయోపాస్యాని నో ఇతరాణి యాన్యస్మాకగ్ం సుచరితాని తాని త్వయోపాస్యాని నో ఇతరాణి" అనియే ఆచార్యులనూ బోధించినది.

అట్లొనర్చి శ్రీమన్నారాయణుని యనుగ్రహమునకు పాత్రులై తరింతురుగాక.

ఆనువాదము:

లోలోర్మి మాలికాజాల పారావార
మథనుని కేశవు మామహీశు
రాకానిశాకాంత రమణీయ ముఖు లలం
కారాంచితలు గొల్లకన్నె లచట
పాడి వాంఛితములఁబడసిన వార్తను
పెరియాళువారుల ప్రియతనూజ
శ్రీవిల్లిపుత్తూరు చేడెలలో మిన్న
గోద తమిళమునఁ గూర్చినట్టి

తెనుఁగునను శేషదాసుఁడు తీర్చినట్టి
పద్దియంబుల నిచ్చ ముప్పదియు విడక
చదువువానిన గరుణించు శౌరి చంద్ర
వదనుఁ డబ్జాక్షుఁ డాజానుబాహు వెపుడు.

## గద్యము

ఇది శ్రీ కుంటిమద్ది శ్రీనివాసాచార్యపౌత్రుడు శేషాంబా రంగాచార్య పుత్రుడు వేంకటరంగాచార్య పాలకపుత్రుడు శ్రీహయవదన దివ్యపాదుకా సేవక శ్రీమదభినవ రంగనాథచరణనలిన విన్యస్త సమస్తాత్మభరుడునగు శేషదానునిచే రచింపబడిన తిరుప్పావై పాశురార్థవివరణము సంపూర్ణము.

T.T.D. Religious Publications Series No. : 382
Price : Rs. 35/-

ధర్మాన్ని కాపాడండి. ధర్మమే మిమ్మల్ని కాపాడుతుంది

తిరుమల తిరుపతి దేవస్థానములు

Printed and Published by Sri K.V.Ramanachary, I.A.S., Executive Officer,
T.T.Devasthanams, Tirupati and printed at T.T.D. Press, Tirupati.